fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 71 | విజయవాడ, మంగళవారం 13 మార్చి 2018 | 12+12 పేజీలు వెల : 4.00

రైల్వే జోన్ ఇవ్వలేం


తేల్చిచెప్పిన కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. ఉత్తరాంధ్ర ప్రజల డిమాండ్‌డైన రైల్వేజోన్ ఆశలపై నీళ్లు చల్లింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రైల్వేజోన్ ఇవ్వడం సాధ్యం కాదని కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గాబా తేల్చి చెప్పారు. సోమవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శి రాజీవ్ గాబా నేతృత్వంలో తెలుగు రాష్ట్రాల అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్, ఉన్నతాధికారి మిగతా 9లో

మట్టి పాదాల మహా విజయం

ఫలించిన లాంగ్‌మార్చ్



- రైతు ఉద్యమానికి తలొగ్గిన ఫడ్నవీస్ సర్కార్
- డిమాండ్ల పరిష్కారానికి ఆరుగురు సభ్యులతో కమిటీ
- అన్నదాతలకు అడుగడుగున ముంబయి ప్రజల సహకారం
- రైతులు ఆగ్రహిస్తే ప్రభుత్వాలుండవ్ : సీతారాం ఏచూరి

ముంబయి: మహారాష్ట్ర రైతుల మహాపాదయాత్ర ఫలించింది. చెప్పులు లేకపోయినా, పాదాలు కమిలిపోయి నెత్తురోడుతున్నా ఏ మాత్రం వెనుకంజ వేయని రైతాంగ పట్టుదల ముందు మహారాష్ట్ర ప్రభుత్వం తలవంచింది. రైతుల డిమాండ్లను అంగీకరిస్తున్నట్లు ప్రకటించింది స్వామినాథన్ కమిటీ సిఫార్సులు, సంపూర్ణ రుణమాఫీ, అటవీ భూముల యాజమాన్య హక్కులను ఆదివాసీలు, రైతులకు అప్పగించడం వంటి రైతులు లేవనెత్తిన అన్ని డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని మిగతా 8లో

అసెంబ్లీకి పాకిన మిత్రభేదం

- శాసనసభ, మండలిలో వాగ్వివాదం
- అరుపులు, కేకలు
- అయినా మిత్రపక్షమే
- టిడిపి, బిజెపి విచిత్ర వైఖరి
- సరైన కార్యాలయం కూడా ఇవ్వలేదు : బిజెపి
- బిఏసిలో కూర్చోమన్న స్పీకర్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తొలిసారిగా అసెంబ్లీలో టిడిపి, బిజెపి సభ్యులు వాగ్వివాదానికి దిగారు. రెండు పక్షాల సభ్యుల అరుపులు, కేకలతో మండలి దద్దరిల్లి పోయింది. ఒకరిపై ఒకరు వ్యంగ్యాస్త్రాలు, విమ ర్శలు గుప్పించుకున్నారు. ఒకానొక సమయంలో టిడిపి సభ్యులు సహనం కోల్పోయి 'మా సొమ్ముతో బతుకుతున్నారంటూ' బిజెపి సభ్యులపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఒకరికొకరు దూషణలకు దిగుతుండటంతో మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అసహనం వ్యక్తం చేశారు. సభ్యులు నేరుగా దూషించుకుంటుంటే ఛైర్ ఎందుకని తీవ్రస్థాయిలో మందలించారు. అంత గొడవ జరుగుతున్నా మేమిద్దరం మిత్రపక్షమే అంటూ రెండు పక్షాల సభ్యులు వ్యాఖ్యానించడం విచిత్రం. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై అసెంబ్లీ, మండలిలో చర్చ మొదలైంది. ఈ సందర్భంగా బిజెపి నమ్మించి మోసం చేసిందని, తెలుగు ప్రజలను అవమానపరిచిందని మండలిలో టిడిపి సభ్యులు వై.వి.బి.రాజేంద్ర ప్రసాద్ వ్యాఖ్యానిం చారు. బిజెపి మ్యానిఫెస్టోను చదివి వినిపించారు. బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా అదే రీతిలో స్పందించారు. టిడిపి ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో చెప్పాలని ప్రశ్నించారు. మేం తెలుగు ప్రజలమని, బిజెపి తమను మిగతా 9లో

బిజెపికి మిత్రపక్షంగానే ఉన్నాం

మండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వంలో నేటికీ బిజెపికి మిత్ర పక్షంగానే కొనసాగుతున్నామని శాసన మండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సోమవారం జరిగిన గవర్నర్ ప్రసంగం పై ధన్యవాదాల తీర్మానంపై సిఎం మాట్లాడుతూ కేంద్రంలో తామెప్పుడు భాగస్వామ్యంలో ఉన్నా పదవుల కోసం ఆరాటపడలేదన్నారు. గతంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు అడిగితే ఆరేడు మంత్రి పదవులు ఇచ్చి ఉండే వారని, వాటికోసం ఎన్నడూ తాపత్రయపడలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎన్టీఆర్ గౌరవాన్ని పెంచితే, తాను ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నానన్నారు. కియో మోటార్స్‌తో సహా రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధినంతా కేంద్రం చేసినట్టు బిజెపి సభ్యులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి మిగతా 9లో


తెలంగాణ సభలో కాంగ్రెస్ రభస

- పేపర్లు చింపి గవర్నర్‌పైకి విసిరిన సభ్యులు
- ఇయర్‌ఫోన్స్ విసిరిన కోమటిరెడ్డి
- స్వామిగౌడ్ కంటికి గాయం

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజు అనేక అనూహ్య సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఉదయం 10 గంటల 5 నిమిషాలకు గవర్నర్ తన ప్రసంగాన్ని చదవడం ప్రారంభించారు. ఐదు నిముషాలు మౌనంగా ఉన్న కాంగ్రెస్ సభ్యులు ఆ తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. పోడియంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని మార్షల్స్ లోపలికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో మార్షల్స్‌కు, కాంగ్రెస్ సభ్యులకు మధ్య తోపులాట జరిగింది. కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి కాగితాలు చింపి గవర్నర్‌పైకి విసిరేసే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ తదితరులు కూడా కాగితాలు చింపి విసిరేశారు. ఈ గలాభాలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇయర్‌ఫోన్స్ విసిరేశారు. అవి మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ కంటికి తగిలాయి. దీంతో ఆయన్ను సరోజినీదేవి కంటి ఆస్పత్రికి తరలించారు. అయితే అదంతా కట్టు కథ అని కాంగ్రెస్ సభ్యులు కొట్టిపారేశారు. దీనిపై మీడియా పాయింట్‌లో కాంగ్రెస్, టీఆర్ఎస్ సభ్యులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. తాను ఇయర్‌ఫోన్స్ విసిరిన చిత్రాలను మాత్రమే చూపుతున్నారని, అవి ఎవరికి తగిలాయో కూడా చూపాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాలు విసిరారు. తాను తప్పు మిగతా 9లో

లాహిరి.. లాహిరి.. లాహిరిలో..!



భారత్ పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ సోమవారం ప్రధాని మోడితో కలిసి వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా గంగా నదిలో బోటు షికారులో పాల్గొన్నారు

నేపాల్‌లో విమాన ప్రమాదం

50 మంది మృతి



ఖాట్మండూ: బంగ్లా దేశ్‌కు చెందిన ప్రయాణీకుల విమానం ఒకటి నేపాల్ రాజధాని ఖాట్మండూ విమానాశ్రయంలో సోమవారం నాడు ఘోర ప్రమాదానికి గురైంది. అమెరికాలోని డగ్లస్ నుండి ఢాకా వెళ్తూ ఇక్కడి త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో లాండింగ్ అవుతున్న సమయంలో నేలకు ఢీకొన్న విమానం పక్కనే వున్న ఫుట్ బాల్ గ్రౌండ్‌లోకి దూసుకెళ్లి మంటల్లో చిక్కుకుంది. మొత్తం 67 మంది ప్రయాణీకులున్న ఈ విమానంలో 17 మంది మాత్రమే గాయాలతో బయటపడ్డారు. మిగిలిన 50 మంది మరణించినట్లు అధికారులు ప్రకటించారు. 31 మంది ప్రయాణీకులు ప్రమాద స్థలంలోనే మరణించగా మిగిలిన వారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మరణించారని, మరో 17 మంది గాయాలతో చికిత్స పొందుతున్నారని పోలీసు ప్రతినిధి మనోజ్ న్యూపానే వివరించారు. రన్‌వే వెనుక మంటల్లో చిక్కుకున్న విమానం నుండి దట్టమైన పొగలు వస్తున్న ఫొటోలను ప్రత్యక్ష సాక్షులు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. మరో విమానం బయల్దేరేందుకు సిద్ధంగా టర్మాక్‌పై నిలిచి వున్న దృశ్యాలు ఈ ఫొటోలలో కన్పిస్తున్నాయి. విమానంలో 67 మంది ప్రయాణీకులు, నలుగురు సిబ్బంది వున్నారని విమానాశ్రయ ప్రతినిధి ప్రేమ్‌నాథ్ ఠాకూర్ చెప్పారు. క్షతగాత్రుల్లో 20 మందిని ఆస్పత్రికి తరలించామని, విమానంలో చిక్కుకున్న వారిని విమానాన్ని ముక్కలు చేసి రక్షించేందుకు పోలీసులు, సైన్యం ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. అత్యవసర సహాయక బృందాలతో వాహనాలు ప్రమాద ఘటనా స్థలంలోకి దూసుకు వెళ్తుండగా కొంతమంది ప్రజలు దూరంగా నిల్చుని తిలకిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో మిగతా 9లో

ప్రజాందోళనపై పైశాచికం



- పోలీసుల వైఖరితో ఒంగోలు కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం
- 50 మంది సిపిఎం నాయకుల అరెస్టు
- నాన్‌బెయిలబుల్ కేసు నమోదు

ప్రజాశక్తి-ఒంగోలు టౌన్

వెనుకబడిన ప్రకాశం జిల్లాకు న్యాయం జరగాలంటే బడ్జెట్‌లో ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులు చేపట్టిన రిలే దీక్షల్లో భాగంగా మూడో రోజైన సోమవారం నిర్వహించిన 'చలో కలెక్టరేట్' ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టరేట్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న 50 మంది సిపిఎం నేతలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. వివిధ స్టేషన్లకు తరలించి నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మిగతా 9లో

చంద్రబాబు వల్లే హోదాకు విఘాతం

గుంటూరు జిల్లాలోకి జగన్ పాదయాత్ర



గుంటూరు జిల్లా బాపట్ల బహిరంగ సభలో మాట్లాడుతున్న జగన్

12



పవన్ ఇంటికి భూమిపూజ

- ఇకపై ఇక్కడి నుండే పార్టీ కార్యక్రమాలు
- 14న ఆవిర్భావ సభలో రాజకీయ దిశ, దశ వెల్లడి

9

15న ఆదరణపై ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఆదరణ పథకంపై ఈ నెల 15న విజయవాడలో రాష్ట్ర స్థాయి ఎగ్జిబిషన్ నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం అసెంబ్లీ సమావేశ మందిరంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆదరణ పథకం అమలుకు సంబంధించి పలు అంశాలతో పాటు, ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రఖ్యాతి గాంచిన పలు సంస్థలతో ఎక్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున లబ్ధిదారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

సినీ సందడి



కిరాక్‌పార్టీ చిత్రం ప్రమోషన్ భాగంగా సోమవారం ఆ చిత్ర బృందం తిరుపతిలో సందడి చేశారు.

హోరెత్తించిన 'కిరాక్ పార్టీ'

ప్రజాశక్తి-తిరుపతి సిటి
కిరాక్ పార్టీ బృందం తిరుపతి సంధ్య థియేటర్‌లో అభిమానులను హోరెత్తించింది. త్వరలో విడుదల కానున్న ప్రముఖ సినీహీరో నిఖిల్ నటించిన 'కిరాక్ పార్టీ' చిత్రం విడుదల సందర్భంగా పోస్టర్ పబ్లిసిటిలో భాగంగా సోమవారం తిరుపతికి విచ్చేశారు. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ.. ఈ నెల 16న కిరాక్ పార్టీ చిత్రం విడుదల కానుందన్నారు. ఇది పూర్తిగా కళాశాల జీవితానికి సంబంధించిన చిత్రం అయినా కుటుంబ సమేతం చూడవచ్చన్నారు. పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ చిత్రం ఉంటుందని, ప్రతి ఒక్కరూ థియేటర్‌కు వచ్చి చిత్రాన్ని చూడాలని కోరారు. హీరోయిన్ సిమ్రాన్ మాట్లాడుతూ.. ఎవ్వరైనా పైరసికి పాల్పడితే వారిని అడ్డుకుని ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తిరుపతికి చెందిన నటుడు నవీన్ మాట్లాడుతూ.. తాను ఇదే థియేటర్‌లో బాల్కనీలో కూర్చోని సినిమాను చూశానని, ఇప్పుడు ఇదే థియేటర్‌లో తెరపై నేను నటించిన సినిమా ప్రదర్శనకు సిద్ధమవుతుందన్నారు. తిరుపతిలో థియేటర్‌లో కూర్చోని ఈ చిత్రాన్ని కూడా ప్రేక్షకులతో కలిసి చూస్తానన్నారు. అనంతరం తిరుపతిలో మొదటి పోస్టర్‌ను చిత్ర బృందం అతికించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం నవీన్, శరణ్య, డైరెక్టర్ చరణ్, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.



శ్రీలంక తీరంలో తీవ్ర అల్పపీడనం

36 గంటల్లో వాయుగుండం

ప్రజాశక్తి-విశాఖపట్నం
నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారం నాటికి హిందూ మహా సముద్రంలో భూ మధ్య రేఖ వద్ద శ్రీలంకకు ఆనుకుని తీవ్ర అల్పపీడనంగా మారిందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతోందని, తర్వాత పూర్తిగా వాయువ్య దిశలో ముందుకు కదిలి ఆగ్నేయ అరేబియా సముద్రంలో 36 గంటల్లో వాయుగుండంగా మారుతుందని తెలిపింది. దీని ప్రభావం రాష్ట్రంపై ఉండదని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తా, రాయలసీమల్లో వేడి వాతావరణమే కొనసాగుతుందని చెప్పారు. వాయుగుండంగా మారితే తమిళనాడు, కేరళ, శ్రీలంక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత డైరక్టర్ రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు. దీని ప్రభావంతో ఉత్తర, పడమటి గాలులు వీస్తాయన్నారు. ఉత్తర భారతదేశంలో వేడి పరిస్థితులున్నందున ఆ గాలులు వేడిగా ఉంటాయని వాయుగుండం ప్రభావంతో రాష్ట్రం మరింత వేడెక్కుతుందన్నారు.

అసెంబ్లీ ముగిశాక జిల్లాల పర్యటనలు

- కేంద్రం సహకరించకున్నా ముందుకెళ్లాలి
- విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి
- సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
అసెంబ్లీ సమావేశాలు ముగియగానే జిల్లాల్లో పర్యటించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అభివృద్ధి, ప్రాజెక్టు నిర్మాణ పనులను స్వయంగా పరిశీలిస్తానన్నారు. సోమవారం ' నీరు - ప్రగతి ' పై అధికారులతో సిఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్రం నుంచి సహకారం లేకున్నా స్వయం కృషితో ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమర్ధ నీటి నిర్వహణ ద్వారా వ్యవసాయం అనుబంధ రంగాలలో దిగుబడులు తగ్గకుండా కృషి చేస్తున్నామన్నారు. ఈ నెలాఖరులోగా ఉపాధి హామీ లక్ష్యాల్ని చేరుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపులో జాప్యం ఉండకూడదన్నారు. వేసవిలో వడగాలులు, అకాల వర్షాలు వంటి విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీరు, విద్యుత్, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు. సూక్ష్మ సేద్యం నిర్దేశిత లక్ష్యంలో 70 శాతం మాత్రమే పూర్తయ్యిందని, మిగిలిన 30 శాతమైన లక్షా 40 వేల ఎకరాల్లో కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. ఉద్యాన రంగం నుంచి 25 శాతం ఆదాయం వచ్చే దిశగా ముమ్మరం చేయాలన్నారు. జీబా వినియోగంపై రైతుల్ని చైతన్య పరచాలన్నారు. జీబా వినియోగానికి ఎకరానికి రూ.2,500 ఖర్చవుతుం దన్నారు. దీనివల్ల నాలుగైదు రోజులపాటు నీటి తడి భూమిలో ఇంకకుండా సమర్ధ నీటి నిర్వహణకు అవకాశముంటుందన్నారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా అనంతపురం జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో జీబా వినియోగం ద్వారా కరువును అధిగమించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో పోషకాహార ఉద్యానవనాలను (న్యూట్రీ గార్డెన్స్) పెంచాలని, వాటి నుంచే తల్లులకు, చిన్నారులకు పోషకాహారం అందిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై ఉదాసీనంగా ఉండొద్దని అధికారుల్ని హెచ్చరించారు. గ్రామీణ, వ్యవసాయ, ఉద్యాన శాఖ, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు, వివిధ జిల్లా కలెక్టర్లు టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

చింటూకు జీవిత ఖైదు

- 13 మంది నిర్దోషులుగా ప్రకటన
- బాంబుపేలుడు కేసులో సంచలన తీర్పు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్
చిత్తూరు మాజీ ఎంఎల్ఎ సికెబాబుపై జరిగిన బాంబు దాడి కేసులో సోమవారం 9వ అదనపు న్యాయమూర్తి కపర్థి తుది తీర్పును వెల్లడించారు. బాంబు పేలుడు కేసులో ఎ2 ముద్దాయిగా ఉన్న చింటు అలియాస్ చంద్రశేఖర్‌కు జీవిత ఖైదు వేయడంతో పాటు, ఈకేసులో 13 మందిని నిర్ధోషులుగా ప్రకటిస్తూ తీర్పునిచ్చారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు మాజీ ఎంఎల్ఎ సికెబాబుపై 2007, డిసెంబర్ 31వ తేది ఉదయం 8.50 గంటలకు బాంబు దాడి జరిగింది. క్యాలీస్ వాహనంలో ఇంటి నుంచి బయల్దేరిన సికెబాబు కట్టమంచిలోని శ్రీ సాయిబాబా ఆలయం ఎదురుగా రెడ్డిరెడ్డి కాలనీ కల్వర్టు వద్దకు రాగానే మందుపాతర పేలింది. ఈ ఘటనలో సికెబాబు గన్‌మేన్ సురేంద్ర తీవ్రంగా గాయపడి చికిత్స కోసం వేలూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వాహనంలో ప్రయాణిస్తున్న సికెబాబు అనుచరులు గోవిందయ్య, పురుషోత్తం, నాగరాజు, శివప్రసాద్‌రెడ్డి, రహ్మతుల్లా, శరవణ, సూరిలు తీవ్రంగా గాయపడ్డారు. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచనలనమైంది. సికెబాబు ఫిర్యాదు మేరకు స్థానిక ఒకటో పట్టణ పోలీసులు 17మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మొదటి ముద్దాయిగా ఉన్న కఠారి మోహన్, గిరిప్రతాప్ రెడ్డి, వెంటక స్వామిలు మృతి చెందారు. సాక్షులను విచారించిన తరువాత బాంబు పేలుడు కేసులో ఎ2గా ఉన్న చింటూకు జీవిత ఖైదు విధించి కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. మాజీ ఎంఎల్ఎ సికెబాబుపై బాంబు పేలుడు కేసు తుది తీర్పు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా కోర్టు ఎదుట భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. నగరంలో 144 సెక్షన్ అమలు చేశారు.

శ్రీరామ్ చిట్స్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-తణుకు రూరల్
పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని శ్రీరామ్ చిట్స్ అండ్ గోల్డ్ లోన్ బ్రాంచిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బ్రాంచి మేనేజర్ ఎం.సురేష్, అగ్నిమాపక శాఖాధికారులు తెలిపిన వివరాలిలా ప్రకారం.. స్థానిక ఆంధ్రాబ్యాంక్ వీధిలో ఉన్న అపార్ట్‌మెంట్ సెకండ్ ఫ్లోర్‌లో శ్రీరామ్ చిట్స్ కార్యాలయం ఉంది. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల తర్వాత కార్యాలయంలో మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. కార్యాలయ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కార్యాలయంలోని ఇన్వర్టర్ బ్యాటరీల కారణంగా మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో రూ.35 లక్షలకుపైగా ఆస్తినష్టం, విలువైన డాక్యుమెంట్లు, ఫర్నీచర్, కంప్యూటర్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయని ఇన్‌ఛార్జి ఫైరాఫీసర్ గురు ప్రసాద్ తెలిపారు.

ప్రధానిని నిలదీయలేని వైసిపి

- రాష్ట్రాన్ని మరోసారి విడగొట్టేందుకు బిజెపి కుట్ర
- మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ప్రత్యేక హోదా కావాలని ప్రధానిని నిలదీయలేని, చేతకాని పార్టీ వైసిపి అని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. సచివాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌కు కేసులు, కుటుంబం తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. ప్రతిపక్ష పార్టీ రాజకీయాల్ని నవ్వులపాల్జేస్తోందని, వేర్పాటువాదంతో బిజెపి మరోసారి నవ్యాంధ్రను విడగొట్టడానికి కుట్రపన్నుతోందని అన్నారు. కేసులు, ఆస్తులు అంటూ జగన్ రాజకీయం సాగుతోందన్నారు. ఢిల్లీ పైరవీలు, లాబీయింగ్ చేసే బాధ్యత ఎంపి విజయసాయిరెడ్డికి జగన్ అప్పగించారన్నారు. ఒకవైపు ప్రత్యేక హోదా ఇచ్చేదిలేదని అరుణ్ జైట్లీ స్పష్టం చేస్తుంటే, మరోవైపు ప్రధానిపై తమకు నమ్మకముందని, ఆయన తప్పకుండా హోదా ఇస్తారని చెబుతూ, కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడతామని ప్రతిపక్షం చెబుతోం దన్నారు. బిజెపి-టిడిపి బంధం తెగిపోతే, కమలం పార్టీతో తాము జతకడతామని వైసిపి నాయకుడు బొత్స సత్యనారాయణ నిస్సిగ్గుగా ప్రకటించారన్నారు. శాసనసభలో ప్రభుత్వం తప్పొప్పుల్ని సభ దృష్టికి తీసుకురాకుండా జగన్ వీధులు పట్టుకుని తిరుగుతున్నారన్నారు. తమ పార్టీకి నైతిక విలువలే ముఖ్యమన్నారు. బిజెపి మరోసారి ఏపీని విడగొట్టడానికి కుట్ర పన్నుతోందన్నారు. రాయలసీమకు అన్యాయం జరిగిదంటూ బిజెపి నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. రాయలసీమ వాదాన్ని వినిపిస్తున్న బిజెపిని వైసిపి నేతలు నిలదీయడంలేదన్నారు.

ముగ్గురూ ఏకగ్రీవమే

నామినేషన్లు దాఖలు చేసిన రవీంద్ర, రమేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రం నుండి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ముగ్గురు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో దాదాపు ఏకగ్రీవమయ్యారు. స్ర్కూటినీ అనంతరం అసెంబ్లీ కార్యదర్శి ఎన్నిక ప్రకటన చేయనున్నారు. రాష్ట్రం నుండి రాజ్యసభకు మూడుసీట్లు ఖాళీ అయ్యాయి. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న చిరంజీవి, రేణుకాచౌదరి, దేవేందర్‌గౌడ్ కాల పరిమితి వచ్చే నెల రెండోతేదీతో ముగియనుండటంతో ఎన్నిలకు నోటిఫికేషన్ జారీచేశారు. దీనిలో అధికార టిడిపికి రెండు సీట్లు, ప్రతిపక్ష వైసిపికి ఒకటి దక్కనున్నాయి. టిడిపి తరపున సిఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్‌ను పార్టీ ఎంపిక చేసింది. వైసిపి తరపున వేమారెడ్డి ప్రభాకరరెడ్డిని ఎంపిక చేశారు. ఇటీవలే ఆయన కూడా నామినేషన్ దాఖలు చేశారు. మరో నామినేషన్ లేకపోవడంతో ముగ్గురి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. దీంతో 2024 వరకు వీరు ముగ్గురూ రాజ్యసభ సభ్యులుగా కొనసాగనున్నారు. అనంతరం టిడిపి అభ్యర్థులు సిఎం చంద్రబాబు, లోకేష్‌ను కలిశారు. అంతకుముందు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు సిఎం రమేష్, రవీంద్రకుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పార్టీకి చేసిన కృషికి గుర్తింపుగా వారిద్దరినీ ఎంపిక చేశామన్నారు. రవీంద్రకుమార్ ఎప్పట్నించో టిడిపి తరపున కేసులు వాదిస్తున్నారని, అతనికి తగు గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతోనే సీటు కేటాయించామని తెలిపారు. రాయలసీయలో పార్టీని బలోపేతం చేయడంలో సిఎం రమేష్ కృషి చేస్తున్నారన్నారు.

కేంద్రంపై పోరాడేందుకు ఏకమవ్వాలి

పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నందున అందరూ ఏకమై కేంద్రంతో పోరాడాలని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. విజయవాడ పిసిసి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో కేంద్రంలో యుపిఎ అధికారంలోకొస్తే తొలి సం తకం ఏపీకి ప్రత్యేకహోదా కోసమేనని రాహుల్‌గాంధీ మాట ఇచ్చారన్నారు. ఏపీకి హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు ఎఐసిసి కట్టుబడి ఉందన్నారు. విభజనకు అందరూ బాధ్యులేనని, కాంగ్రెస్ పార్టీ ఒక్కటే కాదన్నారు. కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. థర్డ్ ఫ్రంట్ అని ఎవరై నా మాట్లాడితే అది బిజెపితో చేసుకున్న రహస్య ఒప్పందమేనని రఘువీరా పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

టెట్‌లో తప్పు ప్రశ్నలకు మార్కులు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ప్రశ్నాపత్రాల్లో తప్పుగా వచ్చిన ప్రశ్నలకు మార్కులు ఇవ్వనున్నారు. ప్రాథమిక 'కీ'పై వచ్చిన అభ్యంతరాలపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నిపుణుల కమిటీని నియమించారు. మూడు పేపర్లపై మొత్తం 19,314 అభ్యంతరాలొచ్చాయి. అయితే వీటిల్లో 99.40శాతం నిరాధారమైన అభ్యంతరాలు ఉన్నాయని టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఆప్షన్స్‌లో లేని వాటిని పరిగణలోకి తీసుకున్నామని తెలిపారు. ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉన్నాయని, వీటిల్లో ఏది రాసినా పరిగణలోకి తీసుకున్నామని పేర్కొన్నారు. పేపర్-1కు 5మార్కులు, పేపర్-2(మ్యాథ్స్)కు 8 మార్కులు, పేపర్-2(సోషల్)కు 3 మార్కులు కలిపామని తెలిపారు.

పదికి పకడ్బందీగా ఏర్పాట్లు

- అరగంట ముందే చేరుకోవాలి
- హాల్ టికెట్లు ఆపితే చర్యలు
- మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఈ నెల 15 నుంచి 29 వరకు జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు నిర్వహించాలని మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 6లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారని, 2,834 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల గుర్తింపునకు లోకేషన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయాలపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు నేలపై కూర్చొని పరీక్ష రాయడానికి వీల్లేదని, అవసరమయితే ఫర్నిచర్‌ను అద్దెకు తీసుకోవాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 0866-2974450, 0866-2974550 నెంబర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ కంట్రోల్ రూం, టోల్ ఫ్రీనెంబర్ ఏర్పాటు చేశామన్నారు. హాల్ టికెట్ చూపిస్తే పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించొచ్చన్నారు. ఫీజు బకాయిల పేరుతో ప్రైవేట్ పాఠశాలలు హాల్ టికెట్లు నిలిపివేస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె సంధ్యారాణి, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ జి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మా కారణంగానే.. చంద్రబాబు యూ టర్న్

వైసిపి నేత భూమన

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో
ప్రత్యేకహోదాపై తాము చేస్తున పోరాటాన్ని చూసిన తరువాతే చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారని వైసిపి ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆ తరువాతే హోదాపై కేంద్రంతో ఘర్షణకు దిగారని, మంత్రివర్గం నుంచి వైదొలిగారని చెప్పారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకొచ్చాక ఏ ఒక్క హామీని నెవేర్చలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని, ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చడం లేదని తెలిపారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ తమ నాయకుడు జగన్ ప్రజాక్షేత్రంలోకి వెళ్లారన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాల్ని గమనిస్తున్న ప్రజలు రాబోయే రోజుల్లో ఆయనకు తగిన గుణపాఠం చెబుతారన్నారు..

ఘనంగా నంది నాటకోత్సవాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి
తూర్పుగోదావరి జిల్లా కాకినాడ యంగ్‌మెన్ హ్యాపీ క్లబ్ దంటు కళా క్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర, టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలు-2017 ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పలు నాటకాలను ప్రదర్శించి, ఆహూతులను అలరించారు. శ్రీ సీతారామాంజనేయ నాట్యమండలి సమర్పణలో దర్శి వీరరాఘవస్వామి రచించిన సీతా కళ్యాణం పద్య నాటకాన్ని ఎస్‌కె అమీర్ దర్శకత్వంలో ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తదుపరి దంపూరి కళానికేతన్, తణుకుకు చెందిన షణ్ముఖి ఆంజనేయరాజు కళా పీఠం సమర్పణలో బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర నాటకాన్ని దంపూరి దుర్గాప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించారు. ఏ యుగంలోనైనా సత్యమే జయిస్తుందనే విషయాన్ని సత్యహరిశ్చంద్ర నాటకం ద్వారా తెలిపారు. విశాఖపట్నానికి చెందిన బాలభారతి నాట్యమండలి సమర్పణలో విద్వాణ్, కన్వశ్రీ రచించిన శశిరేఖా పరిణయం పద్యనాటకాన్ని మోహన్ సతీష్ దర్శకత్వంలో ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

ప్రత్యేకం

గోప్యంగా సిట్ నివేదిక

- జిఎడికి అందినా రెవెన్యూకి చేరని వైనం
- రెండు శాఖల మధ్య సిట్ వివాదం
- రేపు సభలో చర్చకు వచ్చే అవకాశం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
విశాఖ భూముల కుంభకోణంపై సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) సమర్పించిన తుది నివేదిక సాధారణ పరిపాలనా శాఖ(జిఎడి)లో గోప్యంగా ఉంది. భూములకు సంబంధించిన వ్యవహారం అయినప్పటికీ, ఇప్పటివరకు రెవెన్యూ శాఖకు కనీస వివరాలు అందలేదని తెలిసింది. దీనిపై ఆ శాఖ అధికారులు గుర్రుగా ఉన్నారు. బుధవారం భూముల ఆక్రమణలపై ప్రత్యేక చర్చ ఉన్నందున విశాఖ సిట్‌పైనా చర్చ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు ఆ నివేదిక బయటకు రాకపోవడం గమనార్హం.

వాస్తవంగా విశాఖ భూములపై వివాదం బయటపడిన వెంటనే సిట్‌ను ఏర్పాటుచేస్తూ జిఎడి ఉత్తర్వులు జారీచేసింది. తరువాత దర్యాప్తు కాలం సరిపోదంటూ మరో రెండు నెలలపాటు సిట్‌ను పొడిగించారు. అది కూడా జనవరితో పూర్తి కావడంతో సిట్ తన పూర్తి నివేదికను అందించింది. అయితే భూములకు సంబంధించిన వ్యవహారం అయినందున రెవెన్యూ శాఖ అధికారులను కూడా బాధ్యులుగా చేయాల్సి ఉన్నప్పటికీ, కేవలం సాధారణ పరిపాలనశాఖే అంతా తానై వ్యవహరించడాన్ని రెవెన్యూ శాఖ జీర్ణించుకోలేకపోతోంది. దీనిపై ఆ శాఖ అధికారులు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. దర్యాప్తు, వివరాల సేకరణ వంటి అంశాలు, సిట్ ఏర్పాటును నేరుగా సాధారణ పరిపాలన శాఖే పర్యవేక్షించినప్పటికీ, కనీస సమాచారం కూడా రెవెన్యూ శాఖకు లభించడం లేదన్న భావాన్ని ఆ శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. బుధవారం భూముల ఆక్రమణలపై ఉన్న ప్రశ్నకు రెవెన్యూ శాఖ సమాధానం చెప్పాల్సి ఉంది. ఇందులోనే విశాఖ భూములపైనా చర్చకు వచ్చే అవకాశాలున్నాయి. అయితే ఇప్పటివరకు తమకు నివేదిక అందలేదని, ఇలాంటి పరిస్థితుల్లో సమాధానం ఎలా తయారుచేసుకోవాలో అర్థం కావడం లేదని రెవెన్యూ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. కనీసం సిట్ తుది నివేదిక వచ్చిన సమాచారాన్ని కూడా తమకు చెప్పలేదని ఆయన అంటున్నారు. ఇదే విషయంపై ఆ శాఖ మంత్రి కెఇ కృష్ణమూర్తి కూడా కొంత అసహనంగా ఉన్నట్లు తెలుస్తోంది. సిట్ నివేదికపై ఇప్పటివరకు తమ వద్ద సమాచారం లేదని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం.

సంక్షిప్తం

పోలీస్ డ్యూటీ మీట్ విజేతలకు డిజిపి అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు చెన్నైలో జరిగిన ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్ పోటీల్లో విజయం సాధించిన ఆంధ్రప్రదేశ్ పోలీసులను రాష్ట్ర డిజిపి మాలకొండయ్య అభినందించారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం విజేతలందరూ డిజిపిని కలిశారు. రాజమండ్రి క్లూస్ టీమ్ విభాగానికి చెందిన పిసిలు అశోక్‌కుమార్, ఆనంద్, కృష్ణాజిల్లా క్లూస్ టీమ్‌కు చెందిన పవన్ కుమార్, ఆక్టోపస్ హెడ్ కానిస్టేబుల్ కెడిఆర్‌వి ప్రసాద్‌లు వీడియోగ్రఫీ విభాగంలో రజతం గెలుచుకున్నారు.

రాష్ట్రంలో 52కు చేరిన ప్రాధాన్య ప్రాజెక్టులు

పోలవరం సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో ప్రాధాన్య ప్రాజెక్టుల సంఖ్య 52కు చేరిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇప్పటివరకు 50 ప్రాధాన్య ప్రాజెక్టులుండగా వాటికి మరో రెండు అదనంగా చేరాయన్నారు. పోలవరంతో సహా ఇతర ప్రాధాన్య ప్రాజెక్టులపై సిఎం చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని గుండ్రేవుల రిజర్వాయర్, తోటపల్లి కుడి, ఎడమ కాలువల అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఇప్పటివరకు 8 ప్రాజెక్టుల్ని ప్రారంభించగా, మరో 5 ప్రాజెక్టులు పూర్తయ్యాయన్నారు. మరో 15 ప్రాజెక్టులు జూన్ 15 నాటికి సిద్ధం కానున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్పిల్ వే, స్పిల్ చానెల్, అప్రోచ్, పైలెట్ చానల్, స్పిల్ చానల్ బ్రిడ్జి, డయాఫ్రమ్‌వాల్, రేడియల్ గేట్ల నిర్మాణం ద్వారా వరద నీటి మళ్లింపునకు మొత్తం రూ.9,189.81 కోట్ల వ్యయమయ్యిందన్నారు.

నగదు కొరత ఇంకెన్నాళ్లు?

ప్రశ్నించనున్న వైసిపి, టిఆర్ఎస్ ఎంపీలు

16న లోక్‌సభలో చర్చకు అవకాశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
రెండు తెలుగు రాష్ట్రాల్ని వేధిస్తున్న నగదు కొరతపై లోక్‌సభలో ప్రశ్న రికార్డయ్యింది. రెండు రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలకు చెందిన ఇద్దరు పార్లమెంట్ సభ్యులు ఈ ప్రశ్నను సంధించారు. బ్యాంకుల్లో నగదు కొరత, నగదు లేక మూతపడుతున్న ఎటిఎంలపై టిఆర్ఎస్‌కు చెందిన ఎంపి ప్రభాకర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ నుంచి వైసిపి ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ ప్రశ్నలు పంపించారు. దీనిపై 16న లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పనుంది.

2016 నవంబర్‌లో పెద్ద నోట్లు రద్దు చేసినప్పటి నుంచి తెలంగాణ, ఆంధ్రాల్లో నగదు కొరత వేధిస్తోంది. మధ్యలో కొంత ఊరట కలిగినప్పటికీ, మళ్లీ రెండు నెలలుగా ఈ సమస్య తారాస్థాయికి చేరుకుంది. ఇదే అంశాన్ని ఇద్దరు ఎంపీలు ప్రశ్న రూపంలో లోక్‌సభకు అందించారు. రెండు రాష్ట్రాల్లో ఉన్న బ్యాంకులు, ఎటిఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ వాటి వివరాలు అందించాలని కోరారు. అలాగే పెద్ద సంఖ్యలో ఎటిఎంలు పనిచేయడం లేదని, ఎప్పుడు చూసినా నో క్యాష్ బోర్డులు కనిపిస్తున్నాయనే విషయం కేంద్రం దృష్టికి వచ్చిందా అని ప్రశ్నలో పేర్కొన్నారు.

బిజెపి రాజ్యాంగ ఉల్లంఘన

బడ్జెట్‌పై చర్చలో టిడిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బిజెపి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని టిడిపి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం బడ్జెట్‌పై సాధారణ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వానికి బడ్జెట్ అంటే ఖురాన్, బైబిల్, భగవద్గీతతో సమానమన్నారు. రాష్ట్రం ఎన్నో కష్టాల్లో ఉన్నప్పటికీ సిఎం చంద్రబాబు ఎంతో కష్టపడుతున్నారని, కేంద్రం మాత్రం మొదళ్లు నరికి చిగుళ్లకు నీరు పోసే చందంగా వ్యవహరిస్తోందన్నారు. దేశంలో ఏపీ అంతర్భాగమనే విషయాన్ని మరిచిపోతున్నారన్నారు. హోదా విషయంలో అత్యున్నత సభలో మాట్లాడిన మాటలకే విలువ లేకుండా పోయిందన్నారు. గత నాలుగేళ్లుగా రైతు ఆత్మహత్యల్లేవని, విధివశాత్తూ చనిపోతే బాధిత కుటుంబీకులను ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. ప్రతిపక్ష నేత జగన్ ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొడుతున్నారని ఆయన ఆరోపించారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ : ఎమ్మెల్యే ఆనందరావు

ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉందని బడ్జెట్ చర్చలో మాట్లాడిన ఎమ్మెల్యే ఆనందరావు హర్షాన్ని వ్యక్తం చేశారు. సంక్షోభాల్ని అవకాశాలుగా మలచుకుంటున్న సిఎం చంద్రబాబు రెండంకెల వృద్ధిని సాధించారన్నారు. విభజనకు ముందు రూ.1.07లక్షలుగా ఉన్న తలసరి ఆదాయం, ఇప్పుడు రూ.1.40 లక్షలకు పెరిగిందన్నారు.

ముస్లిం మైనారిటీలకు అండగా టిడిపి : ఎమ్మెల్యే చాంద్‌బాషా

ముస్లిం మైనారిటీలకు టిడిపి ప్రభుత్వం అండగా నిలిచిందని అనంతపురం జిల్లా కదిరి ఎమ్మెల్యే ఎ.చాంద్‌బాషా పేర్కొన్నారు. బడ్జెట్ ప్రసంగంపై అసెంబ్లీలో జరిగిన చర్చలో భాగంగా సోమవారం ఆయన మాట్లాడారు. ముస్లిం మైనారిటీ విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు వీలుగా ఒక్కొక్క విద్యార్థికి రూ.10లక్షలు చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేయడం హర్షణీయమన్నారు. ప్రీమెట్రిక్ నుంచి ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేస్తోంద న్నారు. అమ్మాయిల వివాహం కోసం రూ.50వేలు అందించే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టడం ఆనందదాయకమన్నారు.

కాంగ్రెస్ పాలకులు ముస్లిం మైనారిటీ లను ఓటు బ్యాంక్‌లుగానే చూశారని, ఫలితంగా నేటికీ ముస్లిం వర్గాలు పేదరికం లో మగ్గుతున్నాయని చాంద్‌బాషా అన్నారు. అనంతపురం జిల్లాలో వేరుశెనగ పంటకు బయట మార్కెట్లో కూ.3వేలు ధర పలుకుతుండగా, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలుకు రూ.4,500లకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు.

క్రిస్టియన్ల అభివృద్ధికి నిధులు : నామినేటెడ్ ఎమ్మెల్యే పిలిప్ సి టాచెర్

రాష్ట్ర బడ్జెట్‌లో క్రిస్టియన్ల అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించడం హర్షణీయమని ఆంగ్లో ఇండియన్ నామినేటెడ్ ఎమ్మెల్యే పిలిప్ సి టాచెర్ అన్నారు. మైనార్టీ వర్గాల వివాహాల కోసం బడ్జెట్‌లో రూ.80 కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఎన్టీఆర్ విద్యోన్నతి స్కీం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు.

'ఇంటర్' గ్రేడింగ్‌పై పునరాలోచించాలి

జీరో అవర్‌లో పలు సమస్యల ప్రస్తావన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశ పెట్టిన నూతన గ్రేడింగ్ విధానంపై పునరాలోచించాలని విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే గణేష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం జీరో అవర్‌లో గ్రేడింగ్ అంశంపై ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రెండు విద్యా సంస్థల్ని కంట్రోల్ చేయలేకే ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. తెలంగాణాతో పాటు దేశంలోని చాలా రాష్ట్రాల్లో మార్కుల విధానమే అమల్లో ఉందన్నారు. ఇంటర్‌లో 75 శాతానికిపైగా మార్కులొస్తే కొన్ని ఉద్యోగాలొస్తాయని, అదే విధంగా బ్యాంకులు, పోలీస్ శాఖ, రైల్వే, మెడికల్, విమానయానం, నౌకాయాన రంగాలకు చెందిన కొన్ని ఉద్యోగాలకు ఇంటర్ మార్కుల పర్సంటేజే ప్రమాణికంగా ఉందన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలన్నారు. పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని, బ్యారన్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కోరారు. చిత్తూరులో 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఫ్లైఓవర్ శిథిలావస్థకు చేరి ప్రమాద కరంగా మారిందని, దానికి ప్రత్యామ్నాయంగా వెంటనే ఫాబ్రికేషన్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సత్యప్రభ విజ్ఞప్తి చేశారు. మినుముకు గిట్టుబాటు ధరలేక తూర్పుగోదావరి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తెలిపారు. మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేసి రైతుల నుంచి మినుములు కొనుగోలు చేయాలన్నారు. కృష్ణా పుష్కరాల కోసం ఏర్పాటు చేసిన గుంటూరు జిల్లాలో శిథిలమైన ధ్యానబుద్ధ ఘాట్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే శ్రీధర్ కోరారు. దళారీ వ్యవస్థ వల్ల నష్టపోయిన నెల్లూరు జిల్లా రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాసులురెడ్డి కోరారు. ఉప్పాడ వద్ద మత్స్యకారుల సౌకర్యార్థం వెంటనే జట్టీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వర్మ కోరారు.

ఏనుగులతో పంట నష్టం : ఎమ్మెల్యే కలమట

శ్రీకాకుళం జిల్లాలో ఏనుగుల వల్ల ప్రాణ నష్టం, పంట నష్టం జరుగుతోందని ఎమ్మెల్యే వెంకటరమణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిశా ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగులు జట్లుగా విడిపోయి పంట పొలాల్లో సంచరిస్తూ సమీప ప్రాంతాలపై దాడులు చేస్తున్నాయని, ఇప్పటి వరకు 11 మంది వాటి వల్ల దుర్మరణం పాలయ్యారన్నారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని బాధితులకు నష్ట పరిహారాన్ని మంజూరు చేయాలని కోరారు.

చంద్రన్న బీమా అందలేదు : ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

రూ.15 ప్రీమియం చెల్లించినా తన నియోజకవర్గంలో మరణించిన 19 మందికి చంద్రన్న బీమా సొమ్ము అందలేదని బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తెలిపారు. సిబ్బందిని అడిగితే ఆన్‌లైన్ అవ్వలేదని చెబుతున్నారని, బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ పనుల్లేవు : ఎమ్మెల్యే కదిరి బాబూరావు


కనిగిరి నియోజకవర్గంలో మూడేళ్ల నుంచి సరైన పంటలు పండక, ఉపాధి హామీ పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ ఏర్పాటు చేస్తామన్న ఎస్ఈజెడ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కదిరి బాబురావు కోరారు.

రూ.23 కోట్ల పంట నష్టం : చీఫ్‌విప్ పల్లె

2015లో అధిక వర్షాల వల్ల అనంతపురం జిల్లాలో సుమారు రూ.23 కోట్ల మేర పంట నష్టం జరిగిందని, వెంటనే రైతులకు పరిహారాన్ని అందించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ పల్లె రఘునాథరెడ్డి కోరారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో భూములిచ్చిన వారికి ఎకరాకు రూ.12.50 లక్షలిచ్చారని, అక్కడ ఎకరా రూ.20 నుంచి 30 లక్షలుందని, వారికి మరికొంత నష్ట పరిహారాన్ని అందించాలని మాజీ మంత్రి పీతల సుజాత కోరారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై తగు చర్యలు తీసుకుంటామని సంబంధిత మంత్రులు హామీ ఇచ్చారు.

ఎన్ని వాగ్దానాల్ని టిడిపి నెరవేర్చింది?

బిజెపి ఎమ్మెల్సీ వీర్రాజు




ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల సమయంలో టిడిపి సుమారు 1200 వాగ్దానాలు చేసిందని, వీటిల్లో ఎన్ని నెరవేర్చిందని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై అంతకు ముందు వీర్రాజు మాట్లాడుతూ పోలవరం సమస్య ఈ నాటిది కాదని, దీని కోసం కమ్యూనిస్టులు అనేక ఉద్యమాలు చేశారన్నారు. కేంద్రం నుంచి ఎంతో సహాయం పొంది, ఇప్పుడు ఏమీ చేయలేదని నింద వేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రత్యేక హోదాపై మాటలు మార్చింది సిఎం చంద్రబాబే అని విమర్శించారు. ఇదే అంశంపై బిజెపి సభ్యులు కె సత్యనారాయణ రాజు, టిడిపి సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, బుద్దా వెంకన్న, వైవిబి రాజేంద్రప్రసాద్, దొరబాబు మాట్లాడారు. వీర్రాజు, బుద్దా వెంకన్న, రాజేంద్రప్రసాద్ మాట్లాడుతున్న సమయంలో బిజెపి, టిడిపి సభ్యుల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది.

ఇక మేమెందుకూ : రెడ్డి సుబ్రహ్మణ్యం

టిడిపి, బెజెపి సభ్యులు ఒకరిపై మరొకరు కౌంటర్లు ఇచ్చుకుంటూ, మీరు మీరే మాట్లాడుకుంటుంటే ఇక మేమెందుకు, చైర్ ఎందుకని డిప్యూటీ చైర్‌పర్సన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. ఇది ప్రత్యేక హోదాపై చర్చ కాదని, గవర్నర్ ప్రంగంపై చర్చ అని, సభ్యుల తీరు చూస్తుంటే చర్చ ఎటువెళ్తుందో అర్థం కావడం లేదన్నారు. నీచకులమైన గాండ్ల కులానికి చెందిన ప్రధాని మోడీని విశాఖపట్నంలో ఘోరంగా అవమానించడం తగదని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దీంతో ప్రధానిది నీచకులమని సభలో ప్రస్తావించడం సరికాదని, దీన్ని ఉపసంహరించుకోవాలని సోము వీర్రాజుకు డిప్యూటీ చైర్‌పర్సన్ సూచించారు. ఆమేరకు ఆ మాటను వెనక్కి తీసుకుంటున్నట్టు వీర్రాజు ప్రకటించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ముఖ్యమంత్రి చంద్రబాబు

త్వరలో ఫేస్ రికగ్నైజేషన్ సాంకేతికత

గతంలో దెయ్యాలు పింఛన్లు పొందేవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనసభ స్పీకర్ శివప్రసాదరావు సోమవారం ఉదయం ప్రశ్నోత్తరాలతో సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా 'రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ఇ-పోస్ పరికరాల కారణంగా సమస్యలు' అంశంపై చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ ఇప్పించే బాధ్యత తాము తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం బయోమెట్రిక్ ద్వారా రేషన్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని, త్వరలో ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా పథకాలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నూతనంగా తీసుకొచ్చే ఈ సాంకేతికత ద్వారా పథకాలు కచ్చితంగా అమలు జరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల కోసం వేల కోట్లు ఖర్చు పెడుతున్నామన్నారు. పంచదార, కందిపప్పు, గ్యాస్, చంద్రన్న మాల్స్ అమలు చేస్తున్నామన్నారు. పేదల కోసం ఎన్టీఆర భరోసా తీసుకొచ్చామన్నారు, రాష్ట్రంలో 50 లక్షల మందికి పింఛన్లు అదజేస్తున్నామన్నారు. రేషన్ షాపుల్లో వేలిముద్రలు కావాలనే పడకుండా చేయాలని ప్రయత్నించే రేషన్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో వేలిముద్రలు సక్రమంగా పడక విద్యార్థులకు స్కాలర్ షిప్పులు అందకుండాపోయేవన్నారు. ప్రస్తుతం జ్ఞానభూమి పోర్టల్ ద్వారా స్కాలర్ షిప్పులు నేరుగా అందజేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దెయ్యాలు కూడా పింఛన్లు తీసుకునేవన్నారు. పేదలకు అన్ని పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రేషన్ దుకాణాల్లో కందిపప్పు : మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ఈ నెల నుంచి రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు కిలో కందిపప్పు అందజేయనున్నట్లు మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బియ్యం, పంచదార, గోధుమలు, కందిపప్పు, రాగులు రాయితీపై లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతి నెలా రూ. 14 కోట్ల అదనపు ఖర్చుతో అరకేజీ పంచదారను ఈ ఏడాది జనవరి నుంచి అందజేస్తోందన్నారు. గతంలో పంచదారపై రాయితీని కేంద్రం భరించేదని, కానీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే దీన్ని భరిస్తోందన్నారు. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో బియ్యానికి బదులు కిలో రూపాయికే రాగులను అందజేస్తున్నామన్నారు. లబ్దిదారులకు వెసులుబాటు కల్పించేలా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే పోర్టబిలిటీ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. దీనిద్వారా ప్రతి నెలా 22 లక్షల మంది లబ్ధిదారులు వివిధ ప్రాంతాల్లో రేషన్ పొందుతున్నారన్నారు. వేలిముద్రలు సక్రమంగా పడకుండా రేషన్ పొందని వారు 40 వేల మంది వరకు ఉన్నారన్నారు. వారికి ఈ నెల 16 నుంచి 20 తేదీ వరకు ప్రత్యేకంగా రేషన్ ఇచ్చే ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 4 లక్షల కుటుంబాలకు ఫ్రీ కార్డులు అందజేసినట్లు తెలిపారు. గతంలో రేషన్ దుకాణాలు డీలర్ల ఆధీనంలో ఉండేవని వాటిద్వారా అవకతవకలు జరిగే అవకాశముండేదన్నారు. కానీ ప్రస్తుతం విలేజ్‌మాల్స్ ఏర్పాటు చేయడం వల్ల అందుకు ఆస్కారం ఉండదన్నారు.

సమస్యలున్నాయి : విష్ణుకుమార్, శ్రావణ్‌కుమార్

ఈ అంశంపై సభ్యులు విష్ణుకుమార్ రాజు, శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పింఛన్ అందజేసే విధానంలో ఈ-పోస్ సక్రమంగానే పనిచేస్తోందని, కానీ రేషన్ తీసుకోవడంలోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రతినెలా ఒకే వ్యక్తికి వేలిముద్రల్లో సమస్యలు రావడం లేదని, నెలనెలా ఒక్కోవ్యక్తికి సమస్యలు వస్తున్నాయన్నారు. దీనివల్ల లబ్దిదారులు వీఆర్వోల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఐరిష్ విధానంలో కూడా సమస్యలు వ స్తున్నాయన్నారు. పెద్ద పంచాయతీల్లో దీనివల్ల సమస్యలు లేక పోయినా శివారు గ్రామాల్లో అధిక సమస్యలు ఉన్నాయన్నారు.

ప్రతి పల్లెకూ ఆర్టీసీ పార్శిల్ సర్వీస్

పిపిపి పద్ధతిలో ఆర్టీసీ స్థలాలు అప్పగింత

మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి పల్లెకూ ఆర్టీసీ పార్శిల్ సర్వీస్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని రవాణ శాఖమంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఆర్టీసీలో ప్రారంభించిన పార్శిల్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఎపిఎస్ఆర్టీసీ పార్శిల్ సర్వీస్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు తీసుకున్న చర్యల గురించి పిఆర్‌టియు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ప్రశ్నించారు. ప్రతిగ్రామంలోనూ డోర్ డెలివరీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ శ్రీనివాసులు రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పార్శిళ్ళ బుకింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ కోసం రాష్ట్రంలోనూ, ఇతర రాష్ట్రాల్లోనూ 140 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీ స్థలాల్ని పిపిపి పద్ధతిలో అప్పగించి ఆదాయం పెంచుకునేలా చూస్తున్నామని చెప్పారు.

మదర్సాలలో ఆంగ్లం, గణితం ఉపాధ్యాయుల్ని నియమించాలి : పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

మదర్సా పాఠశాలల్లో గణితశాస్త్రం, ఆంగ్లం ఉపాధ్యాయుల్ని నియమించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, రాము సూర్యారావు కోరారు. రాష్ట్రంలో 555 పాఠశాలలకు 255 పాఠశాలల్లోనే విద్యావాలంటీర్లు ఉన్నారని తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో కూడా టీచర్లను నియమించాలన్నారు. విద్యావాలంటీర్లకు ప్రభుత్వం అరకొర వేతనాల్ని చెల్లిస్తోందని, వీటిని కూడా సక్రమంగా చెల్లించడం లేదన్నారు. వేతనాల్ని పెంచాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అరకొర వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని మరో అంశంపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కావడం లేదన్నారు. ఈ శాఖల్లో వివిధ రకాల పేర్లతో ఉద్యోగులు చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్నారని, ఇన్ని పేర్లు ఏ శాఖలోనూ లేవని తెలిపారు.

ఈ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేయడం లేదన్నారు. సాంఘిక సంక్షేమ శాఖమంత్రి నక్కా ఆనంద్ బాబు దీనికి సమాధానం చెప్తూ ఉన్నతాధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కాంట్రాక్టు టీచర్లకు వేసవి సెలవుల్లో కూడా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎస్ రామకృష్ణ కోరారు.



వైసిపి దొంగల పార్టీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి దొంగల పార్టీ. ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్టువర్టుపురంలో జరుపుకోవడం అభినందనీయం. ఎ1 నుంచి ఎ10 వరకూ అందరూ దొంగలే. దొంగల పార్టీని ప్రజలు నమ్మరు. నాడు బెయిల్ కోసం సోనియాతో కుమ్మక్కైన జగన్ నేడు కేసుల మాఫీ కోసం రాష్ట్ర ప్రయోజనాల్ని తాకట్టు పెడుతున్నారు. పట్టిసీమ, రాజధానిని అమరావతిని జగన్ అడ్డుకుంటున్నారు.

-జివి ఆంజనేయులు, టిడిపి ఎమ్మెల్యే

వైసిపి అబద్ధాల పార్టీ

వైసిపి ఆచరణ సాధ్యం కాని హామీలను ప్రకటిస్తోంది. వైసిపి ఎంపీలు రాజీనామా చేస్తామనడం నాటకం. రాష్ట్రం అప్పులలో ఉందని బుగ్గన అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. కేసుల మాఫీ కోసం జగన్ ఆరాటపడుతున్నారు.

-పల్లె రఘునాథ రెడ్డి, చీఫ్ విప్

పన్ను ఎగ్గొట్టే వ్యాపారులపై కఠిన చర్యలు : యనమల

రాష్ట్రంలో జిఎస్‌టి పన్నుఎగవేతకు పాల్పడే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి యనమల రామకృష్ణుడు హెచ్చరించారు. 2017 ఎపి వస్తు, సేవల పన్ను చట్టంలోని నిబంధనల ప్రకారం పన్నుల ఎగవేతను పరిశీలించడానికి అవసరమైన చోట వాణిజ్య పన్నుల శాఖ తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. తనిఖీలను నిర్వహించడంతోపాటు, వస్తువులు, ఇన్‌వాయిస్‌లు, వేబిల్లులతోనే రవాణా అవుతున్నాయా లేదా అని పరిశీలించడానికి నిరంతరం తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. జీరో బిజినెస్‌ను నివారించడానికి, సరుకులను, సర్వీస్‌లను అందిస్తున్న పన్నుల చెల్లించేవారు ఇన్‌వాయిస్‌లను జారీ చేస్తున్నారా లేదా అని పరిశీలించడానికి డెకాయ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు

మంత్రి కెఇ కృష్ణమూర్తి

చాలాకాలంగా ప్రభుత్వ భూమిలో ఉంటూ ఇళ్లు నిర్మించుకున్న లబ్దిదారుల ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసిందని రెవెన్యూ శాఖమంత్రి కెఇ కృష్ణమూర్తి తెలిపారు. విజయవాడలో 4,388 ఇళ్లను ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్నారన్నారు. ఆక్రమిత భూమి క్రమబద్ధీకరణకు కలెక్టర్ సిఫార్సు చేశారన్నారు. విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ విశాఖలో ఆక్రమిత ప్రభుత్వ భూమిలో ఇళ్లనిర్మాణం చేపట్టిన 38 వేల మందికి పట్టాలిచ్చారన్నారు. వారిలో 100 గజాల్లోపు ఉన్న వారికి ఉచితంగా పట్టాలు అందజేశారన్నారు. మరోసభ్యుడు బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జివో 388 ద్వారా 100 గజాల్లోపు ఉన్నవారికి ఉచితంగా పట్టాలివ్వొచ్చని, కానీ విజయవాడలో ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్నవారిని క్రమబద్ధీకరించాలని తెలిపారు. పట్టాలు ఇవ్వకపోవడంవల్ల అమ్మకం, కొనుగోళ్లలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రస్తుతం పొజిషన్‌లో ఉన్నవారికి హక్కు కల్పించాలన్నారు. 296 జివో ప్రకారం విశాఖలో పట్టాలిచ్చారని, అదే తరహాలో విజయవాడలో ఇవ్వాలని కోరారు.

కిరోసిన్ హాకర్లకు జీవనోపాధి చూపండి : విష్ణుకుమార్ రాజు

రాష్ట్రంలో కిరోసిన్ సరఫరా నిలిపివేయడంతో 2,600 మంది హాకర్లు రోడ్డున పడ్డారని బిజెపి శాసనసభా పక్షనేత పి విష్ణుకుమార్‌రాజు తెలిపారు. 1972-82 వరకు వీరు పట్టణ ప్రాంతాల్లో తోపుడు బళ్లపై కిరోసిన్ పంపిణీ చేసేవారన్నారు. రేషన్ డీలర్ల వ్యవస్థ వచ్చిన తర్వాత వీరు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జీవో ప్రకారం కిరోసిన్‌ను హాకర్లు మాత్రమే అమ్మాలని చెబుతోందన్నారు. ప్రస్తుతం వీరి జీవనోపాధి పోయిందన్నారు. కనీసం వారు ఉన్న కొద్ది సంఖ్యను దృష్టిలో పెట్టుకుని వారికి పింఛను వెసులుబాటు కల్పించాలని కోరారు. వారికి వేరే ఉద్యోగం వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ అంశంపై మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ చంద్రన్న విలేజ్‌మాల్స్‌లో వీరికి అవకాశం కల్పించేలా చూస్తామన్నారు. 60 సంవత్సరాలున్నవారికి మాత్రమే పింఛను అందించే విధానం ఉందన్నారు.

సంపాదకీయం


ఉద్యమాలకు స్ఫూర్తి

తమ డిమాండ్ల పరిష్కారానికై మహారాష్ట్ర రైతులు చేపట్టిన మహా పాదయాత్ర (లాంగ్‌మార్చ్) దేశంలో కనీవిని ఎరుగని మహత్తర చారిత్రక ఘట్టం. అన్నదాతల సమస్యలను విస్మరిస్తున్న పాలకులకు సింహస్వప్నం. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిదాయకం. ఒకరు కాదు ఇద్దరు కాదు యాభై వేల మందికిపైగా రైతులు వారం రోజులపాటు 180 కిలోమీటర్లు ఏకబిగిన కాలిబాట పట్టడం అసాధారణ సన్నివేశం. బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకొని సోమవారం ముంబయిలోని విధానసభను ముట్టడించేందుకు ఈ నెల 6న నాసిక్‌లో రైతుల లాంగ్‌మార్చ్ ప్రారంభమైంది. మండుటెండలు, రాత్రి పగళ్లు, ఆకలిదప్పులు, ఇవేమీ రైతులకు ఎంతమాత్రం అడ్డంకి అనిపించలేదు. రోడ్లపైనే తిన్నారు, అక్కడే నిద్ర పోయారు. లాంగ్‌మార్చ్‌లో మహిళలు, వయోవృద్ధులు, చిన్నారులు సైతం కదంతొక్కారు. తమ ఈతిబాధలపై ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవాలన్న ఏకైక లక్ష్యమే అంతమందిని ఏకం చేసింది. సుదీర్ఘ పాదయాత్రలో అలుపుసలుపు లేకుండా నడిపించింది. అఖిల భారత కిసాన్‌సభ (ఎఐకెఎస్) నాయకత్వం రైతులకు పోరాట తెగింపును అదించగా అకుంఠిత దీక్ష వహించి ఎగసిపడుతున్న సముద్ర కెరటాల్లా ఎర్ర జెండాలు చేతబట్టి తండోపతండాలుగా కర్షకులు కదిలారు. దాదాపు అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు రైతుల ఆందోళనకు మద్దతు పలికారు. లాంగ్‌మార్చ్‌పై ఫడ్నవీస్ ప్రభుత్వంలో వణుకు పుట్టి రైతులు బైఠాయించిన ప్రదేశానికి మంత్రిని పంపించింది. రైతులెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు చెప్పించింది. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ నేరుగా రైతు ప్రతినిధులతో చర్చలకు దిగొచ్చారు. డిమాండ్లను అంగీకరించారు.

రైతుల ఆగ్రహం ఇంతగా కట్టలు తెంచుకోడానికి ముమ్మాటికీ కేంద్ర, రాష్ట్ర బిజెపి సర్కార్ల విధానాలే కారణం. రాష్ట్రంలోని మరఠ్వాడా, నాసిక్, థానె, నాగపూర్, విదర్భ ప్రాంతాల్లో వ్యవసాయం సంక్షోభంలో పడింది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ వ్యవసాయ వ్యతిరేక విధానాల మూలంగా రైతులు తాము చేసిన అప్పులను తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు రుణమాఫీ కోసం నిరుడు ఉధృతంగా ఆందోళనలు నిర్వహించారు. ఎన్నడూలేని విధంగా సమ్మె చేశారు. ఫడ్నవీస్ సర్కారు దిగొచ్చి పాక్షిక రుణమాఫీకి హామీ ఇచ్చింది. పది నెలలైనా అమలుకు నోచుకోలేదు. ఇదిలా ఉండగానే ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానలు లక్షలాది ఎకరాల్లో పంటలను సర్వనాశనం చేశాయి. పత్తికి గులాబీ తెగులు ఆశించి భారీగా దెబ్బ తీసింది. విపత్తులు, ధరలేమితో దయనీయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కేవలం గత జూన్ నుంచి ఇప్పటి వరకు 1,753 మంది రైతులు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. ఈ దుష్పరిణామాలు ప్రభుత్వంతో అమీ తుమీ తేల్చుకునేందుకు రైతులను లాంగ్‌మార్చ్ వైపునకు పురిగొల్పాయి. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ నదుల అనుసంధాన కార్యక్రమం వల్ల భూములు నష్టపోయే, సాగునీరు దెబ్బతినే ప్రమాదం కూడా రైతులను లాంగ్ మార్చ్‌కు పురిగొల్పింది. పూర్తి రుణమాఫీ, పంటలకు చట్టబద్ధమైన ధర, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు, పంటలకు నష్టపరిహారం, బలవంతపు భూసేకరణ నిలిపివేత, ఆదివాసీలకు అటవీ భూములపై యాజమాన్య హక్కులు, గిరిజన గ్రామాలకు నష్టం కలిగించే నదుల అనుసంధానం రూట్‌మ్యాప్ మార్పు.. ఇవీ రైతుల ప్రధాన డిమాండ్లు. అన్నీ న్యాయబద్ధమైనవే.

కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామంటుండగా ఆయన పార్టీ ఏలుబడిలోని రాష్ట్రాల్లో అన్నదాతల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లుంది. భూసేకరణ చట్టం-2013కు తూట్లు మొదలుకొని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వరకు అన్నీ కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక చర్యలే. అందుకే బిజెపి పాలిత రాష్ట్రాల్లో రైతుల ఆందోళనలు ఎగసిపడుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో ముందటేడు రైతులు ఉద్యమించగా చౌహాన్ ప్రభుత్వం కాల్పులకు తెగబడి ఆరుగురి ప్రాణాలను బలిగొంది. అక్కడ చెలరేగిన రైతు పోరాటాలు మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌కు విస్తరించాయి. అక్కడి బిజెపి ప్రభుత్వాలు ఏవో కాయకల్ప వాగ్దానాలు చేసి, వాటినీ తుంగలో తొక్కడంతో ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. రైతుల్లో అసంతృప్తిని గమనించే ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బిజెపి రుణమాఫీ హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చాక జిమ్మిక్కులు చేస్తోంది. గుజరాత్ ఎన్నికల్లో బిజెపికి అత్తెసరు మెజార్టీ రావడానికి రైతుల్లో పెల్లుబుకిన ఆగ్రహమే ప్రధాన కారణం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక ఇలా పలు రాష్ట్రాల్లోనూ రైతు ఉద్యమాలు కొనసాగుతున్నాయి. మోడీ సర్కారు చేపట్టిన విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కొన్ని వందల సంఘాల కలయికతో రైతు రక్షణ యాత్ర వంటివి పురుడు పోసుకున్నాయి. ఈ ఆందోళనలతోనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అనుకూలంగా వ్యవహరించాలి. విస్మరిస్తే ప్రభుత్వాల పునాదులు కదులుతాయి. చరిత్రలో రైతులకు హాని చేసిన పాలకులెవరూ మనగలిగిన దాఖలాల్లేవు.

ఇదీ విషయం



చట్టసభలో చట్టానికి
కొంచమైన చోటుందా ...
ప్రజలకంటూ పనికొచ్చే
పదాలకు విలువుందా!

గద్దెను ఎక్కేదాకా
గంభీరపు హామీలు...
రాజ్యం ఏలేదేమో
పెట్టుబడికి బినామీలు!

- కొల్లూరు వెంకట్

సందర్భం

మతం గురించి ఐన్‌స్టీన్ ఏమన్నాడు?




డా॥ దేవరాజు మహారాజు

ఐన్‌స్టీన్ దృష్టిలో దేవుడంటే ప్రకృతి, ప్రకృతి ధర్మాలు మాత్రమే! ఆయన అతీంద్రియ శక్తులను గానీ, క్రైస్తవ మతంలోని ట్రినిటీని గానీ, ఏసుక్రీస్తు మహిమలను గానీ, ఆత్మ అమరత్వాన్ని గానీ, గ్రహబలం గురించి గానీ ఎప్పుడూ నమ్మలేదు. 'దేవుడు ఈ విశ్వంతో ఎప్పుడూ ఆటలాడుకోడు' అని ఐన్‌స్టీన్ తరచుగా అంటుండేవాడు. విశ్వంలో యాదృచ్ఛికమైన గతులుండవు. గణిత సూత్రాలకు అనుగుణంగానే ప్రకృతి నడుస్తూ వుంది' అని కచ్చితమైన అభిప్రాయం ఉన్నవాడాయన. ఆయన మతం అనే మాటకు మరొక అర్థం చెప్పాడు. 'దేవుడితో సంబంధం లేకుండా మనిషి నైతికతతో మెలిగి, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే' మతం అన్నాడు. ఆ అర్థంతోనే మతం అభిమతం మానవాళికి అవసరమన్నాడు. అయితే ఈ అంశాన్ని ఆయన చెప్పిన స్థాయిలోకి వెళ్లి ఆలోచించాల్సి వుంటుంది. అర్థం చేసుకోవాల్సి వుంటుంది. మతం, దేవుడు, అనే మూఢత్వంలో కొట్టుకుపోయే జనానికి ఈ విషయం అర్థం కావడం కష్టమే! అయితే అర్థం కానంత క్లిష్టమైంది కూడా కాదు. వంశపారంపర్యంగా జీర్ణించుకుంటూ వచ్చిన సనాతన భావజాలాన్ని కొంచెం పక్కన బెట్టి, మెదడులో ఏ మూలో దాక్కుని ఉన్న హేతువును నిద్ర లేపి, విశాల హృదయంతో కొంచెం కొత్తగా ఆలోచిస్తే చాలు, ఐన్‌స్టీన్ భావం మనకు అందుబాటులోకి వస్తుంది.

'మన ఈ మెటీరియలిస్టిక్ యుగంలో మానవాళి శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న, తపన పడుతున్న శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, వైజ్ఞానిక రచయితలే అత్యంత విశ్వసనీయమైన మతస్తులు' అని అన్నాడాయన. మళ్లీ ఈ అంశాన్ని కూడా అదే స్థాయిలో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. వాడుకలో ఉన్నట్లుగా మతస్థులు అనే పదాన్ని 'ఒక మతాన్ని నమ్మేవారు' అని అర్థం చేసుకోవాలని వైజ్ఞానిక స్పృహతో ప్రయత్నించే వారికి, తహతహలాడేవారికి తప్పక అర్థమౌతుంది. మౌఢ్యం గుంజకు తమను తాము కట్టేసుకున్న వారికి అర్థం కాకపోవచ్చు. బంధనాలను తెంచుకుని స్వేచ్ఛగా ముందుకొస్తే అర్థమవుతుంది. వ్యక్తులు ఊహించుకున్న 'దేవుణ్ణి' ఐన్‌స్టీన్ ఏనాడూ నమ్మలేదు. ఆ విషయాన్ని ఆయన చాలా సందర్భాల్లో విస్పష్టంగా చెప్పారు కూడా! 'తను సృష్టించిన వాటిని తానే ఆదుకోలేక, మళ్లీ తనే శిక్షించే దేవుణ్ణి నేను ఊహించుకోలేను. హేతువును, భౌతిక శాస్త్ర సూత్రాలకు వ్యతిరేకంగా ఆయన చూపే లీలలను కూడా నేను ఊహించుకోలేను. అసలు దేవుడంటే ఎవరు? మనిషి బలహీనతకు ప్రతిబింబం! మనిషి భయంలోంచి, అజ్ఞానంలోంచి, ఊహల్లోంచి, భ్రమల్లోంచి రూపుదిద్దుకున్న భగవంతుడు చూపిన లీలలకు, చూపాడని చెప్పుకుంటున్న మహిమలకు ఆధారాలే లేవు. అలాంటప్పుడు మనం వాటిని నమ్మేదెట్లా?' అన్నది ఐన్‌స్టీన్ సంధించిన ప్రశ్న!

దేవుడనే ఊహ-మానవ ప్రాథమిక శాస్త్రాల (రచనల) కల్పన. దాన్ని ఆయన ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదు. మానవాతీత శక్తిగా కూడా పరిగణించలేదు. అసంపూర్ణంగానైనా వినయంగా నమ్రతతో గ్రహించే ఈ విశ్వం క్రమబద్ధత, దాని సామరస్యంలోని అందం మానవాళిని ఆశ్చర్యచకితులను చేస్తుంది. ఆ ఆశ్చర్యాన్ని ఆనందించాలి. ఆస్వాదించాలి. అనుభవించాలి. ఐన్‌స్టీన్ అదే చేశాడు. అదే చేయమన్నాడు. అంతేకాని మరొకటి కాదు. మతానికీ శాస్త్రానికీ మధ్య జరుగుతున్న ఘర్షణకు మూలకారణం వ్యక్తిగత దైవ విశ్వాసం. వైజ్ఞానిక శాస్త్రాలకు రుజువులున్నాయి. దైవ విశ్వాసానికి ఉండవు. రుజువులున్నదానితో రుజువులు లేనిది ఘర్షణ పడుతోంది. రుజువులు లేని దైవ విశ్వాసం అనేది లేకపోతే మానవులంతా వైజ్ఞానిక ప్రగతిని విశ్వసిస్తారు. అప్పుడు ఘర్షణ ఉండడానికి వీలుండదు. ఇప్పుడు సమాజం ఎలా వుందీ? వైజ్ఞానిక ప్రగతి ఫలితాలను అనుభవిస్తూ, దైవ విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు కదా! అందుకే ఘర్షణ జరుగుతోంది. వైజ్ఞానిక ఫలితాలు అనుభవించకుండా దైవ విశ్వాసంలో బతకగలిగితే బతకాలి. అప్పుడు కూడా ఘర్షణ ఉండదు. బాబాలు, స్వాములు, మాతాజీలు వగైరా సామాన్యుడి కన్నా ఎక్కువ వైజ్ఞానిక ఫలితాలు అనుభవిస్తున్నారు. మరో వైపు మూఢత్వం పెంచి పోషిస్తున్నారు. నైతికతను మరచి, అత్యంత హీనంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే ఘర్షణ. పోనీ ఈ ఘర్షణ తగ్గించడానికి సైన్సును సైన్సు పరిశోధనలను పక్కన పెడదామా అంటే ఎలా వీలవుతుంది? సైన్సు లేకుండా ఊపిరే పీల్చలేం. శ్వాసక్రియ జీవశాస్త్రంలో ఒక భాగం. ఆధ్యాత్మిక, ధార్మిక, తాత్విక ధోరణులలో ఎటునుంచి ఎటుతిప్పి చెప్పినా దైవ భావన-ఒట్టి విశ్వాసమే! ఈ విశ్వాసంతో సంతానోత్పత్తి జరగదు. ఆహారోత్పత్తి జరగదు. సమాజం పెరగదు. ఎదగదు. విశ్వ రహస్యాలను జీవ రహస్యాలను మనిషి అర్థం చేసుకుంటూ ఒక్కొక్కటి ఆవిష్కరించుకుంటూ వస్తున్నాడు. కనుకనే, మనం ఈ అత్యాధునిక సాంకేతిక యుగంలో ఉన్నాం. మునుల వల్లనో, రుషుల వల్లనో, ధార్మిక ఆధ్యాత్మిక గురువుల వల్లనో ప్రపంచం పురోగతి సాధించలేదు. అలాగే మత విశ్వాసాల వల్ల ఘర్షణలు జరిగాయే గాని, శాంతి స్థాపించబడలేదు.

ఎవరో నమ్ముకున్న దేవుడు లేడని నేనెందుకు నిరూపించాలి? అది నా పని కాదు. నమ్ముతున్న వారే, వారెందుకు నమ్ముతున్నారో నిరూపించుకోవాలి. దేవుడున్నాడని మాట్లాడితే నేనొక అబద్ధాలకోరునవుతాను. అయినా, వాస్తవాలకు నిరూపణలు వెతకొచ్చు. అవాస్తవాలకు నిరూపణలెక్కడ?



రేపు ఐన్‌స్టీన్ జయంతి

'ఎవరో నమ్ముకున్న దేవుడు లేడని నేనెందుకు నిరూపించాలి? అది నా పని కాదు. నమ్ముతున్న వారే, వారెందుకు నమ్ముతున్నారో నిరూపించుకోవాలి. దేవుడున్నాడని మాట్లాడితే నేనొక అబద్ధాలకోరునవుతాను. అయినా, వాస్తవాలకు నిరూపణలు వెతకొచ్చు. అవాస్తవాలకు నిరూపణలెక్కడ?' అని ప్రశ్నించిన ఐన్‌స్టీన్ మత ప్రచారకులకు కొన్ని సూచనలు ఇచ్చాడు. 'మత ప్రచారకులంతా తమ వ్యక్తిగత దేవుడి సిద్ధాంతాన్ని వదిలేయాలి. తమ ఆధీనంలో ఉన్న పాప పుణ్యాలను, భయాలను, నిరాశావాదాన్ని. పునర్జన్మలను మొత్తానికి మొత్తంగా తుడిచేసుకోవాలి. నైతిక విలువలను కాపాడే పోరాటంలో సామాన్యులతో కలసి రావాలి. 'కార్యాకారణ సూత్రం'పై పని చేసే ఈ విశాల విశ్వాన్ని అర్థం చేసుకోవాలి. జరిగిన జరుగుతున్న పరిణామాల మీద అవగాహన పెంచుకోవాలి. మతంపై నుండి దృష్టి మరల్చి, సామాజిక అసమానతలపై దృష్టి పెట్టాలి'.

మానవుడి అమరత్వంపై తనకు నమ్మకం లేదని, నీతి అనేది మానవాతీత శక్తి కాదని, మానవుడికి సంబంధించిందేనని.. అది అతడు తన ఆత్మ విశ్వాసంతో సాధించుకోవచ్చని, ఈ విషయంలో దేవుడి ప్రమేయమే లేదని కరాఖండిగా చెప్పిన ఐన్‌స్టీన్ మరణానంతర జీవితాన్ని కొట్టి పారేశాడు. భౌతికంగా మనిషి చనిపోయిన తర్వాత జీవి బతికే ఉండడం ఆత్మలు తిరుగాడుతూ ఉండడం మూఢ నమ్మకాలేనన్నాడు. మనిషి అంతర్గత అనుభవాలన్నీ పునరుత్పత్తులతో, సునిశిత భావ సముచ్చయంతో ముడిపడి ఉంటాయి. దేహమే లేకపోయినప్పుడు ఆత్మకు అర్థమే లేదు. మానసికంగా బలహీనులైన వ్యక్తులు ఆత్మన్యూనతా భావంతోనూ, భయంతోనూ లేదా ఎదుటివారిని మోసగించాలన్న కుట్రతోనూ అలాంటి ఆలోచనలను ప్రచారం చేస్తుంటారు. లేని ఆత్మలను జనం గుండెల్లో పదిలపర్చుతుంటారు.

సరే, గతం గడిచిపోయింది. ఏం చేసినా దాన్నిక మార్చలేం కానీ, సుఖాంతమయ్యే ఒక కొత్త ప్రారంభానికి బీజం వెయ్యొచ్చుకదా! ఆ దిశలో మనం ఎందుకు ఆలోచించకూడదు? థియోసఫీ, స్పిర్చువలిజం వంటి వన్నీ మత గ్రంథాల చుట్టూ తిరిగే గందరగోళాలే! అసలు మత గ్రంథాలన్నీ అవాస్తవాలు, కల్పిత గాథలు అని అనుకున్న వారికి కొత్త ఆలోచనలు వచ్చే అవకాశముంటుంది. గానుగెద్దుల్లా కళ్లు మూసుకొని తిరిగే వారికి, అందులోనే శాంతి, సౌఖ్యం ఉన్నాయని అనుకునే వారికి మనం ఏమీ చెప్పలేం. వైజ్ఞానిక శాస్త్రం నైతికతను కించపరుస్తుందన్న అపవాదు వుంది. కానీ, అది నిజం కాదు! మానవుడి నైతిక ప్రవర్తన సానుభూతి, విద్య, వైద్యం, సామాజిక అవసరాలు, స్నేహ బంధనాల మీద ఆధారపడి ఉంటుంది. అందులో మతానికి చోటే లేదు. అవసరమే లేదు. మత ప్రమేయం లేకుండా కూడా మానవులుగా, మహనీయులుగా గొప్ప విలువలతో జీవించిన వారున్నారు. మరణం తర్వాత లభించే అనుగ్రహం కోసమో, శిక్షలకు గురవుతామన్న భయంతోనో మనిషిని నిలదీయడం గానీ, కృంగదీయడం గానీ, మోసగించడం గానీ, అమానుషం! అపరిపక్వం! అసంబద్ధం!!

(రచయిత సైన్స్ ప్రొఫెసర్, సెల్ : 9573706806)

చర్చ


అసెంబ్లీల పని తీరు బాలేదు

నిధి తంబి

ఇటీవల భారత్‌లో చాలా రాష్ట్రాల అసెంబ్లీల పని తీరు పేలవంగా వుంది. 2016-17 సంవత్సరాల్లో వివిధ రాష్ట్రాల అసెంబ్లీల పని తీరు పరిశీలిస్తే కేరళ వంటి కొన్ని రాష్ట్రాలు మెరుగ్గా వున్నప్పటికీ ఎక్కువ రాష్ట్రాల అసెంబ్లీలు సమావేశమైనది చాలా తక్కువ.

వివిధ రాష్ట్ర అసెంబ్లీలు సమావేశమైన రోజులు

రాష్ట్రం	2017	2016	2015
గుజరాత్	33	30	32
రాజస్థాన్	25	25	31
కర్ణాటక	40	35	58
మహారాష్ట్ర	50	పేర్కొన లేదు	18
యుపి	17	24	27
ఢిల్లీ	7	24	27
కేరళ	151	53	40
తమిళనాడు	37	43	28
తెలంగాణ	33	30	21



(రాష్ట్ర అసెంబ్లీ వెబ్‌సైట్ల ఆధారంగా)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 174(1) ప్రకారం 'గవర్నరు అసెంబ్లీని ఎప్పటికప్పుడు సమావేశపరచాలి. గవర్నరు సముచితమని భావించినప్పుడు శాసన సభలోని ఉభయ సభలను ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, ఎక్కడ కావాలనుకుంటే అక్కడ సమావేశపరచవచ్చు. అయితే గత సమావేశాల చివరి రోజుకి, తదుపరి విడత సమావేశాల ప్రారంభ రోజుకి మధ్య ఆరు నెలల వ్యవధి మించరాదనే నిబంధన విషయంలో ఆయన జోక్యం కూడదు'. రాజ్యాంగం రెండు సమావేశాల మధ్య నిడివి గురించి పేర్కొన్నదే తప్ప, సంవత్సరానికి ఇన్ని రోజులు కచ్చితంగా సమావేశం కావాలని ఎక్కడా చెప్పలేదు. రాజ్యాంగం లోని ఈ లొసుగును ఉపయోగించుకుని చాలా అసెంబ్లీలు ఏదో మొక్కుబడిగా ఒకటి రెండు రోజులు సమావేశమై చేతులు దులిపేసుకుంటున్నాయి.

మరో ముఖ్యమైన అంశమేమిటంటే రాష్ట్ర అసెంబ్లీలు, వాటి సభ్యులు సభలో జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను ప్రజలు తెలుసుకోవడం చాలా కష్టమవుతున్నది. ఈ విషయంలో పార్లమెంటు కొంత మెరుగనే చెప్పాలి. అక్కడ జరిగే చర్చల వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు. అసెంబ్లీలో చర్చల వివరాలు అంతగా అందుబాటులో వుండకపోవడం వల్ల రాష్ట్ర స్థాయిలో విధాన నిర్ణాయక ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం కొరవడుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ విభాగాలు, మంత్రులు, ఎమ్మెల్యేలను వారి చర్యలకు వారినే బాధ్యులను చేయాలని అనుకున్నా పౌరులకు అది సాధ్యం కావడం లేదు. శాసన సభలో చేసిన హామీలను పాలకులు తుంగలో తొక్కుతుంటే, ఏమిటీ అన్యాయమని వారిని నిలదీయలేని పరిస్థితి. కర్ణాటక, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాలు తమ అసెంబ్లీలో జరిగిన చర్చల వివరాలను వాటి వెబ్‌సైట్‌లో పెడుతున్నాయి. గుజరాత్, పశ్చిమ బెంగాల్ వంటి కొన్ని రాష్ట్రాలు బొత్తిగా ఆ పని చేయడం లేదు.

ప్రభుత్వ పత్రాలను విధిగా ప్రజలకు అందుబాటులో వుంచాలని 2005 సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 (1)(బి) స్పష్టంగా నిర్దేశిస్తోంది. చట్టాలు, నిబంధనలెన్ని వున్నా అవేవీ మన అసెంబ్లీలకు వర్తించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ఇప్పటికైనా దృష్టి పెట్టి చట్ట సభలను పారదర్శకంగా, సమర్థవంతంగా నడిచేలా చూడాలి.

సూచనలు

- అన్ని రాష్ట్రాల అసెంబ్లీల కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేయాలి. రాష్ట్రాల అసెంబ్లీల్లో తీవ్ర గందరగోళం చోటుచేసుకున్న సందర్భాల్లో ప్రజలకు ప్రభుత్వ జవాబుదారీతనం తక్కువగా వుంటోంది. కాబట్టి అసెంబ్లీల కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తే ఏలికల పని తీరును ప్రజలు దగ్గరగా పర్యవేక్షించే వీలుంది. దీనివల్ల ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చట్టాలు, చర్చల నాణ్యత పెరిగే అవకాశముంది.
- 2005 సమాచార హక్కు చట్ట ప్రకారం అన్ని రాష్ట్రాల చట్ట సభల చర్చలు, ప్రశ్నోత్తరాల వివరాలను వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా వెల్లడించాలని పౌరులంతా ముక్త కంఠంతో డిమాండ్ చేయాలి.
- అసెంబ్లీలు సంవత్సరంలో కనీసం ఇన్ని రోజులు తప్పనిసరిగా సమావేశం కావాలని నిర్ణయించాలి. ఈ మేరకు రాజ్యాంగానికి తగు సవరణ తీసుకురావాలి.
- రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే అసెంబ్లీల వెబ్‌సైట్లు రెండు భాషల్లో వుండాలి. అసెంబ్లీ ప్రొసీడింగ్స్‌ను మాతృ భాషలోకి, ఆంగ్లం లోకి తర్జుమా చేసి ఇవ్వాలి. ప్రభుత్వ విధానాలు, చర్యల వివరాలను ప్రజలు తేలికగా అర్థం చేసుకునేలా భాష వుండాలి.
- ప్రభుత్వం చట్టాలను ఎవరిని ఉద్దేశించి తీసుకొస్తున్నదో ఆ వర్గాల ప్రజలను, లబ్ధిదారులను చట్ట రూపకల్పనలో తప్పనిసరిగా భాగస్వాములను చేయాలి. రాష్ట్రాలు చట్టాల రూపకల్పనకు అనుసరిస్తున్న చర్చ, ఆమోద ప్రక్రియలో దాపరికం లేకుండా చూడాలి. మంత్రిత్వ శాఖలు ముసాయిదా బిల్లులను రూపొందించి, వాటిపై ప్రజల అభిప్రాయాలను కోరాలి. విధానాల రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి చేయాలి.

(రచయిత ప్రభుత్వ విధానాల విశ్లేషకుడు, విధానాల రూపకల్పనలో ఫెలోషిప్ పొందారు)

జన వాక్యం

వార్తలు-విలువలు

టీవీలలో వార్తా ప్రసారాల విలువలు పెరగాలి. ప్రజలను సానుకూల దృక్పథం వైపుకు నడిపే కథనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. మానవీయ విలువలు పెంపొందించే కథనాలను ప్రోత్సహించాలి. అయితే ఇటీవల ప్రమాదాలు జరిగిన వార్తలను సాంఘిక దురాగతాలకు చెందిన వార్తలను ప్రసారం చేసే సమయంలో అత్యుత్సాహం చూపిస్తున్నారు. వీలైతే అటువంటివి జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే విషయంపై ప్రసారాలు వుండాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జరిగిన నష్టం గురించిన వార్తలతో పాటు వాటిని ఎదుర్కొనే ఉపాయాలను ప్రసారం చేయాలి.

శేష సాయి కుమార్, తిరుపతి.

'కారుణ్య'ం కఠినంగా....

ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం కారుణ్య మరణాలపై ఇచ్చిన తీర్పు ఆహ్వానించతగింది. మనిషి ఎంత గౌరవంగా బతుకుతాడో అంతే గౌరవంగా మరణం కూడా ఉండాలని అనుకోవడంలో తప్పు లేదు. ఈ సందర్భంలో సుప్రీం ఇచ్చిన తీర్పు సరైనదే కానీ దీన్ని చట్టం చేసేటప్పుడు కఠిన నియమనిబంధనలు ఉండాలి. లేకపోతే కొంతమంది దుర్మార్గులు అమాయకులను చంపే మార్గాలలో ఇది చేరే ప్రమాదం ఉంది. కుటుంబ ఆస్తి కోసమో, భారమయ్యారనో సాకులు చెప్పేవాళ్ల గురించి దీనిని ఆమోదించకూడదు. ఎవరైనా ఈ కారుణ్య మరణాలను సాకుగా తీసుకుని హత్యలు చేస్తే వారిని కఠినంగా శిక్షించాలి. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాలలో మాత్రమే ఈ రకమైన మరణాలు అమలులో ఉన్నాయి. ప్రస్తుతం మన దేశంలో కూడా వీటికి అనుమతి లభించింది. ఏదేమైనా ఈ కారుణ్య మరణం కేవలం అనారోగ్యం ఉన్న వారి సొంత నిర్ణయమై ఉండాలి. నిర్జీవంగా బతకడం కన్నా మరణమే నయం అనే వారి అభిప్రాయాన్ని గౌరవించేంత వరకే దీని పరిధి వుండాలి.

విరాజిత, ఇమెయిల్ ద్వారా.

దర్శనం

ఉత్పత్తి పునాదుల్ని దెబ్బతీస్తున్న బడ్జెట్



డా ॥ కత్తి పద్మారావు

నేడు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో వుంది. ప్రభుత్వ ప్రాధామ్యాలు ధనిక వర్గం వైపే చూస్తున్నాయి. రాను రాను బడ్జెట్‌లో సంక్షేమానికి కేటాయింపులు సన్నగిల్లుతున్నాయి. దళితులకు రావాల్సిన సబ్‌ప్లాన్ నిధులను జనాభా నిష్పత్తిని బట్టి కేటాయించడం లేదు. స్త్రీల అభ్యున్నతికి సంబంధించిన కేటాయింపులూ అరకొరే! గత బడ్జెట్లలోనూ రాష్ట్ర సంపదను పెంచే రంగాలపై చంద్రబాబు దృష్టి పెట్టలేదు. రాజకీయ విన్యాసాలకు చూపుతున్న శ్రద్ధ దేశీయ ఉత్పతులను పెంచేందుకు చూపలేదు. ఎప్పటిలాగే ఈ బడ్జెట్లో కూడా పాత పాటే పాడారు. అయితే స్వరం కాస్త పెంచారు. ఇవన్నీ పాత వాగ్దానాలకు కొత్త రంగులే. నిజానికి బడ్జెట్ అనేది సామాజిక, సాంస్కృతిక, విద్యా, వైద్య వ్యవస్థల్ని గట్టిపరిచేదిగా వుండాలి. రాష్ట్రంలో నానాటికి ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వున్న మౌలిక వసతుల పునాదులు ఎందుకు కూలుతున్నాయో ఆలోచించాలి. దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే మన రాష్ట్రానికే అతి పెద్ద సముద్ర తీరం వుంది. అయినా అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమే! ఈ నాలుగేళ్ళలో అధికారంలో వున్న చంద్రబాబు ప్రభుత్వం ప్రకృతి సంపదను, మానవ వనరులను ఉత్పత్తి క్రమంలో ఉపయోగించుకో లేకపోయింది. దానితో రెవెన్యూ లోటు రూ.16 కోట్లుగా తేలింది. ఎంతో సంపన్నంగా వుండాల్సిన రాష్ట్రం పాలకుల స్వార్థ ప్రయోజనాల ఫలితంగా రుణగ్రస్థ రాష్ట్రంగా తయారైంది. ప్రతి నిమిషం ఢిల్లీ గుమ్మం ఎక్కే పరిస్థితి ఏర్పడింది. వ్యాపార, వర్తక, వాణిజ్య, వ్యవసాయ నిర్మాణ రంగాలన్నీ కుంటుబడ్డాయి. రైతుకు గిట్టుబాటు ధర లేదు. కౌలు దారులకు బ్యాంకుల అండ లేదు. విలువలతో కూడిన ప్రభుత్వ విద్యను, వ్యక్తి వికాసాన్ని, విజ్ఞానాన్ని, ఉపాధిని, సామాజిక జీవనాన్ని పునరుజ్జీవింపజేసే విద్యావంతుల్ని ప్రభుత్వం తయారు చేయలేకపోతోంది. విద్య కూడా ఒక ఉత్పత్తి సాధనమే అని తెలుసుకోలేకపోతోంది. విద్యార్థుల్ని కార్పొరేట్ భూతానికి అప్పచెబుతోంది. విద్యపై చేసే వ్యయాన్ని వ్యాపార దృక్పథంతో చూస్తోంది. ఉద్యోగికి నీతి-నిజాయితీ, వ్యక్తిత్వం, దేశీయ భావనను కలిగించకుండా అవినీతి పాఠాలు చెబుతోంది. ఫలితంగా రాష్ట్ర మిగులు సంపద అంతా అవినీతి ఉద్యోగుల అక్రమ సంపాదనలో పేరుకు పోయింది. ఈ విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల బలహీనతలను రెచ్చగొట్టే అంశాల పట్ల ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. ఆయన మంత్రివర్గంలోని ఎమ్మెల్యేలు, ఎంపిలలో ఎక్కువ మంది అవినీతి పరులే! అందుకే 2014లో ఎన్నికల సమయంలో వాళ్ళు ప్రకటించిన ఆస్తుల విలువ రాబోయే ఎన్నికల నాటికి అంటే 2019కి విపరీతంగా పెరుగుతున్నాయి. ఇక మన ముఖ్యమంత్రి చేసే విదేశీ పర్యటనలన్నీ ఎన్నికల ఫండ్ కోసం జరిగేవే. ఆ ప్రయాణాల ఖర్చు కోసం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసేస్తున్నారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను ముఖ్యమంత్రి గృహ నిర్మాణాలకు వాడుకొంటున్నారు. ప్రాథమిక వైద్యశాలలకు కేటాయింపులు మరింతగా తగ్గించడం సామాజిక న్యాయానికి ద్రోహం చేయడమే అవుతుంది. బడ్జెట్లు పెట్టిన ప్రతిసారీ లెక్కకు మించి హామీలు ఇవ్వడం తర్వాత మరచిపోవటం బాబుకు ఆనవాయితీగా మారింది. వ్యవసాయానికి సంబంధించి కొత్త ప్రాజెక్టులు ఒక్కటీ రావడంలేదు. వేలాది ఫుడ్ పార్కులు వస్తున్నాయని చెప్పడమే తప్ప పట్టుమని పది కూడా ప్రారంభం కాలేదు. మనది వ్యవసాయక రాష్ట్రం. పత్తి, మిరప, మినుము, వరి వంటి పంటలను ఇతర దేశాలకు ఎగుమతి చేయగల సామర్థ్యం మనది. చిరుధాన్యాలకు ప్రభుత్వం సరైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. రాగి, కొర్ర, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి అనేక పంటలకు ప్రోత్సాహం ఇచ్చి ప్రజల్లోకి తీసుకెళితే మధుమేహ వ్యాధిగ్రస్థులకు మంచి ఆహారాన్ని అందించినవారమౌతాం. మరో వైపు రైతులకు ప్రోత్సాహం ఇచ్చినవారమౌతాం. అంతేకాక ప్రతి మండలంలో ఎరువుల ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలి. వ్యవసాయమే కాదు, రాష్ట్రంలో స్త్రీ శక్తి కూడా నిర్వీర్యం అవుతోంది. ప్రతి మండలంలో కుటీర పరిశ్రమలు పెట్టగలిగితే జపాన్, జర్మనీ వలే మనకు గొప్ప వస్తువులు, వస్తు విభాగాలు తయారవుతాయి. గిరిజన ఉత్పత్తులు తెలుగు నేలలో విస్తారమైనవి. వారు పండించే తేనె, పుట్టగొడుగులు, చింతపండు, కట్టెలు, ఆయుర్వేద మూలికలు అనేక ఉత్పత్తులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దీంతో వారిలో కొందరు ఆరోగ్యానికి హాని కలిగించే గంజాయి పెంచేందుకు అలవాటు పడుతున్నారు. గిరిజన ఉత్పత్తులు పెంచడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెంచవచ్చు. ఒక పక్క దళితులపై దాడులు నిర్వహిస్తూ మరోపక్క దళితులకు కూలి దొరక్కుండా చేస్తున్నారు. పైగా ప్రభుత్వ ఆదాయం కోసం దళితవాడల నిండా బెల్టు షాపులు పెడుతున్నారు. వారి నిధులను వారికి ఖర్చు పెట్టడం లేదు. అంటే దళిత ఉత్పత్తి వ్యతిరేక ప్రభుత్వంగా చంద్రబాబు ప్రభుత్వం నడుస్తోంది. రాష్ట్రం క్షీర విప్లవానికి పెట్టని కోట. అయితే ఇప్పుడు పశువులకు మేత, నీరు రాష్ట్ర వ్యాప్తంగా కరువయ్యాయి. పశువుల కోసం గడ్డిని పెంచి, నీటి సౌకర్యం కల్పించడం వల్ల క్షీర విప్లవాన్ని వృద్ధి చేసుకోవచ్చు. ఇతర రాష్ట్రాలకు పాలను సరఫరా చేయవచ్చు. వ్యవసాయం, పశుపోషణ తర్వాత ఉత్పత్తిరంగంలో అతి ప్రధానమైనది చేనేత పరిశ్రమ. కానీ ప్రభుత్వం ఈ రంగాన్ని కూడా తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. ఈ రంగం అభివృద్ధి చెందితే దాని ద్వారా కూడా ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ఈ విధంగా తదితర ఉత్పత్తి రంగాల అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవచ్చు, బడ్జెట్‌నూ పెంచుకోవచ్చు. కానీ ప్రభుత్వ చర్యలు ఆ దిశగా వుండడం లేదు. ముఖ్యంగా దేశీయ ఉత్పత్తులపై ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. ఏలికలకు వారి సొంత ఆస్తులు, వ్యాపారాలను పెంచుకోవడంలో వున్న తపన రాష్ట్ర ఆదాయం పెంచడంలో లేదు. ఎన్నో వ్యవసాయక దేశాలు ఇతర దేశాలకు అప్పులు ఇస్తున్నాయి. కానీ మన దేశం, రాష్ట్రం రెండూ అప్పులు తీసుకోవడంలో పోటీ పడుతున్నాయి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెంచడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించింది. ల్యాప్‌టాపుల్లో అంకెల గారడీలు చేయడం, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనడం, దళితుల, గిరిజనుల జీవన వ్యవస్థలను ధ్వంసం చేయడం, స్త్రీల ఉత్పత్తి క్రమాన్ని దెబ్బతీయడం, రైతులను అప్పుల పాలు చేయడం, ప్రజల బలహీనతల్ని పెంచడం ఇదే ప్రతి బడ్జెట్‌లో కనిపించే రంగుల చిత్రం.



ఎన్నో వ్యవసాయక దేశాలు ఇతర దేశాలకు అప్పులు ఇస్తున్నాయి. కానీ మన దేశం, రాష్ట్రం రెండూ అప్పులు తీసుకోవడంలో పోటీ పడుతున్నాయి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెంచడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించింది.

(రచయిత నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సెల్ : 9849741695)

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

ప్రజాశక్తి
jeevanapageps@gmail.com

జీవన the family
JEEVANA



మనకూ.. మాంఝీ ఉన్నాడు

ఈ రోజుల్లో.. పుట్టిపెరిగిన ఊరికోసం ఏదైనా చేయాలనుకోవడమే గొప్ప విషయం. చదువుకున్న స్కూల్ కోసం నాలుగు కుర్చీలు, రెండు బల్లలు ఇచ్చినా.. అదో పెద్దవార్తగా చెప్పుకోవడం రివాజు. ఇంకాస్త ముందుకెళ్తే.. బడికెళ్ళే పిల్లలు చదువుకోవడానికి చిన్న గ్రంథాలయమో, రేడియో రూమో కట్టిస్తే.. ఏకంగా దాతలపేర్లు పెట్టేసి వాళ్ళను తరాలపాటు పొగుడుతూనే ఉంటాం. అలాంటిది ఓ సామాన్యుడు.. తన ఊరికోసం, ప్రజల కష్టాలు తీర్చడం కోసం తనే పలుగు, పారా పట్టి.. కొండమీదున్న తన ఊరికి ఏకంగా రోడ్డే వేసేశాడు. ఏళ్ళతరబడి కొండను తొలచి.. రోడ్డువేసిన బీహార్ మాంఝీలానే.. తన కష్టాన్నే నమ్ముకుని.. అసాధ్యమనుకునే పనిని సుసాధ్యం చేసి చూపించాడు. అతడెవరో కాదు. మన తెలుగువాడు. గిరిజన కొండశిఖర గ్రామాన జీవించే ఆరిక గరుసు. అతడి గురించి తెలిస్తే.. 'మనకో మాంఝీ ఉన్నాడోచ్!' అంటూ మనమూ గర్వంగా చెప్పుకోగలం. అందుకే పదండి. ఆ గిరిజనపుత్రుడి 'జీవన'బాట గురించి తెలుసుకుందాం!!

ఊరికోసం, ఊరి ప్రజల బాగుకోసం, వారికష్టాలను తీర్చడం కోసం.. ఎవ్వరూ చేయని సాహసమే చేశాడా సామాన్యుడు. తనకున్న పొలాన్ని తాకట్టు పెట్టి మరీ లక్ష్యాన్ని సాధించాడు. ఆయనే ఆరిక గరుసు. విజయనగరం జిల్లా కురుపాం మండలం గిరిశిఖర గ్రామమైన తాడిగండగూడకు చెందిన గరుసు కుటుంబ త్యాగం వల్లనే ఆ ఊరికి రోడ్డు వచ్చింది. ప్రభుత్వాలు, పాలకులు చేయనిదాన్ని చేసి చూపించిన గరుసు సంకల్పం ముందు.. గిరిజన నేలపైగల కొండలు, గుట్టలు సైతం ఇప్పుడు సలాం చేస్తున్నాయి.

ఇదీ మా ఊరు

"మాది ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లోని ఓ గిరిశిఖర గ్రామం. విజయనగరం జిల్లా, పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన కురుపాం మండలం వబ్బంగి పంచాయతీ, తాడిగండగూడ గ్రామం. నా పేరు ఆరిక గరుసు, నా భార్య గంగి. నాకు ఐదుగురు పిల్లలు. మా గ్రామంలో మాతో పాటు మరో పదహారు కుటుంబాలు జీవిస్తున్నాయి. మా గ్రామానికి వెళ్లాలంటే నిటారు కొండను ఎక్కాలి. ఎన్నో ఏళ్లుగా ఊరికి రోడ్డులేదు. దీంతో రాకపోకల విషయంలో చాలా ఇబ్బంది పడేవారిమి. ఊళ్లో ఎవరికి బాగోక పోయినా డోలిలో వేసుకుని, కిలోమీటర్ల దూరంగా మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. అత్యవసర పరిస్థితుల్లో చావు తప్ప.. మరో దిక్కులేని దౌర్భాగ్య స్థితిని అనుభవించేవాళ్ళం. ఇలా నరకయాతన పడుతున్న మా ఊరు వారంతా ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. ఊరికి రోడ్డు వేయాలని వేడుకున్నాం. కానీ ఏళ్లు గడుస్తున్నా, ఊరికి రోడ్డు మాత్రం రాలేదు" అంటూ గరుసు తమ గ్రామస్తుల కష్టాలను వివరించాడు.




భార్య గంగితో గరుసు

విసిగి వేసారి.. పలుగు పారాపట్టి

ఇలాంటి పరిస్థితుల్ని కళ్ళారా చూస్తూ... ఎన్నో బాధల్ని అనుభవిస్తూ అధికారులకు చెప్పిచెప్పి విసిగిపోయారు గరుసు, గంగి దంపతులు. ఇక లాభం లేదనుకుని సొంతగా తామే ఊరికి రోడ్డు వేయాలని తలిచారు. అలా పట్టుదలతో ఓ అసాధ్యమైనే సంకల్పం వారిలో మొదలైంది. ఊరికి పూర్తిస్థాయిలో రోడ్డు వేయడానికి సుమారుగా రెండు కిలోమీటర్లు పని చేయాల్సి ఉండేది. దీంతో ప్రతిరోజూ రోడ్డు పనుల్లో గరుసు పాల్గొనేవాడు. ఏమాత్రం వీలు దొరికినా భార్యాభర్తలు పార, పలుగు, కత్తి, తట్ట పట్టుకుని వెళ్లి మట్టిని మోసి, రోడ్డుకు ఒక రూపం తెచ్చారు. ఒకవైపు తమ పిల్లలు ప్రశాంతి, దుర్గారావు, సుధీర్, రవి, మరియమ్మను చదివిస్తూనే.. మరోవైపు తమకు ఉన్నదంతా పెట్టి.. రోడ్డు నిర్మాణాన్ని ఒక యజ్ఞంలా తలచి.. ఇది సాధ్యమా అనుకునే పనిని పూర్తిచేశారు.

ఊరికి బాట వేయాలంటే.. కేవలం శ్రమ మాత్రమే సరిపోదు. అందుకు అవసరమయ్యే ముడిసరుకులు కావాలి. అంతో ఇంతో రోడ్డు వేయడానికి యంత్రసామగ్రి కావాలి. అందుకూ గరుసు వెనకాడలేదు. ఆ వ్యయం కోసం తమకు ఉన్న జీడిమామిడి, పసుపు తోటల ద్వారా వచ్చిన ఆదాయాన్ని రోడ్డుపనులకే వెచ్చించారు. కానీ రోడ్డుకు అడ్డంగా బండరాళ్ళు పడడంతో చివరి నిముషంలో రోడ్డు పూర్తికాకపోవడంతో కుటుంబం ఎంతో తల్లడిల్లిపోయింది. అయినా.. ఊరి ప్రజలకు అవసరమయ్యే రోడ్డుకోసం గరుసు కుటుంబానికి ఉన్న సంకల్పం మాత్రం ఆగలేదు.

నా జీవితానికి ఇది చాలు



ఎన్నో ఏళ్ళుగా మా ఊరికి రోడ్డనేదే తెలియదు. ఇది సాధ్యమయ్యే పనేనా..?! అనుకునే స్థితిలో.. కష్టపడి మా ఊరికి రోడ్డు, నీరు అందించగలిగాను. నా జీవితానికి ఇది చాలు. కొండప్రాంతాల్లోని గ్రామాల ప్రజల కోసం ప్రభుత్వాలు దృష్టిపెట్టి, రోడ్లు నిర్మించాలి. అది కనీసం బాధ్యత. అప్పుడే కొండల్లో నివసిస్తున్న గిరిజనుల కష్టాలు కొంతైనా తీరతాయి.

- ఆరిక గరుసు,
గిరిజనుడు, తాడిగండగూడ

పొలాన్ని తాకట్టు పెట్టి

ఎంత కష్టపడినా రోడ్డు పూర్తికాకపోవడంతో గరుసు తన పొలాన్ని తాకట్టు పెట్టగా వచ్చిన రూ.లక్షా 50 వేలతో జెసిబిని తెప్పించాడు. దీంతో అక్కడక్కడ రోడ్డు మధ్యలో బండరాళ్ల చదును చేయడంతో ఊరికి రోడ్డు పూర్తయ్యింది. మొత్తానికి ప్రపంచ ప్రసిద్ధిచెందిన బీహార్ మాంఝీలా మన ఆంధ్రా గరుసు.. తనని తాను త్యాగం చేసుకుంటూ.. ఊరికి రోడ్డు వేసేశాడు. ప్రభుత్వపెద్దలు, ప్రజాప్రతినిధుల్ని.. "అయ్యో.. మనం చేయాల్సిన పనిని.. ఓ సామాన్యుడు చేసి చూపించాడే" అని పశ్చాత్తాపం చెందేలా చేశాడు.

ఈ రోడ్డుకు మధ్యలో రెండుచోట్ల కల్వర్టులను నిర్మించాల్సి ఉంది. గ్రామంలో తాగునీటి సమస్యనూ గరుసు కుటుంబ చొరవతోనే పరిష్కారమైంది. ఊరి ప్రజల దాహార్తిని తీర్చడం కోసం సొంత సొమ్ముతో ఊటబావిని తవ్వించాడు. ఇందులో వేసవిలో సైతం పూర్తిస్థాయిలో నీరు లభిస్తోంది. ప్రపంచమంతా డబ్బు చుట్టూనే తిరుగుతున్న సమకాలీన పరిస్థితుల్లో.. తన బాగుకోసం, కుటుంబకోసం ఆలోచించ కుండా.. ఆరిక గరుసు, గంగి... వీరి కుటుంబం.. ఊరికోసం చేసిన త్యాగం వెలకట్టలేనిది.



ఐటిడిఎ పిఒ దృష్టికి రోడ్డు నిర్మాణం

పార్వతీపురం ఏజెన్సీ పరిధిలో గిరిశిఖర గ్రామాలకు రోడ్డు లేక గిరిజనులు ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే గిరిజనులు సొంతంగా రోడ్డు నిర్మాణాలకు పూనుకుంటున్నారు. గరుసు, గంగిలు చేపట్టిన రోడ్డు పనులు ప్రజాశక్తి విలేకరి ద్వారా పిఒ లక్ష్మీశ దృష్టికి వెళ్లడంతో ఆ రోడ్డుకు కల్వర్టులు వేసేందుకు ఆయన ప్రతిపాదనలు పంపించారు. బీహార్‌లో మాంఝీ పనికి అక్కడి కలెక్టర్ స్పందించి, సిగ్గుపడుతున్నట్లు ప్రకటించారు. ఆ కలెక్టరమ్మ స్వయంగా అతన్ని కలిసి, ఆ సమస్యతో పాటు అక్కడి వారి కనీసావసరాలను తీర్చేపని తలకెత్తుకున్నారు. మన రాష్ట్రంలో అలాంటి స్పందన లేకపోవడం విచారకరం. కానీ గరుసులాంటి వారు చేసిన త్యాగాలకి స్థానిక అధికారులు స్పందన చాలదు. ప్రభుత్వం స్పందించి, తన బాధ్యతను గుర్తెరగాలి. పేదవాళ్లయిన గరుసు, గంగిలు ఖర్చుచేసిన డబ్బులు, వారు చేసిన పనికి ఉపాధి హామీ కింద డబ్బులు ఇవ్వాలి. అప్పుడే గరుసు విజయగాథ పలువురికి ఆదర్శంగా ఉంటుంది.

- వి. నాగరాజు, విజయనగరం

ముభావంగా పని చేసుకుపోతున్నారా?!



నేడు అన్ని రంగాల్లోనూ మహిళలు దూసుకు పోతున్నారు. ఆయా విభాగాల్లో తమదైన ప్రతిభను కనబరుస్తు న్నారు. అలా పనిచేసుకుంటూ పోవడం తప్ప పక్కవారి గురించి పట్టించుకోనివారు చాలామంది ఉంటారు. తీరా కలిసి పనిచేయాల్సి వచ్చేసరికి కంగారుపడతారు. అలా కలసి పనిచేసేచోట..వారితో మాట కలపడంలో తప్పేమీ లేదు. ముభావంగా పనిచేసుకునిపోవడం కాకుండా మాట కలపడమే మంచిది. ఆ మాట ఎలా కలపాలి? ఆఫీసులో సుహృద్భావ వాతావరణం ఎలా పెంపొందించాలి? నిపుణులు చెబుతున్న కొన్ని సలహాలు!

పనిచేసేచోట రకరకాల మనుషులుంటారు. వారిలో ఒక్కొక్కరి మనస్తత్వం ఒక్కోలా ఉంటుంది. వారి వేషభాషలు కూడా భిన్నంగా ఉంటాయి. వారిలో కొందరు కొన్నిసార్లు భిన్నంగా, గొప్పగా అనిపించొచ్చు. అలాంటి సమయంలో వారిని ప్రశంసించాలి. మనకు నచ్చిన విషయాలను వారితో షేర్ చేసుకోవాలి. అది ఆఫీసులో మానవ సంబంధాలను వృద్ధి చేస్తుంది. ప్రతి మనిషిలోనూ ఏదో కొంత ప్రత్యేకత, నిపుణతా ఉంటాయి. ఆ ప్రత్యేకతలను గమనించి, వారిని ప్రశంసిస్తే వారిలో పాజిటివ్ వైబ్స్, అంటే ఆశావహ దృక్పథాన్ని ఇనుమడింపజేసిన వారమవుతాం. కాబట్టి అన్నిసార్లు అప్పియరెన్స్ గురించే కాకుండా... చేసే ఉద్యోగంలో వాళ్ల పనితీరు నచ్చితే వారిని అభినందించండి! ఆ ప్రశంసలు సహజంగా, హృదయ పూర్వకంగా ఉండాలి! అలా ఇతర ఉద్యోగులను ప్రశంసిస్తే, మానవ సహజమైన కృతజ్ఞతాభావం వారిలో మన మీద వారికి ఏర్పడుతుంది. అయితే, యాంత్రికంగా వారిని పొగడాలనే ఉద్దేశంతో ప్రశంసిస్తే ఇట్టే తెలిసిపోతుంది. కాబట్టి ప్రశంస విషయంలోనూ నిజాయితీగా ఉండాలి. ఇందులోనూ కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని దాటకుండా జాగ్రత్తపడాల్సిన అవసరమూ ఉందండోయ్! ఇతరులలో మంచి గమనించడమే కాకుండా, వారి మంచితనాన్నీ, పనితనాన్నీ, వారిలో ఉన్న మంచి టేస్ట్‌నూ గమనించి, వారికి చెబితే... మన ఆటిట్యూడ్ వారికి తెలుస్తుంది. ఇది టీం వర్క్‌కు ఉపయోగపడుతుంది! ★

ఎండలో.. చర్మ సంరక్షణ ఇలా..!!

ఎండలో తిరిగినా.. ప్రాంతం మారినా.. ఎక్కువకాలం పాటు శరీరాన్ని పట్టించుకోకపోయినా చర్మం రంగు పూర్తిగా మారిపోతుంది. మురికి వచ్చి చేరుతుంది. అయితే కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఏ రోజు మురికిని ఆరోజు ముఖంపై తొలగించుకోవచ్చు.

✧ బయటికి వెళ్లి రాగానే... గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడగాలి.

✧ మెత్తని కాటన్ బట్టతో ముఖాన్ని తుడుచుకోవాలి.

✧ రోజ్‌వాటర్‌లో కలిపిన దూదితో ముఖాన్ని తుడుచుకోవాలి.

✧ చెంచా నిమ్మరసం, చెంచా పెరుగు, మూడు చెంచాల టమాట గుజ్జు తీసుకుని బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు పట్టించి, అర్ధగంటసేపు ఉండనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి. ఆరోగ్యంలో కీలకపాత్ర పోషించే నిమ్మరసం, పెరుగు, టమాటా చర్మానికి మంచివి. నిమ్మరసం బరువును ఎంత తగ్గిస్తుందో చర్మానికీ అంతే మేలు చేస్తుంది. పిగ్మెంటేషన్‌తో నల్ల మచ్చలనూ తొలగిస్తుంది. ★



జీవన సౌరభం


సమస్యలొస్తే రానీ...
సవాళ్ళు ఎదురైతే ఎదురవనీ...
ఓటమి తలుపు తడితే తట్టనీ...
నిలుద్దాం... పోరాడదాం...
గెలుద్దాం.

చిట్కా కోసం



కేకును పొరలు పొరలుగా కొయ్యాలంటే దానిచుట్టూ దారం కట్టి రెండోవైపు నుంచి లాగితే, చెదిరిపోకుండా సమంగా కట్ అవుతుంది.

మలివయసు పెళ్ళిచూపులు!



మనిషి జీవితంలో ఒంటరితనం బాధాకరం. అది వారి జీవితాన్ని నాశనం చేస్తుంది. ఏ వయసు వారికైనా ఓ తోడు అవసరం. అందులోనూ యాభై నుంచి అరవై సంవత్సరాల పైబడిన వారికి తప్పనిసరనే చెప్పాలి. వారి బాగోగులు చూసుకోవడానికి, కష్టసుఖాలు పంచుకోవడానికి కచ్చితంగా తోడు అవసరమే మరి! ఇలాంటి అనేక కారణాల దృష్ట్యా చాలామంది వృద్ధాప్యంలో పెళ్లి చేసుకోవాలనుకుంటారు. నిజానికి ఎక్కువగా ఇతరుల మీద ఆధారపడేవాళ్లు ఇద్దరుంటారు. ఒకరు పిల్లలు, రెండోది వృద్ధులు. పిల్లల కంటే ఎలాగో వారి తల్లిదండ్రులు తోడుగా ఉంటారు. మరి వృద్ధులను చూసుకోవడానికి ఎవరుంటారు? అందుకే వృద్ధులు పెళ్లి చేసుకోవాలనుకుంటారు. కానీ, సమాజం ఏమనుకుంటుందో అనే ఆలోచనతో వెనకడుగు వేస్తూ ఉంటారు. ఎందుకంటే, ఆ వయసులో పెళ్లి చేసుకొంటే 'ఇంత ముసలి వయసులో పెళ్లి అవసరమా?!! అని సమాజం నవ్విపోస్తుందనే భయం. కానీ, ముసలి వయసులోనే పెళ్లి అవసరం అనేది 'నాటూభాయి పటేల్' మాట. అంతేకాదు, వారి అభిరుచులకు తగినవారిని కులమతాలకు అతీతంగా వెతికిపెట్టే బాధ్యతా తనదే అంటున్నారాయన. ఇంతకీ, ఎవరీ నాటుభాయ్?

అలాంటివారికి తోడు అవసరమని

నట్వర్ లాల్ పటేల్‌ది అహ్మదాబాద్. ఆయన్ని అందరూ 'నాటూభాయి పటేల్' అని పిలుస్తారు. ఆయన వయసు సుమారు 67 పైనే ఉంటాయి. ఆయన 'వీణా మూల్య అమూల్య సేవా' (vams) అనే మ్యారేజ్ బ్యూరోను స్థాపించారు. ముసలివాళ్లకు, విడాకులు తీసుకున్నవాళ్లకి, వితంతువుల కోసం మాత్రమే ఈ బ్యూరోను స్థాపించారట! ఆయనకి ఈ ఆలోచన ఎలా వచ్చిందంటే...2001లో భుజ్ భూకంపం సమయంలో అక్కడే ఉన్న ఆయన ప్రాణాలతో తప్పించుకున్నారు. అక్కడ చాలామంది వారి జీవిత భాగస్వాముల్ని, కుటుంబ సభ్యుల్ని కోల్పోవడం కళ్ళారా చూశారు. అలా ఒంటరిగా మిగిలిపోయిన వారికి జీవిత భాగస్వాములను అందించాలనే ఉద్దేశ్యంతో ఆయన 2002లో vams మ్యారేజ్ బ్యూరోను స్థాపించారు. అది సీనియర్ సిటిజన్‌ల కోసం మాత్రమే పనిచేస్తుంది. దీనిద్వారా కలిసిన దంపతులు ఇప్పుడు ఒకరికొకరై జీవిస్తున్నారు.



వేల సంఖ్యలో బయోడేటాలు

నాటూభాయి టీం నలుగురు సభ్యులతో ఓ కమిటీగా ఉంటారు. ఈ మ్యారేజ్ బ్యూరో పనితీరు చాలా విచిత్రంగా ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారిని ప్రతినెలా రెండు దఫాలుగా కలుసుకునేలా చేస్తారు. అలా కలుసుకోవడం ద్వారా ఒకరి గురించి మరొకరు తెలుసుకుంటారన్నమాట! ఇంతవరకు ఇండోర్, భూపాల్, రాయ్‌పూర్, జయ్‌పూర్, హైదరాబాద్, చెన్నయి, కోల్‌కతా, కాశ్మీర్ ఇలా చాలా చోట్ల కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమం జరిపే ఏడు నుంచి పది రోజుల ముందే పత్రికల్లో ప్రకటనలు ఇస్తారు. కార్యక్రమం రోజంతా ఉంటుంది. అక్కడికి వచ్చినవారు ఒకరితో ఒకరు మాట్లాడుతూ వాళ్ల గురించి తెలుసుకుంటారు. ఈ కార్యక్రమానికి వచ్చేవాళ్ల ఫోటో, బయోడేటా, ఐడికార్డు తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందండోయ్! అలాగే వధువుని చూసిపెట్టండంటూ నాటూభాయి దగ్గరకి వ్యక్తిగతంగా వచ్చేవారి సంఖ్య భారీగానే ఉంటుందట! ఈయన దగ్గర ఏకంగా 7,000 సీనియర్ సిటిజన్స్, 1000మంది వికలాంగుల బయోడేటా ఫామ్స్ ఉన్నాయి. వివాహం చేసుకోవాలనుకున్నవారు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వారికి సంబంధించిన వివరాలు అంటే, విడాకుల పత్రం కానీ భాగస్వామి డెత్‌సర్టిఫికెట్ కానీ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సీనియర్ సిటిజన్లతో కలిసి, వారి సమస్యలు ఏంటో తెలుసుకుని.. దాని తర్వాత వారి డేటాబేస్ ప్రకారం వారికి తగిన వారిని చూస్తారు నాటూబాయి.



మహిళల్లో చైతన్యం నింపేలా!

నాటూభాయి నవంబర్ 2011లో మొదటి 'లివ్ ఇన్ రిలేషన్‌షిప్' సమ్మేళానాన్ని ఆర్గనైజ్ చేశారు. ఇందులో 300 మంది పురుషులు 70 మంది మహిళలు పాల్గొన్నారు. అమీర్‌ఖాన్ షో 'సత్యమేవ జయతే'లోనూ నాటూబాయి పాల్గొన్నారు. ఆ ప్రోగ్రాం తర్వాత ఆయనకు మరిన్ని ప్రశంసలు వచ్చాయి. ఈ మ్యారేజ్‌బ్యూరో పూర్తిగా ఉచితం. ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఇక్కడ జాతి, మతం, ప్రాంతం అనే భేదాలు లేవు. ఏటా 250 జంటలు vams సహాయంతో విహారయాత్రకూ వెళ్లివస్తున్నారు. వీరి ఖర్చునూ మ్యారేజ్‌బ్యూరోనే చూసుకుంటుంది.

నాటుభాయి దగ్గర వున్న 7000 బయోడేటాల్లో వెయ్యి బయోడేటాలు మాత్రమే మహిళలవి ఉన్నాయి. '50 సంవత్సరాలు పైబడిన మహిళలకు వరుడ్ని చూడాలంటే క్లిష్టమైన పనే. అందుకు కారణం వారు ధైర్యంగా ముందుకు రాలేకపోవడమే! అలాంటి మహిళల్లో మరింత చైతన్యం తెచ్చేందుకు మా కార్యక్రమంలో పాల్గొనే మహిళల ఖర్చులన్నీ మా మ్యారేజ్‌బ్యూరోనే భరిస్తుంది' అంటున్నారు నాటూబాయి. అలా ఒక్కో జోడీనీ కలుపుతూ ఉంటే ఆయనకు చాలా సంతోషంగా ఉంటుందట! కుటుంబంలోకి కొత్త వ్యక్తి ప్రవేశించగానే వారి జీవితం మొత్తం మారిపోతుంది. ఒకరికి అమ్మ దొరకవచ్చు.. ఇంకొకరికి తండ్రి.. మరొకరికి అత్తమామలు.. ఇలా మనుషుల మనసులు కలుపుతూ ఉంటే చాలా ఆనందంగా ఉంది అంటున్నారు నాటూబాయి. ★

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref: C1/606/17 ఫారం నెం.VII ది.12-03-2018

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్(1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం పశ్చిమగోదావరి జిల్లా **బుట్టాయిగూడెం** మండలం జిల్లా **గణపవరం** గ్రామంకు సంబంధించిన భూములు అవసరమైనవని స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్లు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2017-18నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య.10.37 సెంట్లు లను ప్రజా ప్రయోజనములకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం **Additional Land Acquisition Area of Main Canal** కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: పశ్చిమ గోదావరి | మండలం: బుట్టాయగూడెం | గ్రామం: గణపవరం

క్రమ సంఖ్య	సర్వే నెం./ స.డి.నెం.	మొత్తం విస్తీర్ణం	సేకరించిన విస్తీర్ణం	వర్గీకరణ	సంబంధిత అసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరాలు	
1	2	3	4	5	6	7				8	
1	148/2A 2	2.02	0.27	స. పుంజ	దారే ముత్యాలు తండ్రి జోగయ్య	148/2 A1	148/ 2B	V.No. Jakki setti gudem	150	టేకు, ఎర్రచందనం	--
			0.17		ఆకుల వెంకట చెల్లారావు తండ్రి పద్మరాజు					--	3 షెడ్‌లలో 8 బ్యారన్‌లు
2	149/1 A2	0.09	0.09	స. పుంజ	ఆకుల వెంకట చెల్లారావు తండ్రి పద్మరాజు	149/1 A1	149/ 2A	149/1 A1	150	--	--
3	149/2 B	3.07	0.26	స. పుంజ	గూడుపు వెంకటేశ్వరరావు తండ్రి గంగన్న	149/1 A2, 1A1	149/ 2B	V.No. Jakki setti gudem	150	నిమ్మ-1, మొక్కజొన్న పుగాకు,టేకు-1, తాడి-40	--
4	150/1 B	0.46	0.07	స. పుంజ	దాకారపు నాగరాజు తండ్రి సూరయ్య	150/1 A	150/ 2	148	152	--	--
			0.15		విజ్జ త్రిమూర్తులు తండ్రి బుల్లి వెంకన్న					పుగాకు	--
5	150/7 A	4.53	0.06	స. పుంజ	దాకారపు సత్యనారాయణ తండ్రి చంద్రరావు	150/2	150/7 B	149, 150/2	152	మిరప	--
			0.24		విజ్జ త్రిమూర్తులు తండ్రి బుల్లి వెంకన్న					పుగాకు	షెడ్
6	152/1 B	0.77	0.24	స. పుంజ	శింగులూరి సుబ్బలక్ష్మి భర్త రాంబాబు	152/1 A	152/ 2	150	155	పుగాకు, తాడి-4	పాక, బ్యారన్-2
7	152/7 A	3.73	0.22	స. పుంజ	దాకారపు సత్యనారాయణ తండ్రి రాంబాబు	152/1 A	152/ 2	150	155	--	--
8	153/ A2	5.60	0.14	గ్రామ కంఠం	దాకారపు లక్ష్మి భర్త చంద్రరావు	153/1 A1	153/ 1B	152	154	పుగాకు	షెడ్
9	154/2 A	1.41	0.05	స. పుంజ	కోరం వెంకటేశ్వరరావు తండ్రి ముత్యాలు	154/1	154/ 2B	153	155	మొక్కజొన్న	--
10	155/1 A	4.76	0.30	స. పుంజ	ముయిబోయిన వసంతరావు తండ్రి వెంకన్న	155/1 A	155/2	152	140	పుగాకు	--
11	155/3 A	4.91	0.11	స. పుంజ	ముయిబోయిన వసంతరావు తండ్రి వెంకన్న	155/2	155/3 B	154	156	మిరప	--
			0.16		కురసా జంపాలు తండ్రి కన్నయ్య					మొక్కజొన్న	--
12	156/2 A	5.16	0.08	స. పుంజ	బందారు రమణ తండ్రి సోమరాజు	156/1	156/ 2B	156	159	టమోట, జాడు	--
			0.20		రామిశెట్టి వెంకటలక్ష్మి భర్త నాగసత్యనారాయణ					పుగాకు	--
			0.10		బందారు నాగరాజు					కాకర పందిరి	--
13	138/1 A2	4.08	0.22	స. పుంజ	బందెల వసంతరావు తండ్రి వెంకటేశ్వరరావు	138/1 A1	138/ 1B	138/2 A	137	మిరప	--
			0.16		బందెల సంజీవరావు తండ్రి వీరన్న					పుగాకు	--
14	138/2 A2	1.66	0.02	స. పుంజ	జలసూత్ర నరసింహారావు	138/1 A1	138/ 1B	138/2 A	137	--	పాక
15	159/2 B	1.64	0.01	స. పుంజ	ఈదుపుగంటి వెంకన్న తండ్రి రామయ్య	160	159/2 A	156	159/2 A	--	--
16	131/1 A2	1.78	0.26	స. పుంజ	బందెల సంజీవరావు	131/1 A1	131/ 1B	138	130	పుగాకు	--
17	131/2 B1	0.63	0.26	స. పుంజ	గూడుపు వెంకటేశ్వరరావు తండ్రి గంగన్న	131/1 B	131/2B 2,160	131/1 B	131/2B 2,129	--	ఇటుకలు తీసు కలం, కుండీ
18	130/1B	2.63	0.34	స.పుంజ	చెన్ను సత్యనారాయణ	130/1A	130/2	131	126	--	--
19	126/1 B	4.03	0.32	స.పుంజ	జువ్వా జయ్యన్న తండ్రి వెంకన్న	126/1 A	126/ 2	130	127	కొంత మొక్క జొన్న కొంత భూమి ఖాళీ	--
20	128/1A	0.01	0.01	స. నంజ	నందిన వెంకటరావు తండ్రి సీతారామయ్య	126	128/ 1B	126	126	--	--
21	128/1 D1	4.03	0.33	స. నంజ	నందిన మోహనరావు తండ్రి సుబ్బారావు	128/1 B	128/1 D2	128/2 A	110	పుగాకు	--
22	128/2 A	2.14	0.02	స. పుంజ	తాండ్ర నాగమణి భర్త రామకృష్ణ	126	128/ 2B	126	128/1 D1	పుగాకు	--
23	110/2 A	7.67	0.29	స. నంజ	పుసులూరి యశ్వంత్ కుమార్ తండ్రి రాంబాబు					జామాయిల్	--
			0.08		కాలువ					--	--
24	109/1B 1	2.00	0.13	స. నంజ	గెడా సూర్యారావు తండ్రి జోగయ్య	109/1 A	109/ 1B2, 110	109/1 A	102	--	--
			0.04		శివుడు వెంకటస్వామి తండ్రి భీముడు					జాడ	--
25	109/2B	0.06	0.06		దమ్మేటి వీరాస్వామి తండ్రి ఆటాలు						
26	120/2A 2	5.90	0.08	స. పుంజ	జువ్వా సత్యనారాయణ తండ్రి వెంకన్న	120/2 A1	120/ 2B, 111	126	120/2A 1	పుగాకు తాడి-2	--
			0.19		మెండెం నాగేశ్వరరావు తండ్రి నరసింహులు					పుగాకు, వేప-1 మామిడి-1,జామాయిల్	--
27	112/1 B	0.31	0.01	స. పుంజ	శివుడు వెంకటస్వామి తండ్రి భీముడు	112/1 A	112/2B, 2A2	112/2 A1	101	--	--
28	112/2 A2	3.73	0.14	స. నంజ	శివుడు వెంకటస్వామి తండ్రి భీముడు	112/2 A1	112/2 B	119	112/1 B	పుగాకు, తాడి-2 వేపచిన్నది-1	--
			0.16		గద్దే సోమరాజు తండ్రి సత్యనారాయణ					పుగాకు	--
29	102/1 C1	1.65	0.20	స. పుంజ	గద్దే ఏసుబాబు తండ్రి తాతారావు	102/1 A	102/1 C2	102/2	98	పుగాకు, తాడి-3	బోరు-1, పైపులైను
30	102/2 B1	0.45	0.08		శివుడు వెంకటస్వామి తండ్రి భీముడు						
31	101/3 B2	1.66	0.09	స. పుంజ	ఆచంట శ్రీనివాసరావు తండ్రి దుర్గిరాజు	101/3 B1	101/4 C2	101/4 C2	101/4 A2	పుగాకు	--
32	101/4 A2	0.18	0.04	స. పుంజ	గద్దే పద్మజ భర్త దుర్గారావు	101/4 A1	101/3 A	101/3 B2	87	పుగాకు	--
33	101/4 C2	0.68	0.28	స. పుంజ	గద్దే పద్మజ భర్త దుర్గారావు	101/4 C1	101/ 3A	101/5 A	101/3 B2	పుగాకు	--
35	98/2A2 A	2.82	0.38	స. పుంజ	అల్లూరి వెంకటలక్ష్మి భర్త రంగారావు	98/1 A	98/2 A2B	98/2 B2A	91	జామాయిల్	--
36	98/2C2 A	0.09	0.01	స. పుంజ	పుసులూరి సుధాకర్ తండ్రి బుల్లెబ్బాయి	98/1 A	98/2 C2B	102	98/2A 2A	కొంత జామాయిల్ కొంత ఖాళీ భూమి	--
37	98/2D 2A	0.50	0.05	స. పుంజ	పుసులూరి సుధాకర్ తండ్రి బుల్లెబ్బాయి	98/1 A	98/2 D2B	98/2 C2A	98/2 E2	--	--
38	98/2 E2	4.00	0.01	స. పుంజ	పుసులూరి ప్రభావతి భర్త సత్యనారాయణ	98/2 A2B	98/2 E1	98/2 D2A	98/2 E1	--	--
39	87/1A 2	8.24	0.11	స. పుంజ	యాదాల సత్యనారాయణ తండ్రి నాగన్న	87/1A 1	87/1 B	101	87/2A 1	--	--
			0.02		జిత్తుల దుర్గమ్మ భర్త వెంకటేశ్వరరావు						
40	87/2A 2	1.15	0.23	స. పుంజ	కణితి కృష్ణ తండ్రి చిన రాముడు	87/2A 1	87/1 B	87/1A 1	86	--	--
41	86/1A 2	6.11	0.18	స. పుంజ	కణితి దుర్గారావు తండ్రి ఊసయ్య	86/1A 1	86/1 B	87	85	--	--
42	91/1B1	8.06	0.51	స. పుంజ	తోటం పుష్పావతి భర్త పరశురాముడు	91/1A	91/1 B2	98	90	జామాయిల్	పైపులైను
43	85/2B1 B	2.80	0.14	స. పుంజ	కణితి దుర్గారావు తండ్రి ఊసయ్య	85/2B 1A	85/3 B	86	85/3A 1	--	--
44	85/3A2	3.32	0.19	స. పుంజ	కణితి కృష్ణ	85/3A 1	85/3 B	85/2 B1B	84	--	--
			0.11		మదకం దుర్గారావు తండ్రి పెంటయ్య						
			0.08		మదకం బోడియ్య						
45	84/3A1	0.95	0.12	స. పుంజ	మదకం సన్యాసి తండ్రి కన్నయ్య	84/3A 1	84/3 B	85	82	--	--
46	89/1A2	0.40	0.13	స. పుంజ	తాండ్ర వీరా కృష్ణ తండ్రి వెంకటరావు తాండ్ర వెంకటేశ్వరరావు తండ్రి వెంకటరావు	89/1A 1	89/1 B	84	82	జామాయిల్	--
47	89/2C	0.27	0.11	స. పుంజ	తాండ్ర వెంకటేశ్వరరావు తండ్రి వెంకటరావు	89/1B	89/3 A2	90	82	జామాయిల్	--
48	89/3A 2A	1.85	0.19	స. పుంజ	గద్దే అచ్యుతరావు	89/1B	89/3 A2	90	82	--	--
49	82/1A1	1.91	0.06	స. పుంజ	పిచ్చుకల ధర్మరాజు తండ్రి సత్యనారాయణ	82/1A 1	82/1 B	86	83	--	--
50	82/2B1	0.29	0.04	స. పుంజ	గద్దే అచ్యుతరావు	82/1B 2	82/2 B2	86	83	--	--
51	81/1B1	2.36	0.02	స. పుంజ	పూనెం దుర్గారావు తండ్రి వీరభద్రుడు	81/1A	81/1 B2	81/1 B2	66	--	--
52	63/2A1	1.36	0.16	స. పుంజ	అల్లూరి దుర్గారావు తండ్రి రామారావు	63/2A 1	63/2 B	63/2 B	R.F	--	--
53	63/3A1	4.51	0.08	స. పుంజ	పుసులూరి బ్రహ్మానందం తండ్రి సత్యనారాయణ	63/2A 1	63/2 B	63/2 B	R.F	పుగాకు	--
54	63/4A1	3.58	0.02	స. పుంజ	పుసులూరి అచ్యుతరావు	63/2A 1	63/2 B	63/2 B	R.F	పుగాకు	--
55	64/1B1	10.10	0.16	స. పుంజ	యాండ్ర శుక్రాచార్యులు తండ్రి వీరాస్వామి	64/1A	64/1 B2	64/2 B1	R.F	జామాయిల్‌తోట నరికివేసినారు	--
			0.12		యాండ్ర వీరవెంకట సత్యనారాయణ తండ్రి రామారావు					టేకు-5	--
56	64/3B1	0.57	0.06	స. పుంజ	యాండ్ర శుక్రాచార్యులు తండ్రి వీరాస్వామి	64/1A	64/3 B2	64/3 B2	64/1 B1	జామాయిల్‌తోట నరికివేసినారు	--
మొత్తం:			10.02								

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలో నైన తనిఖీ చేసుకోవచ్చు. చట్టములోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్టు ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్ట్ నిర్వాశిత కుటుంబములు ఎవ్వరు లేరు.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని, లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.

సం/- **సిహెచ్.భానుప్రకాష్**, స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

వేదిక

S.S.C. MODEL PAPER

MATHS PAPER-I

PART – A

Time: 2h.16m **Max Marks: 30**

Instruction:

1. 15 Minutes of time is allotted for reading the question paper
2. Answer All the questions.
3. Answer for questions under part-A should be written in a separate answer book.
4. There is internal choice for questions in Section - III, Part-A.

SECTION-I **(4×1=4)**

Instruction:

1. Answer all questions.
2. Each question carry **1** mark.

1. Using Euclid's division algorithm find HCF of 231 and 396.
2. Write A = $\left\{1, \frac{1}{2}, \frac{1}{3}, \frac{1}{4}, \frac{1}{5}\right\}$ in set builder form.
3. The sum of the zeros of the quadratic polynomial $3x^2 - kx + 1$ is 1. Find the value of k.
4. Find the volume of sphere of radius 21 cm.

SECTION-II **(5 × 2=10)**

Instruction:

1. Answer all questions.
2. Each question carry **2** marks.

5. Find the quadratic polynomial whose zeros are $3+\sqrt{5}$ and $3-\sqrt{5}$
6. How many two digit numbers are divisible by 3.
7. An oil drum is in the shape of cylinder and its diameter is 2m and height is 7m.
If the painter charges Rs. 3 per sq.mt to paint the drum find the charges to be paid to the painter for 10 drums.
8. What is the nature of the roots of the quadratic equation $3x^2-2x+\frac{1}{3}=0$
9. Express the algebraic expression of the following:
i) 3 times of a number, when increased by 7 gives 20.
ii) Sum of a number and its reciprocal is 10.


SECTION-III **(5 × 2=10)**

10. a) Solve the pair of equations $\frac{2}{x}+\frac{3}{y}=13$ and $\frac{5}{x}-\frac{4}{y}=-2$

(or)

b) A solid metalic sphere of diameter 28 cm is melted and recast into a number of small cones, each of diameter $4\frac{2}{3}$ and height 3 cm. Find the numer of cones so formed.

11. a) By using the gien venn diagram prove that $n(A\cup B)=n(A)+n(B)-n(A\cap B)$



(or)

b) Prove that $\sqrt{5}$ is an irrational number by the method of contradiction.

12. a) A sum of Rs. 700 is to be used to given 7 cash prizes to the students of a school for their overall academic performance. If each prize is Rs. 20 less than its preceding prize. Find the value of each prize.

(or)

b) A fraction becomes equal to $\frac{4}{5}$, if 1 is added to both numerator and denominator. If however 5 is subtracted from both numerator and denominator the fraction becomes equal to $\frac{1}{2}$, then what is the fraction.

13. a) Find the zeroes of the quadratic polynomial $x^2 + 3x - 4$ by graphical method.

(or)

b) 5 pencils and 7 pens together cost Rs. 50 where as 7 pencils and 5 pens together cost of Rs. 46. Find the cost of 1 pencil and 1 pen. (by using graph sheet)

PART – B

Time: 30 Min **Marks: 10**

Instruction:

1. Answer the all questions.
2. Each question carries 1/2 mark.
3. Part - B answers should be written the given paper only.
4. No marks given to over writing answers.

SECTION - IV **(20×1/2=10)**

(i) Answer all the questions.
(ii) Each question carries 1/2 Mark

14. Which one of the following irrational number. ( )
A) $\frac{2}{3}$ B) $\sqrt{\frac{16}{25}}$
C) $\sqrt{8}$ D) $\sqrt{0.04}$

15. Which is a non terminating decimal ? ( )
A) $\frac{3}{7}$ B) $\frac{3}{5}$
C) $\frac{7}{25}$ D) $\frac{3}{8}$

16. logarithmic form of $2^3 = 8$ is ( )
A) $\log_2 8 = 3$ B) $\log_8 2 = 3$
C) $\log_3 8 = 2$ D) $\log_3 2 = 8$

17. A,B are two disjoint sets then $n(A\cap B)=$ ( )
A) 0 B) 1
C) n(A)+n(B) D) None

18. If A = {1,2,3,4, 5} then the number of subsets of A
A) 5 B) 25
C) 31 D) 32

19. Which of the following is not an element of the set A = $\{\chi:\chi\in N, 1\le\chi<5\}$ ( )
A) 1 B) 3
C) 4 D) 5

20. The sum of the zeros of $4X^2 = 1$ ( )
A) $\frac{1}{4}$ B) $-\frac{1}{4}$
C) 0 D) 4

21. if α,β are the zeros of quadratic polynomial ax^2+bx+c then $\frac{1}{\alpha}+\frac{1}{\beta}$ = ( )
A) $-\frac{b}{c}$ B) $-\frac{c}{a}$
C) $-\frac{c}{a}$ D) $-\frac{c}{a}$

22. The coefficient of x^5 in the polynomial $x^7 + x^4 - 2x^3 - 4x + 1$ ( )
A) 1 B) -2
C) -4 D) 0

23. The line which is parallel to x - 2y = -1 is....
A) 2x = 4y -1 B) x + 4y = 1 ( )
C) 3x + 6y = 5 D) None

24. What is the condition for representing, intersecting line of linear pair of equations $a_1x+b_1y+c_1 = 0$ and $a_2x+b_2y+c_2 = 0$ ( )
A) $\frac{a_1}{a_2}\ne\frac{b_1}{b_2}$ B) $\frac{a_1}{a_2}=\frac{b_1}{b_2}$
C) $\frac{a_1}{a_2}=\frac{b_1}{b_2}\ne\frac{c_1}{c_2}$ d) None

25. The graph y = bx+ a is a straight line which intersects X-axis at ( )
A) (0,b) B) $\left(0,-\frac{b}{a}\right)$
C) $\left(0,-\frac{a}{b}\right)$ D) $\left(-\frac{a}{b},0\right)$

26. The roots of $px^2 + qx + r$ are equal then
A) $q^2 = 4pr$ B) $p^2 - 4pr = 0$ ( )
C) $q^2 + 4pr = 0$ D) $r^2 - 4pr = 0$

27. If one root of $2x^2+kx-6$ is 2 then k = ...
A) 3 B) 4 ( )
C) 1 D) -1

28. If x-1, x+3, 3x-1 are in A.P. then x = ...
A) 5 B) 8 ( )
C) 6 D) 4


29. Sum of the first 50 natural numbers ....
A) 5050 B) 5500 ( )
C) 1050 D) 1275

30. In a G.P. $a_n = 3.2^{n-1}$ then common ratio is ..... ( )
A) 3 B) 2
C) 6 D) -1

31. Curved surface area of hemi sphere is.....
A) $\pi\gamma^2$ B) $2\pi\gamma^2$ ( )
C) $3\pi\gamma^2$ D) $4\pi\gamma^2$

32. If the volume of a cube is 216 cm^3 then its side is ....cm. ( )
A) 6 B) 4
C) 8 D) 16

33. In the figure l^2 = ... ( )



A) r^2+h^2 B) r^2-h^2
C) $\sqrt{r^2-h^2}$ D) $\sqrt{r^2+h^2}$

Part -B (Answers)

14.C	15.A	16.A	17.A
18.D	19.D	20.C	21.A
22.D	23.A	24.A	25.D
26.A	27.D	28.D	29.D
30.B	31.B	32.A	33.A

ఎన్‌ఈఈఆర్‌ఐలో 15 ఉద్యోగాలు

నాగపూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌ఈఈఆర్‌ఐ) 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్‌ఐఆర్)కు చెందింది.

పోస్టు-ఖాళీలు: టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)-10, టెక్నికల్ ఆఫీసర్ (టీవో)-1, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ (ఎస్‌ఆర్‌టీవో)-4.

వేతనం: టీఏ-రూ.35,400, టీవో-రూ.49,900, ఎస్‌ఆర్‌టీవో-రూ.56,100.

అర్హతలు: సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి బీఎస్సీ/ బీఎస్సీ ఇంజనీరింగ్/ ఇంజనీరింగ్ డిప్లొమా/ బీఈ/ బీటెక్/ ఎంబీఏ/ ఎంఎస్సీ/ ఎంబీబీఎస్. అలాగే సంబంధిత రంగంలో నిబంధనల మేర అనుభవం ఉండాలి.

వయసు: 2018, జనవరి 31 నాటికి టీఏకు 28 ఏళ్లు, టీవో-30 ఏళ్లు, ఎస్‌ఆర్‌టీవో-35/40 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: రాతపరీక్ష/ స్క్రీనింగ్ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ.

దరఖాస్తు ఫీజు: రూ.100, రిజర్వేషన్ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: ఏప్రిల్ 2, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: **www.neeri.res.in**

కొనుగోళ్లతో దూకుడు

ముంబయి : అంతర్జాతీయ సానుకూల పరిణామాల మద్దతుతో సోమవారం భారత మార్కెట్లు దూకుడుగా వ్యవహరించాయి. ఐఐపి, ద్రవ్యోల్బణం సూక్ష్మ గణంకాలు అనుకూలంగా రానున్నాయనే అంచనాలు కూడా మార్కెట్లపై విశ్వాసాన్ని పెంచాయి. గత కొద్ది రోజులుగా భారీగా పడిపోయిన సూచీలు కూడా మదుపర్లను కొనుగోళ్లకు మొగ్గు చూపేలా చేశాయి. ఈ పరిణామాల మధ్య బిఎస్‌ఇ సెన్సెక్స్ 610.80 పాయింట్లు లేదా 1.83 శాతం ఎగిసి 33.917.94కు చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 194.55 పాయింట్లు లేదా 1.9 శాతం వృద్ధితో 10,421.40కు పెరిగింది. ఇంట్రా ట్రేడింగ్‌లో నిఫ్టీ ఏకంగా 10,433.65 వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్ ఇంట్రా ట్రేడింగ్‌లో రికార్డు స్థాయిలో 650 పాయింట్లు పెరిగి 33,962కు చేరింది. మరోవైపు ప్రభుత్వ బ్యాంకింగ్ షేర్లు భారీగా నష్టపోగా, ప్రయివేటు బ్యాంకు సూచీలు లాభాల్లో నమోదయ్యాయి.

సానుకూల అంశాలు..

అమెరికా ఉపాధి డేటా పెరిగిందన్న అంచనాలు ప్రపంచ మార్కెట్లలో విశ్వాసాన్ని పెంచాయి. గత నెలలో వ్యవసాయేతర ఉపాధి రేటులో పెరుగుదలకు తోడు జనవరిలో ద్రవ్యోల్బణం తగ్గడం కలిసివచ్చాయి. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లు పెంచనుందన్న అంచనాలు డోజోన్స్‌ను తిరిగి 25,000కు చేర్చింది. అదే విధంగా ఆసియన్ మార్కెట్లు కూడా లాభాలను నమోదు చేశాయి. వచ్చే ఏడు సంవత్సరాల్లో భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే 7వ అతిపెద్దదిగా అవతరించనుందని వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభూ అంచనా వేశారు. ఇది కూడా మార్కెట్లలో సానుకూలత పెంచింది. ఓ దశలో చైనా ఆర్థిక వ్యవస్థను మించనున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ 2.5 ట్రిలియన్ డాలర్లు, చైనా 11.85 ట్రిలియన్ డాలర్ల విలువ చేసే ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయి.

రంగాల వారిగా..

సెన్సెక్స్ 30లో ఒక్క కోల్ ఇండియా మాత్రమే 2.20 శాతం నష్టపోయింది. కాగా భారతీ ఎయిర్‌టెల్ 5.08 శాతం, ఎన్‌టిపిసి 4.61 శాతం, ఐటిసి 4.34 శాతం, యస్ బ్యాంకు 3.48 శాతం, హీరో మోటో కార్ప్ 3.42 శాతం, టాటా మోటార్స్ 3.18 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. నిఫ్టీలో ఆటో 1.45 శాతం, ఎఫ్‌ఎంసిజి 2.62 శాతం, లోహ 2.14 శాతం, ఫార్మా 1 శాతం, ఐటి 1.38 శాతం చొప్పున రాణించాయి. కాగా పిఎస్‌బి బ్యాంకింగ్ సూచీ మాత్రమే 0.47 శాతం నష్టపోగా, ప్రయివేటు బ్యాంకింగ్ సూచీ 1.89 శాతం పెరిగింది.

పెరిగిన ఐఐపి, తగ్గిన ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది జనవరిలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపి) 7.5 శాతానికి పెరిగింది. తయారీ రంగం ఏకంగా 8.7 శాతం వృద్ధిని కనబర్చిందని కేంద్ర గణంకాల శాఖ సోమవారం వెల్లడించింది. మొత్తం ఐఐపిలో తయారీ రంగం వాటా 77.63 శాతంగా ఉంది. గతేడాది డిసెంబర్‌లో ఐఐపి 7.1 శాతంగా, నవంబర్‌లో 8.8 శాతంగా నమోదయ్యింది. మరోవైపు ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.44 శాతానికి తగ్గి నాలుగు మాసాల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఇంధన, అహారోత్పత్తుల ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణం దిగివచ్చిందని సిఎస్‌ఒ పేర్కొంది. జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.07 శాతంగా ఉంది. 2017 ఫిబ్రవరిలో 3.65 శాతంగా నమోదయ్యింది. ఐఐపి పెరగడం, ద్రవ్యోల్బణం తగ్గడం పెట్టుబడిదారులకు, మార్కెట్లకు మంచి పరిణామమని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

నారాయణ, చైతన్యలపై చర్యలు తీసుకోండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడపఅర్బన్

నారాయణ, చైతన్య విద్యా సంస్థలు డబ్బే ధ్యేయంగా పని చేస్తున్నాయని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ విమర్శించారు. సోమవారం డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. అడ్మిషన్లు చేర్చాలంటూ ఉపాధ్యాయులును, ఉద్యోగులను వేధిస్తున్నారని చెప్పారు. అడ్మిషన్లు తీసుకురాకుంటే ఇంక్రిమెంట్లు కట్ చేయడం, వేతనల పెంపు ఆపివేయడం చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శించారు.



ప్రారంభోత్సవం

అనంతపురం సుభాష్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన హ్యాపీ మొబైల్స్ షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి సమంత

అనంతపురంలో సమంత సందడి

హ్యాపీ మొబైల్స్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురంలో సినీనటి సమంత సందడి చేసింది. సుభాష్‌రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన హ్యాపీ మొబైల్స్ షోరూంను సోమవారం ఆమె ప్రారంభించారు. సమంతను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు సుభాష్‌రోడ్డు వద్దకు చేరుకున్నారు. షోరూంను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. అనంతపురానికి రావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. హ్యాపీ మొబైల్ స్టోర్‌లో అధునాతన మొబైల్ ఫోన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ ధరలకే కొత్త ఫీచర్లతో మొబైల్స్‌ను విక్రయిస్తున్నట్లు చెప్పారు. తదుపరి సినిమాల గురించి సమంతను విలేకరులు అడగగా.. ప్రస్తుతం రంగస్థలం పూర్తి అయిందని, ఆ సినిమా విడుదలపై తాను చాలా ఉత్కంఠతో ఎదురు చూస్తున్నానని చెప్పారు. తదుపరి చిత్రాలు చర్చల దశల్లో ఉన్నాయని సమంత సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో షోరూం ఎండి క్రిష్ణపవన్, సిబ్బంది పాల్గొన్నారు.

దూసుకొచ్చిన అభిమానులు

సమంతను చూసేందుకు అభిమానులు ఒక్క సారిగా స్టేజి వద్దకు దూసుకువచ్చేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంలో అక్కడే ఉన్న పోలీసులు అభిమానులను నియంత్రించేందుకు లాఠీలకు పనిచెప్పాల్సి వచ్చింది. తోపులాటలో అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్ కూలిపోయింది. అనంతరం కొందరికి సమంతతో సెల్ఫీలు తీసుకునే అవకాశాన్ని షోరూం నిర్వాహకులు కల్పించారు.

'రిమ్స్' కార్మికుల వంటావార్పు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఐదు నెలల బకాయి వేతనాలను చెల్లించాలన్న ప్రధాన డిమాండ్‌తో రిమ్స్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన సెక్యూరిటీ గార్డులు చేపట్టిన సమ్మె నాలుగో రోజూ కొనసాగింది. సమ్మెలో భాగంగా రిమ్స్ జనరల్ ఆస్పత్రి ఆవరణలోని సమ్మె శిబిరం వద్ద సోమవారం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. సెక్యూరిటీ గార్డుల సమ్మెకు సిపిఎం, కాంగ్రెస్, లోక్‌సత్తా పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముస్తాక్ మహమ్మద్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు చెల్లించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం చేష్టలుడిగిందని విమర్శించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు వి.అప్పలరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు పాల్గొన్నారు.

గిరిజనులంటే చిన్న చూపా?

గొల్లమందల తండాలో అధికారుల నిర్బంధం

ప్రజాశక్తి-ఎ.కొండూరు (కృష్ణా)

తాము గిరిజనులమని చిన్నచూపు చూస్తారా? మా మృత్యుఘోష మీకు వినిపించడం లేదా? అంటూ కృష్ణాజిల్లా ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాకు చెందిన గిరిజనులు అధికారులను సోమవారం నిర్బంధించారు. గొల్లమందల తండాకు చెందిన భూక్యా చావళి మూడేళ్లుగా కిడ్నీవ్యాధితో బాధపడుతూ ఈ నెల 11న మృతిచెందిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎ.కొండూరు ఎంపిడిఒ నాంచారరావు, పిహెచ్‌సి వైద్యాధికారిణి అనూష, పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాసరరావు సోమవారం గొల్లమందల తండాలోని మృతురాలి ఇంటికి వెళ్లారు. అప్పటికే దహన సంస్కారాల ఏర్పాట్లు చేసుకుంటున్న మృతురాలి కుటుంబీకులు, తండావాసులు అధికారులను చూడగానే ఆవేశానికి లోనై తమకు న్యాయం చేయాలని, న్యాయం జరిగే వరకు మిమ్మల్ని కదలనివ్వమని వారిని నిర్బంధించారు. ఈ విషయాన్ని ఎంపిడిఒ ఫోన్‌ద్వారా తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్‌కు తెలియచేయగా ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ లక్ష్మీకాంతం మృతురాలి కుటుంబానికి పిఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు అధికారులను విడుదల చేశారు.

షరతులు లేని పట్టాలివ్వాలని పాదయాత్ర

ప్రజాశక్తి-గాజువాక, విశాఖ

గాజువాక హౌస్ కమిటీ బాధితులకు ప్రభుత్వం షరతులు లేని పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన రెండో రోజైన సోమవారమూ పాదయాత్ర సాగింది. జివిఎంసి 64వ వార్డు పరిధిలోని జోగవాని పాలెంలో ప్రారంభమైన యాత్రను ఉద్దేశించి పార్టీ ప్రాంతీయ కమిటీ నాయకులు జి.సుబ్బా రావు మాట్లాడారు. 301 జిఒ కింద ఇచ్చిన పట్టాల్లో షరతులు మూలంగా భూముల క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండా పోయింద న్నారు. దీంతో 50 వేల మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ సంతకంతో కూడిన అధీకృత పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1. అస్మిత యోజ, 2. వివెక్ ఆర్ వాడెక్కర్
3. చెన్నై నుంచి బల్లాభగరహ్ (హర్యానా)
4. డయ్యూ 5. పంజాబ్

గుంటూరులో కౌలు రైతుల మహాధర్నా

- వ్యవసాయ శాఖ కమిషనరేట్ వద్ద 3 గంటల బైఠాయింపు
- రుణమాఫీ, ఇతర సమస్యల పరిష్కారాని హామీ

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

అనేక సమస్యలతో సతమతమవుతున్న తమను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కౌలురైతులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరులోని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖ కమిషనరేట్ కార్యాలయం వద్ద సోమవారం మహాధర్నా చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి కౌల్దార్లు పెద్దఎత్తున హాజరై మండుటెండలోనే కార్యాలయం ఎదుట రోడ్డుపై మూడు గంటలపాటు బైఠాయించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎన్.రంగారావు, పి.జమలయ్య మాట్లాడుతూ.. రుణమాఫీకి రూ.574 కోట్లు అవసరమైతే రూ.14.4 కోట్లనే రద్దు చేశారని, ప్రభుత్వం హామీమేరకు రుణాలన్నీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుమిత్ర, జెఎల్‌జి గ్రూపుల్లోని కౌల్దార్ల వివరాలను ప్రభుత్వమే స్వీకరించి రుణాలను రద్దు చేయాలన్నారు. పంటలకు ప్రకటించిన ఇన్‌పుట్ సబ్సిడీని తక్షణమే విడుదల చేయలేదని, అప్పుల్లో కూరుకున్న రైతు ఆత్మహత్యలను నివారించలేని ప్రభుత్వం వారి ఆదాయాన్ని ఎలా రెట్టింపు చేస్తుందని ప్రశ్నించారు. 2011 కౌలు రైతుల చట్టం ప్రకారం కౌలు రైతులకు రుణాలివ్వడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కౌలురైతుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని, నిధులను దామాషా పద్ధతిలో ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కమిషనర్‌తో నాయకులు చర్చించారు.

రుణాలు మాఫీ అవ్వని ఆర్ఎంజి, జెఎల్‌జి, ఎల్ఇసి గ్రూపుల రుణాల మాఫీకి వెంటనే చర్యలు చేపడతామని, ఇన్‌పుట్ సబ్సిడీని కౌలు రైతులకు అందేలా కృషిచేస్తామని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాగు ధ్రువ పత్రాల ద్వారా కౌల్దార్లకు రుణాల మంజూరు, పంటల బీమా అమలుకు కమిషనర్ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.సురేష్, కె.అజయ్‌కుమార్, పి.హనుమంతం, ఆర్.వినోద్, డి.సోమన్న, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

వెలుగొండకు రూ.1500 కోట్లు కేటాయించాలి

- వామపక్షాల రాస్తారోకో
- పలువురు అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-మార్కాపురం, కనిగిరి (ప్రకాశం)

వెలుగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.334 కోట్లు కేటాయించడం సరికాదని, సవరణ బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో చేపట్టిన రాస్తారోకోలు పోలీసుల తీరుతో ఉద్రిక్తతకు దారితీశాయి. మార్కాపురం, కనిగిరి కేంద్రాల్లో వామపక్ష నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడిచిపెట్టారు. వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు పెంచాలని కోరుతూ మార్కాపురంలోని కోర్టు సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు రంగప్రవేశం చేసి రాస్తారోకో విరమించాలని సిఐ ఎం.భీమానాయక్ హెచ్చరించారు. నేతలు పట్టువీడలేదు. దీంతో సిఐ భీమానాయక్, ఎఎస్ఐ వైసిహెచ్.అల్లూరిరెడ్డి, పోలీసు సిబ్బంది వామపక్ష నేతలపై విరుచుకుపడ్డారు. అరెస్టులు చేశారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి డి.సోమయ్య, జిల్లా నాయకులు గాలి వెంకటరామిరెడ్డిలతోపాటు 20 మందిని అరెస్టు చేశారు. కనిగిరిలో సుందరయ్య భవనం నుంచి పామూరు బస్టాండ్ చర్చికూడలి సెంటర్‌వరకు నిరసన ర్యాలీ నిర్వహించటం జరిగింది. పామూరు బస్టాండ్‌లో రాస్తారోకో చేపట్టారు. సిపిఎం పశ్చిమ ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కమిటీ సభ్యులు పీసీ కేశవరావు, పిల్లి తిప్పారెడ్డి, సిపిఎం పట్టణ నాయకులు ఎస్‌కె నాగూర్‌బిలను పోలీస్‌లు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ నాయకులను అరెస్ట్ చేయటంతో సిపిఎం కార్యకర్తలు, ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరకుని ఎర్రజెండాలతో నిరసన తెలియజేశారు. పెద్దదోర్నాల, పొదిలి, పెద్దారవీడులలోనూ ధర్నాలు చేపట్టారు.



ప్రకాశం జిల్లా మార్కాపురంలో సోమయ్యను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎస్ఎస్ఎ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ దీక్షలు

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ అండ్ పార్ట్ టైమ్ కార్మికులు సోమవారం విజయవాడలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జెఎసి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఈ దీక్షలు చేపట్టారు. దీక్షలను ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ అండ్ పార్ట్ టైమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి గౌరవాధ్యక్షుడు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, మహిళలకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి రెగ్యులర్ చేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షాబ్జి ఈ దీక్షను ప్రారంబించి మద్దతు తెలిపారు. ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు, జెఎసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ సిహెచ్.జోషఫ్ సుధీర్, ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి హృదయరాజు, రాష్ట్ర కార్యదర్శి బి.కాంతారావు, ఉపాధ్యక్షులు కె.విజయ తదితరులు పాల్గొన్నారు. 13న జరిగే 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పుల్లారావు, తదితరులు

దేశ నాగరికత మహోన్నతం

కేరళ తరహాలో అన్ని గ్రామాల చరిత్రనూ నమోదు చేయాలి

ఎఎన్‌యులో అంతర్జాతీయ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-ఎఎన్‌యు (గుంటూరు)

భారతదేశ వారసత్వ సంపద, సంస్కృతి, సంప్రదాయాలు మహోన్నతమైనవని వక్తలు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఎఎన్‌యు)లో రాష్ట్ర ప్రభుత్వ ఆర్కియాలజీ-మ్యూజియమ్స్ కమిషనరేట్, పూణే డెక్కన్ కాలేజీ (డీమ్డ్ యూనివర్సిటీ) సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. 'పురావస్తు సంరక్షణ, దక్షిణాసియాలోని బృహత్ శిలాయుగ సంస్కృతుల అధ్యయనం' సదస్సులో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడారు. 200 ఏళ్ల కిందటే పురావస్తు శాఖ ప్రారంభమైందని, ఎన్నో సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ కట్టడాలను భవిష్యత్ తరాలకు అందించారని చెప్పారు. కొండవీడుకోటకు రూ.60 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామన్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన అనంతరం పురావస్తు శాఖ అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చిందని, పురావస్తు సంపదను తేలేకపోయామని, తక్కువ నిధులు, వేతనాలతో పురావస్తు శాఖ పని చేస్తోందని చెప్పారు. తెలుగు జాతి చరిత్ర సింధూ నాగరికతకు తక్కువేం కాదన్నారు. కేరళ ప్రభుత్వం మాదిరి చరిత్రకు ప్రత్యేక మండలిని ఏర్పాటు చేసి అన్ని గ్రామాల చారిత్రక అంశాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేటి చరిత్రకారులు పత్రికల్లో స్థానిక భాషల్లో వ్యాసాలను రాయడం ద్వారా చరిత్రను విస్తృతం చేయాలని సూచించారు. అనంతరం విశ్రాంత ఐఎఎస్ గోపాలకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ ఇంటర్నేషనల్ హెరిటేజ్ అడ్వైజర్ ప్రొఫెసర్ అమరేశ్వర్ గల్లా, ప్రొఫెసర్ కె.తిమ్మారెడ్డి, డెక్కన్ డీమ్స్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ వసంత్ షిండే మాట్లాడారు.

అతిసార ప్రబలిన ప్రాంతాల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

గుంటూరులో అతిసార ప్రబలిన ప్రాంతాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య విమర్శించారు. సోమవారం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్‌తో కలిసి అతిసార ప్రభావిత ప్రాంతాలైన ఆనందపేట, ఇతర ప్రాంతాలలో పర్యటించారు. అక్కడ చేపట్టిన పైపులైను పనులను పరిశీలించిన అనంతరం బాధితులను పరామర్శించారు. ఆనందపేటలో మృతులు, బాధితుల నివాస ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీటి సరఫరా అంశాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆనందపేట మున్సిపల్ వర్కర్స్ కాలనీలో అతిసార బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. అతిసార ప్రబలిన ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని తక్షణమే మెరుగు పరిచి ప్రజలకు శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అతిసారతో 12 మంది మరణించడంతోపాటు వందలాది మంది ఆసుపత్రుల పాలైనా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరినే ప్రదర్శిస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుంటూరులో సుమారు రూ.900 కోట్లతో చేపట్టిన భూగర్భ మురుగునీటి ప్రాజెక్ట్ (యుజిడి)పై విచారణ కమిటీ వేయాలన్నారు.



గుంటూరు ఆనందపేట రెండో లైన్‌లోని వర్కర్స్ కాలనీలో పరిస్థితిని సిపిఎం నాయకులకు వివరిస్తున్న స్థానికులు

బిజెపి, టిడిపి నాటకాలు

మాజీమంత్రి జెడి శీలం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విభజన చట్టంలోని హామీల అమలుపై టిడిపి, బిజెపి నాయకుల నాటకాలతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం అన్నారు. గుంటూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విభజన చట్టం ఆమోదం సందర్భంగా ప్రత్యేక హోదా అంశమూ చర్చకొచ్చిందని, అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ స్పష్టంగా హామీ ఇచ్చారని చెప్పారు. గతంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఉత్తరాఖండ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చారని గుర్తుచేశారు. విభజన చట్టంలో ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీలు ఉన్నాయన్నారు. బుందేల్‌ఖండ్ తరహాలో రాష్ట్రంలోని ఏడు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

ముదిరాజ్‌ల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు తక్షణమే విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని స్థానిక ధర్నా చౌక్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడాబాబులకు భారీగా రాయితీలు కల్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని పక్కన పెట్టడం దుర్మార్గమన్నారు. ముదిరాజ్‌లకు సిపిఎం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి శాంతిశ్రీ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని న్యాయ పోరాటాలు చేస్తున్న ప్రజలను పోలీసులతో అణచివేయాలని చూస్తున్న టిడిపి కుట్రను తిప్పి కొట్టాలన్నారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.కృష్ణమోహన్ మాట్లాడుతూ.. బిసి-డిలో ఉన్న తమను బిసి-ఎలో చేర్చాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో టిడిపి విఫలమైందన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నగర కార్యదర్శి ఎస్‌కె ఖాజావలి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంబి నాధన్, వైసిపి నాయకులు మల్లాది విష్ణు, జోగి రమేష్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు కె.లక్ష్మిపతి, పులి శ్రీనివాసరావు, వెంకటరాజు, చుక్కా నాని, ఎవి చలం, కె రమణి, ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయానికి సోషల్ మీడియా పదును

మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజాభిప్రాయాన్ని వినిపించేందుకు సోషల్ మీడియా పదునైన సాధనమని, సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఎపి ఎన్‌జిఒ భవన్‌లో సోషల్ మీడియా ఫర్ సొసైటీ (ఎస్ఎంఎస్) రాష్ట్ర సభల ఆహ్వాన సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఎపి హక్కుల కోసం ఉద్యమం-సోషల్ మీడియా పాత్ర' అంశంపై నిర్వహించిన సదస్సులో లక్ష్మణరావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుకావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా అమలులో ఉన్న 11 రాష్ట్రాలకు అవసరం లేని చట్టం ఎపికి ఎందుకని ప్రశ్నించారు. చట్టంలో ఉన్న రైల్వేజోన్ ఎందుకు ఇవ్వడం లేదని కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప ఉక్కు, దుగరాజపట్నం పోర్ట్, పోలవరం నిధులు సహా అన్ని విషయాల్లోనూ అన్యాయం చేస్తోందన్నారు. ఎస్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారసాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సోషల్ మీడియా వాలంటీర్లను ఏకం చేయడానికే ఎస్ఎంఎస్ ఏర్పడిందని, రెండో వార్షికోత్సవం జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎంఎస్ రెండో వార్షికోత్సవ లోగోను జెఎసి చైర్మన్ బూరిగ ఆశీర్వాదం ఆవిష్కరించారు. ఎపి హక్కులకు ఉద్యమించాలని జెఎసి నిర్ణయించిందని ఆశీర్వాదం చెప్పారు.



ఎస్ఎంఎస్ రెండో వార్షికోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిహారం అందేవరకూ పోరాటం

ప్రజాశక్తి-చింతలపూడి

చింతలపూడి ఎత్తి పోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందే వరకూ పోరాటం సాగించాలని, ఆ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని అండదండగా ఉంటామని అఖిలపక్ష పార్టీలు, రైతు, ప్రజాసంఘాల నాయ కులు స్పష్టం చేశారు. రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని కోరుతూ పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడిలోని మార్కెట్ యార్డులో సోమవారం సాయంత్రం రైతుసదస్సు నిర్వహించారు. వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చింతలపూడి రైతుల అసలైన పోరాటం ఈ రోజు మొదలైందన్నారు. రాజధాని అమరావతిని తాకేలా రైతులు పోరు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.నరసింహారావు మాట్లాడుతూ.. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో రైతులకు పరిహారం అందజేతలో ప్రభుత్వం వివక్ష పూరితంగా వ్యవహరి స్తోందన్నారు. మాజీ ఎంఎల్ఎ, వైసిపి నేత ఘంటా మురళి, ఆలిండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ.. పట్టిసీమకు భూసేకరణలో ఎకరాకు రూ.52 లక్షలు వరకూ ఇచ్చి చింతలపూడి రైతులకు రూ.12.50 లక్షలు ఇవ్వడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చింతలపూడి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నేత ఎం.థామస్, బిజెపి నేతలు బివి.నాగచంద్రరెడ్డి, అంజిబాబు, సిపిఎం అప్‌లేండ్ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, జనసేన పార్టీ నేత హరికృష్ణ, భూనిర్వాసితుల పోరాట సమితి అధ్యక్షులు ఖాదర్‌బాబు పాల్గొన్నారు.



విశాఖలో జూనియర్ డాక్టర్ల బైక్ ర్యాలీ

ఐదో రోజుకు జూడాల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా విశాఖలోని సరస్వతీ పార్కు నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కెజిహెచ్ వద్ద ఏర్పాటుచేసిన శిబిరం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల విశాఖ జిల్లా అధ్యక్షులు కోదండరాం మాట్లాడుతూ, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ముందుగా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంరతం ర్యాలీగా ఆస్పత్రికి వెళ్లి విధుల్లో చేరారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో నేలపైనే కూర్చొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జూనియర్ డాక్టర్ స్పందన మాట్లాడుతూ.. జిఒ ప్రకారం వేతనాలపై 15 శాతం హెచ్చుదలపై ఒక నిర్దేశిత తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2016కి గానూ పెంచాల్సిన హౌస్ సర్జన్, పిజి స్టైఫండ్‌కు సంబంధించిన జిఒను తక్షణమే విడుదల చేయాలని కోరారు. తమ డిమాండ్లు పరిశీలనలోకి తీసుకుని తమకు న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు.

ఆందోళనలు.. జాతాలు, యాత్రలు

కొనసాగుతున్న ప్రత్యేక హోదా ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, కేంద్రం మెడలు వంచి ఆంధ్రప్రదేశ్‌కు హోదా సాధించాలని కోరుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆందోళనలు, జీపుజాతాలు, ఆటోజాతా, బస్సుయాత్ర నిర్వహించారు. సిపిఎం ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా గణపవరం పోలీస్ ఐలాండ్ వద్ద కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం మోసపూరిత విధానాలను వీడాలని, ఎపికి ప్రత్యేక హోదా కల్పించాలని పెద్దపెట్టున నినదించారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలుగు యువత ఆధ్వర్యాన భీమవరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రత్యేకప్యాకేజీ, కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులివ్వాలని డిమాండ్ చేస్తూ కర్నూలు జిల్లాలో రెండు జీపుజాతాలు కొనసాగుతున్నాయి. తూర్పు ప్రాంతంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ ఓబులు, తూర్పుప్రాంత జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్ పాల్గొన్నారు. పశ్చిమ ప్రాంతంలోని కోడుమూరు, గోనెగండ్ల, వెల్దుర్తి మండలాల్లో పశ్చిమ ప్రాంత కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతపురం జిల్లాలో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన బస్సు యాత్ర కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని మండలాల్లో కొనసాగింది. అనంతపురంలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన ఆటోజాతాను మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ప్రారంభించారు.

మట్టి పాదాల మహా విజయం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రెవిన్యూ మంత్రి చంద్రకాంత్ పాటిల్ సోమవారం ప్రకటించారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సమక్షంలో ఆజాద్ మైదాన్‌లో చేరిన వేలాది మంది రైతుల నుద్దేశించి ఆయన ఈ ప్రకటన చేశారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు. వాస్తవానికి ఇదే డిమాండ్లను మహారాష్ట్ర రైతాంగం కొన్ని సంవత్సరాలుగా చేస్తోంది. వీటి కోసం ఎన్నో ఆందోళనలు చేసింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో అఖిలభారత కిసాన్ సభ పిలుపుమేరకు రైతులు లాంగ్‌మార్చ్ చేపట్టారు. ముంబాయికి దాదాపు 200 కిలోమీటర్ల దూరంలోని నాసిక్ నుండి ప్రారంభమైన ఈ పాదయాత్రలో రైతులు ఎర్రజెండాలతో కదం తొక్కారు. 35 వేల మందితో ప్రారంభమైన ఈ పాదయాత్రలో ముంబాయికి చేరుకునేటప్పటికి 50 వేల మందికి పైగా రైతులు భాగస్వాములయ్యారు. సోమవారం జరిగిన అసెంబ్లీ ముట్టడికి ఈసంఖ్య ఇంకా పెరిగింది. ఎర్రసముద్రంలా రైతాంగం ముంబాయి వీధులకు తరలిరావడంతో రాష్ట్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. రైతుల యాత్ర ముంబాయికి చేరుతున్న నేపథ్యంలో కాంగ్రెస్, శివసేనలు ఈ ఆందోళనకు మద్దతు పలికాయి. ఆరు రోజుల సుదీర్ఘ పాదయాత్ర విజయవంతంగా ముగియటంతో రైతులు తమ స్వస్థలాలకు ప్రయాణమవుతున్నారు. వారిని తిరిగి నాసిక్‌కు చేరుస్తామని అధికారులుప్రకటించారు. ఇందుకోసం ముంబయి నుండి భుసావల్ వరకూ ప్రత్యేక రైలును నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

'ఎర్ర' సంద్రమైన ముంబయి

అంతకుముందు ఆరు రోజులుగా నాసిక్ నుండి బయల్దేరి మండుటెండల్లో నడుచుకుంటూ దాదాపు 180 కి.మీ మేర పాదయాత్ర చేసి ముంబయి నగరానికి చేరిన రైతన్నల ఎర్ర పతాకాలతో సోమవారం నగరంలోని ఆజాద్ మైదాన్ ఎర్ర సముద్రాన్ని తలపించింది. బేషరతుగా వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, ఏళ్ల తరబడి అటవీభూములను సాగు చేసుకుంటున్న ఆదివాసీలకు వాటిపై యాజమాన్య హక్కులను బదిలీ చేయాలని, స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను యధాతథంగా అమలు చేయాలన్న డిమాండ్లతో అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కోసం 'లాంగ్ మార్చ్' పేరుతో రైతులు ఈ పాదయాత్రను నిర్వహించారు.





అసెంబ్లీ ముట్టడిలో పాల్గొన్న రైతులలో ఒక భాగం (ఇన్‌సెట్‌లో అభివాదం చేస్తున్న నేతలు)

వసతి ఏర్పాట్లు

ఆదివారం రాత్రి నగర శివార్లలోని ములుంద్ ప్రాంతానికి చేరుకున్న రైతులకు అక్కడ ఖాళీగా వున్న ఆక్ట్రాయ్ ప్లాజాలో వసతిని ఏర్పాటు చేసినట్లు నగర ఏడవ మండల డిసిపి అఖిలేష్ సింగ్ చెప్పారు. రైతులు తమ ఆహార ఏర్పాట్లను వారే చేసుకున్నారని, వివిధ స్వచ్ఛంద సంస్థల సాయంతో తాము వారికి తాగునీరు, వైద్య సౌకర్యాలను కల్పించామని ఆయన వివరించారు. వీటితో పాటు వారికి అవసరమైన సహాయం అందించేందుకు ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద తగినంత మంది సిబ్బందిని కూడా నియమించినట్లు ఆయన చెప్పారు.

ఆదివారం రాత్రి నగర శివార్లలోని కెజె సోమయ్య గ్రౌండ్స్‌లో మకాం చేసిన రైతన్నలు సోమవారం ఉదయం నుండి ఆజాద్ మైదాన్‌కు రావటం ప్రారంభించారు. దాదాపు 50 వేల మందికి పైగా రైతులు ఈ నిరసన కార్యక్రమంలోపాల్గొంటున్నారని కిసాన్‌సభ మహారాష్ట్ర కమిటీ నేత అశోక్ ధావలే చెప్పారు. పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. థానే జిల్లాకు చెందిన గిరిజన రైతులు కూడా ఈ ప్రదర్శనలో జతకలిసారు.

ప్రతిపక్ష-భాగస్వామ్య పక్షాల మద్దతు

. కాంగ్రెస్, ఎన్‌సిపి, నవనిర్మాణ్ సేన, ఎంఐఎం వంటి ప్రతిపక్షాలతోపాటు అధికార బిజెపి కూటమి భాగస్వామి అయిన శివసేన కూడా రైతుల డిమాండ్లకు మద్దతు ప్రకటించాయి. ఆజాద్ మైదాన్‌కు చేరుకున్న రైతులందరినీ అసెంబ్లీ భవన సముదాయం వద్దకు అనుమతించే అవకాశం లేకపోవటంతో రైతు నేతలతో కూడిన ప్రతినిధి వర్గాన్ని ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవిస్‌తో భేటీ అయ్యేందుకు అనుమతించనున్నట్లు అధికారులు చెప్పారు.

8 మంది సభ్యుల ప్రతినిధివర్గానికి అనుమతి

రైతులతో భేటీ అయ్యేందుకు ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘంతో ఎనిమిది మంది సభ్యులతో కూడిన రైతు ప్రతినిధి వర్గం సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో భేటీ అయింది.

సానుకూలంగానే ఉన్నాం : ఫడ్నవిస్

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పనిచేస్తోందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ చెప్పారు. రైతుల ఆందోళనపై ప్రతిపక్ష నేత రాధాకృష్ణ విఖే పాటిల్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ దాదాపు ఆరురోజుల పాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా శాంతియుతంగా ప్రదర్శన చేసిన రైతులను అభినందించారు. ఇటీవల శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి సుధీర్ ముంగంటివార్ కూడా తమ బడ్జెట్ రైతు మిత్ర' బడ్జెట్ అని ప్రకటించిన విషయం తెలిసిందే. వ్యవసాయం, ఫుడ్ ప్రోసెసింగ్ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. అయితే రైతు నేతలు మాత్రం ఈ వాదనను తోసిపుచ్చుతూ ప్రభుత్వ పథకాలేవీ తామాశించిన రీతిలో సాంత్వన కలిగించటం లేదని చెబుతున్నారు.



మంచినీరు అందిస్తున్న మహిళలు



పండ్లు సిద్ధం చేసిన స్థానిక ముస్లింలు

ముంబయి ప్రజల సహకారం

నాసిక్ నుండి బయల్దేరి 180 కి.మీ ప్రయాణించి వచ్చిన కిసాన్ ర్యాలీకి ముంబయి వాసులు సాదరంగా స్వాగతం పలికి రైతులకు తమ మద్దతును ప్రకటించారు. దాదాపు 100 మంది నగర పౌరులు ఈ ర్యాలీలో పాల్గొని రైతులకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. నగర శివార్లలోని ములుంద్ ప్రాంతంలో రైతులకు మహారాష్ట్ర మంత్రి గిరిష్ మహాజన్ స్వాగతం పలికారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ విధంగా రోడ్డెక్కటం సిగ్గుచేటయిన విషయం అని నగరానికి చెందిన స్నేహల్ అంధోరికర్ అనే గృహిణి వ్యాఖ్యానించారు. 'జైజవాన్-జైకిసాన్' అంటూ మనం మన రైతులను, సైనికులను గౌరవిస్తుంటామని గుర్తు చేస్తూ ఆమె జవాన్ల కోసం సగర్వంగా అనేక సౌకర్యాలను ప్రకటిస్తున్న ప్రభుత్వం రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోదని ప్రశ్నించారు. తామెదుర్కొంటున్న సమస్యలు వాస్తవమైనవి కాకుంటే వారు మండుటెండలో కాళ్లకు చెప్పులు కూడా లేకుండా ఇంత దూరం నడిచి రారు కదా అంటూ మరో యువ ఇంజనీర్ రుచితా మిత్రా ప్రశ్నించారు. రైతులు సంతోషంగా లేని ఏ దేశమూ అభివృద్ధి కాలేదని ఆమె స్పష్టం చేశారు.

డబ్బావాలాల సంఘీభావం

పాదయాత్రతో నగరానికి చేరుకున్న రైతులకు నగరంలోని డబ్బావాలాలు సంఘీభావం ప్రకటించారు. ఆదివారం రాత్రి సోమయ్య గ్రౌండ్స్‌కు చేరుకున్న రైతులందరికీ అవసరమైన ఆహార పదార్థాలను సమకూర్చేందుకు తాము చర్యలు చేపట్టినట్లు డబ్బావాలాల సంఘం ప్రతినిధి సుభాష్ తాలేకర్ చెప్పారు. మారుమూల ప్రాంతాలనుండి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు నగరానికి చేరుకున్న అన్నదాతలకు సహాయపడటం తమ కనీస బాధ్యత అని ఆయన అన్నారు. నగరంలోని దాదర్, కొలాబా తదితర ప్రాంతాలలో పనిచేస్తున్న తమ కార్యకర్తలను ఆహార పదార్థాలను సేకరించి వాటిని ఆజాద్ మైదాన్‌లోని రైతులకు అందచేయాలని సూచించినట్లు చెప్పారు. నగరంలోని ఉద్యోగులకు సకాలంలో ఆహారాన్ని అందచేయటంలో ప్రసిద్ధి చెందిన డబ్బావాలాలు తాము నిర్వహిస్తున్న 'రోటీ బ్యాంక్' నుండి కూడా రైతులకు ఆహారాన్ని అందచేశారు.

డిమాండ్లను అంగీకరించకపోతే
రైతులు ప్రభుత్వాలను కూలుస్తారు

ఏచూరి హెచ్చరిక



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

తమ న్యాయమైన డిమాండ్లను అంగీకరించకపోతే రైతులు కేంద్రంలోనూ, మహారాష్ట్రలోనూ ఉన్న బిజెపి ప్రభుత్వాలను కూలుస్తారని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హెచ్చరించారు. మహారాష్ట్ర రైతులు ఆరురోజులు 'లాంగ్‌మార్చ్' జరిపి ముంబాయి చేరిన తర్వాత రైతుల నుద్దేశించి ఆయన ప్రసంగించారు. సైనికులు సరిహద్దులను పరిరక్షిస్తున్నారని, రైతులు నూతన సైనికులని, వారు ఆహారాన్ని ఉత్పత్తిచేసి ప్రజలను బతికిస్తున్నారని ఆయన చెప్పారు. రైతులను నిర్లక్ష్యం చేసే ఏ పార్టీ బతికి బట్టకట్టలేదని చెప్పారు.దేశంలోనే మొదటిసారిగా గత సంవత్సరం మహారాష్ట్ర రైతులు సమ్మె చేశారని, ఫలితంగా ప్రభుత్వం వ్యవసాయ రుణాలను రద్దుచేస్తామని ప్రకటించాల్సి వచ్చింది. గత పదినెలల కాలంలో అది అమలు కాలేదని ఆయన చెప్పారు. 88 సంవత్సరాల క్రితం ఇదేరోజున మహాత్మాగాంధి దండియాత్రను ప్రారంభించి, బ్రిటిష్ ప్రభుత్వ పునాదులను కదిలించారని, ఆ ఉద్యమంతో రైతుల లాంగ్‌మార్చ్‌కు పోలిక ఉందని చెప్పారు. ఈరోజు రైతుల డిమాండ్లను అంగీకరించకపోతే వారు కేంద్రం, రాష్ట్రాలలోని ప్రభుత్వాలను మార్చి, తమకు అనుకూలంగా ఉండే ప్రభుత్వాలను అధికారంలోకి తీసుకొస్తారని ఆయన హెచ్చరించారు. పారిశ్రామికవేత్తలు, బడా వ్యాపారుల వేలకోట్ల రూపాయల రుణాలను రద్దుచేస్తున్నారని, లలిత్‌మోడి, విజయ్‌మాల్యా లాంటివారు బ్యాంకులను మోసం చేసి, విదేశాలకు పోయారని చెప్పారు. రైతులందరి రుణాలను రద్దుచేయటానికి ప్రభుత్వాని లక్షకోట్ల రూపాయలు సరిపోతాయని ఆయన చెప్పారు. ఆ మొత్తం లేవని ప్రభుత్వాలు చెబుతున్నాయని, కాని బడా కార్పొరేట్ సంస్థలు ఎగ్గొట్టిన రుణాలను రద్దు చేస్తున్నాయని ఆయన విమర్శించారు.



స్వస్థలాలకు తిరుగుప్రయాణమైన రైతులు



గాయపడిన మహిళ పాదానికి చికిత్స చేస్తున్న దృశ్యం

నెత్తుటి బొట్ల విజయం

అవుట్‌లుక్ కథనం

స్వేదాన్ని చిందించి. నెత్తురు ధారపోసి మహారాష్ట్ర రైతులు విజయాన్ని సాధించినట్టుగా అవుట్‌లుక్ పత్రిక పేర్కొంది. సుదీర్ఘ పాదయాత్ర, అసెంబ్లీ ముట్టడి అనంతరం మహారాష్ట్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లకు అంగీకరించడంతో ఆ పత్రిక ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అన్నా హజారే నాయకత్వంలో అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం తరువాత ఆ స్థాయిలో దేశ వ్యాప్తంగా ప్రజానీకాన్ని ఆకర్షించిన పోరాటంగా మహారాష్ట్ర రైతాంగ లాంగ్‌మార్చ్‌ని ఆ పత్రిక అభివర్ణించింది. అవుట్‌లుక్ కథనం క్లుప్తంగా

'మార్చి 6వ తేది ... ఆ రోజే నాసిక్ నుండి రైతుల లాంగ్‌మార్చ్ ప్రారంభమైంది. స్వామినాధన్ సిఫార్సులు అమలు, సంపూర్ణ రుణమాఫీ తదితర డిమాండ్లతో 35 వేల మంది రైతులు తమ సుదీర్ఘపాదయాత్రను ఆ రోజు ప్రారంభించారు. ఇది మీడియాకు, పత్రికలకు పెద్ద వార్తగా కనిపించలేదు. చాలా పత్రికలు లోపలి పేజీల్లో సింగిల్ కాలమ్ వార్తలకు పరిమితం చేశాయి. 'ముంబాయికి ప్రారంభమైన రైతుల మార్చ్' అనే సాదా శీర్షికలు కనిపించాయి. దాదాపు అన్ని మీడియా సంస్థలు దీనిని మరో సాధారణ ఆందోళనగా పరిగణించాయి. అయితే, పాదయాత్ర జరిగే క్రమంలో వెల్లువల్లా వస్తున్న ఫోటోలతో ఈ నిర్లక్ష్యభావాన్ని వదులుకోక తప్పని స్థితి ఏర్పడింది.

కొండ, కోనల నడుమ, ఎర్రటి జలపాతంలా రైతులు ఉరుకులు, పరుగులతోకదిలివస్తున్న విహంగవీక్షణం వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సన్నటి రోడ్లమీద , చేతుల్లో వేలాది ఎర్రజెండాలతో నాసిక్ నుండి ముంబాయికి ఎర్రసముద్రం తరలివస్తోందా అన్నట్లుగా ఆ వీడియో ఉంది. సుదీర్ఘ నడకకు ఏమాత్రం సహకరించని వారు వేసుకున్న సాదా చెప్పులు తెగిపోతున్నాయి. రక్షణ లేకపోవడంతో వారి పాదాలు నెత్తుటి ముద్దలుగా మారుతున్నాయి. అయినా, వారు ఆడుతూ, పాడుతూ ముందుకే అడుగువేస్తున్నారు. వారి లక్ష్యం ముంబాయి... ముంబాయిలోని అసెంబ్లీ భవనం! ఈ నడక సాగుతుండగానే వారిలోనే ఒక బృందం వారి నుండి ముందుకు వేగంగా వెళ్లి ఆపూటకు అవసరమైన భోజన ఏర్పాట్లు చూసేది. వేలాదిమంది రైతులకు వీలుగా ఉండాలా ఒక విశాలమైన ఖాళీ స్థలాన్ని ఎంపిక చేసి, అక్కడ వంట వండేది. వంటకు అవసరమయ్యే దినుసులు రైతులు స్వయంగా తెచ్చుకున్నవే కావడం విశేషం. పాదయాత్ర బృందం వచ్చేలోగా వీరు వంట ఏర్పాట్లు పూర్తిచేసేవారు. అక్కడ భారీ టెంట్లు కనిపించవు. మండే సూర్యుని కిందే రైతులు కిచిడిని తినేవారు. ఆ సమయంలోనే కళాకారుల బృందం సాంప్రదాయ గీతాలను, ఉద్యమ గీతాలను ఆలాపించేది. వీటికి రైతులు డాన్స్ చేసేవారు. ఈ కొద్దిపాటి విశ్రాంతి, సాంస్కృతిక కార్యక్రమాలతో వారు తమ దీర్ఘయాత్రను కొనసాగించడానికి అవసరమైన శక్తిని మళ్లీ పొందేవారు. నడకను ప్రారంభించేవారు. 'నృత్యం చేస్తున్న ప్రజాస్వామ్యం, కదిలివస్తున్న ప్రజాస్వామ్యం' గా కొందరు దీనిని అభివర్ణించారు.

నాసిక్‌లో ప్రారంభమై, ఆరురోజుల పాటు 180 కిలోమీటర్ల దూరం నడిచిన తరువాత మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన రైతాంగం ముంబాయి మహానగరంలోకి సోమవారం వెల్లువలా ప్రవేశించింది. ప్రఖ్యాతి గాంచిన జెజె ఫ్లైఓవర్ పై వారు సాగించిన మార్చ్‌ను చూసిన వారికి ఏదైనా పదాతిదళం భారత ఆర్థిక రాజధానిని ముట్టడించడానికి వచ్చిందా అన్నట్లు కనిపించింది. ఆ భారీ రైతాంగ సమూహాన్ని చూసిన ప్రజానీకం ముంబాయి స్థంబించి పోవడం ఖాయమన్న అభిప్రాయానికి వచ్చారు. దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. కానీ, ఆశ్చర్యం. అటువంటి సమస్యే తలెత్తలేదు. ఈ మహా పాదయాత్రను నిర్వహించిన అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు ' పరీక్షలకు హాజరవుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఎటువంటి కష్టాన్ని మేం కలిగించదలచుకోలేదు. కానీ మేం, ఆజాదీ మైదాన్ (అసెంబ్లీ సమీపానికి)కు చేరుకోవాల్సిఉంది. అందువల్ల మేం అర్ధరాత్రి నుండి నడక ప్రారంభిస్తాం' అని ప్రకటించారు. ప్రకటించడమే కాదు. దానినే ఆచరించి చూపారు. అప్పటికే పూర్తిగా అలసిపోయిఉన్నప్పటికీ, రాత్రి పూట ఏ మాత్రం విశ్రాంతి తీసుకోకుండా రైతులు రాత్రి భోజనం చేసిన వెంటనే నడక ప్రారంభించారు. తెల్లవారే సమయానికి గమ్యం చేరుకున్నారు.

ఈ లాంగ్ మార్చ్ నిర్వాహకుల్లో ఒకరైన ఎఐకెఎస్ జాయింట్ సెక్రటరీ విజూ కృష్ణన్ రైతులను సమీకరించడానికి, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడానికి తమకు రెండు నెలల సమయం పట్టినట్లు చెప్పారు. 'మేం గతంలో కూడా రైతాంగ ఉద్యమాలు చేశాం. అయితే, తాజా లాంగ్‌మార్చ్ ప్రజల హృదయాలను తాకింది. సోషల్ మీడియాలో భారీ ప్రోత్సాహం లభించింది. ప్రధాన మీడియా కూడా దృష్టి సారించాల్సివచ్చింది' అని ఆయన అన్నారు. 'అన్నా హజారే ఉద్యమం తరువాత ఆ స్థాయిలో కార్మికులు దేశ రాజధానిలో రోజుల తరబడి ఆందోళనలు చేసినా జాతీయమీడియా విస్మరించింది, కానీ, మా పోరాటాన్ని ప్రచురించక తప్పనిస్థితి ఏర్పడింది' అని విజూ కృష్ణన్ చెప్పారు. భారత్‌లోని వామపక్ష రాజకీయాలకు. పార్టీలకు రైతాంగ పోరాటం కొత్త జీవితాన్ని ఇచ్చిందన్న అభిప్రాయాన్ని రాజకీయ వ్యాఖ్యాతలు వ్యక్తం చేస్తున్నారు.

జీతం అడిగినందుకు
మహిళా సిబ్బంది నిర్బంధం

దాడిలో పలువురు మహిళలకు గాయాలు

ఉత్తరప్రదేశ్ సిఎం కార్యాలయంలో దుర్మార్గం



న్యూఢిల్లీ : నాలుగు నెలలుగా బకాయిపడిన వేతనాలు చెల్లించాలని కోరినందుకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్‌కు సంబంధించిన 1076 హెల్ప్‌లైన్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని ఆ ప్రాజెక్ట్ మేనేజర్ గదిలో బంధించారు. వారిపై దాడి చేశారు. ఈ దాడిలో పలువురు మహిళలకు గాయాలవగా వారిని చికిత్స కోసం రామ్‌మనోహర్‌లోహియా ఆస్పత్రికి తరలించారు. తమకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, దీంతో శుక్రవారం నిరసన వ్యక్తం చేయడంతో సైబర్ టవర్ ఆఫీస్ గదిలో ప్రాజెక్టు మేనేజర్ బంధించారని వెల్లడించారు. అనంతరం విధులకు హాజరైనా వారి హాజరు నమోదు చేయడం లేదు. దీంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. కొద్దిమంది తమను బంధించారని, అక్కడే కొంతమంది ఏదో తాగారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హుటాహుటీన పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకోగానే మహిళలు కొందరు వాంతులు చేసుకుంటుండటంతో వారిని ఆర్ఎంఎల్ ఆసుపత్రికి తరలించారు. విచారణ నిమిత్తం సిసిటివి ఫుటేజీలను కూడా పరిశీలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే మహిళా సిబ్బంది జీతాలను ఫిబ్రవరి 18న వారి ఖాతాలలో జమచేశామని, ఈ ప్రాజెక్టులో 1200 మంది సిబ్బంది మూడు షిఫ్టులలో పనిచేస్తున్నారని, బ్యాంకు సమస్యల కారణంగా కొంతమంది మాత్రమే సమస్యను ఎదుర్కొంటున్నారని కాల్ సెంటర్ మేనేజర్ తెలిపారు.

1,765 మంది శాసనకర్తలపై
క్రిమినల్ కేసులు

సుప్రీంకు తెలిపిన కేంద్రం

- తొలి స్థానంలో ఉత్తర ప్రదేశ్
- కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు

క్రిమినల్ లెక్కలు

1,765 క్రిమినల్ కేసులున్న ఎంపిలు, ఎంఎల్‌ఎలు	**3,405** ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నవి	**178** శాసనసభ్యులపై కేసులతో తమిళనాడు రెండవస్థానంలో ఉన్నది
3,816 వారిపైన ఉన్న కేసులు	**248** ఉత్తరప్రదేశ్ శాసనసభ్యులపై అత్యధికంగా కేసులు ఉన్నాయి	**144** కేసులతో బీహార్ మూడవ స్థానంలో ఉన్నది

న్యూఢిల్లీ : దేశ్యాప్తంగా దాదాపు 1,765 మంది శాసన కర్తలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం సోమవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. పార్లమెంట్, వివిధ రాష్ట్రాల శాసనసభ సభ్యులపై మొత్తం 3,816 కేసులు ఉన్నాయని, వీటిల్లో 3,045 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. అత్యధికంగా క్రిమినల్ కేసులు నమోదైన శాసన సభ్యులు ఉన్న రాష్ట్రాల జాబితాలో ఉత్తరప్రదేశ్ తొలి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 248 మంది శాసన సభ్యులపై క్రిమినల్ కేసులున్నాయి. కాగా 178 మంది క్రిమినల్ కేసులున్న శాసనసభ్యులతో తమిళనాడు రెండోస్థానంలో వుండగా, 144 మంది శాసనసభ్యులతో.బీహార్ మూడో స్థానంలో నిలిచింది. నేర చరిత్ర ఉన్న శాసనకర్తలపై విచారణ జరిపేందుకు ఏడాది లోగా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం నవంబరు 2017న కేంద్రాన్ని ఆదేశించింది.

దీనిపై కేంద్రం ప్రభుత్వం తొలిసారిగా సోమవారం స్పందిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది. సుప్రీం ఆదేశాల మేరకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకున్నామని, . దాదాపు 11 రాష్ట్రాలలో 12 కోర్టులు ఏర్పాటు చేసేందుకు రూ.78 కోట్లు కేటాయించినట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. అందులో 2017లో రూ. 65.04 లక్షలు విడుదల చేసినట్లు తెలిపింది. మిగిలిన మొత్తాన్ని 2018-2019లో విడుదల చేస్తామని చెప్పింది. ఏడాది కాలంలో దాదాపు 125 కేసులను పరిష్కరించినట్లు కూడా కేంద్ర తన అఫిడవిట్‌లో పేర్కొంది.

సంక్షిప్తం

నిరుపయోగంగా మైనార్టీ శాఖ నిధులు
ఆగ్రహించిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ : కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు జరిపిన బడ్జెట్ కేటాయింపులు నిరుపయోగంగా ఉండటంపై సామాజిక న్యాయం, సాధికారతపై ఏర్పడిన పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ విషయమై మైనార్టీ వ్యవహారాల శాఖకు ఎటువంటి సూచనలు చేయలేదు. మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఫిబ్రవరి 20 వరకు రూ.4,195.48 కోట్లకు గాను కేవలం 66.58 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేసిందని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. బిజెపి ఎంపి రమేష్ బైజ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు. చాలా నిధులు నిరుపయోగంగా ఉన్నాయని, గత ఏడాది చెప్పిన కారణాలనే ఈ ఏడాది కూడా మంత్రిత్వ శాఖ చెబుతున్నదని పార్లమెంటరీ కమిటీ తెలిపింది. .

లోక్‌సభలో చిట్‌ఫండ్ బిల్లు
ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ ప్రతాప్

న్యూఢిల్లీ : చిట్‌ఫండ్ రంగాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకు వచ్చి మరింత బలోపేతం చేసేందుకు వీలుగా రూపొందించిన బిల్లును ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ ప్రతాప్ శుక్లా సోవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. చిట్‌ఫండ్‌కు సంబంధించిన బిడ్‌ను ప్రారంభించే సమయంలో వీడియో కాన్ఫరెన్స్‌ను తప్పనిసరి చేయడంతోపాటు ఫోర్‌మెన్ కమిషన్‌ను 5 నుంచి 7 శాతానికి పెంచుతూ ఈ బిల్లును రూపొందించారు. ఆర్థిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, చిట్‌ఫండ్స్‌పై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సలహా బృందాలు (అడ్వయిజరీ గ్రూప్స్) సిఫార్సుల ప్రాతిపదికగా చిట్‌ఫండ్స్ (సవరణ) బిల్లు-2018 రూపొందింది. ఇద్దరు సభ్యుల హాజరును తప్పనిసరి చేస్తూ, వ్యక్తిగతంగా లేదా ఫోర్‌మెన్ చేత నమోదు చేయబడిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బిడ్లు తెరవడాన్ని ఈ బిల్లు అనుమతిస్తుంది. చిట్ వ్యాపారానికి ఎదురయ్యే సవాళ్ళకు సంబంధించి వివిధ భాగస్వాములు వ్యక్తం చేసిన ఆందోళనలకు ఈ బిల్లు పరిష్కరిస్తుంది.

ఖలీదా జియాకు బెయిల్

ఢాకా : బంగ్లాదేశ్ ప్రతిపక్ష నేత ఖలీదా జియాకు కోర్టు బెయిల్ మంజూరు చేసిందని ఆమె తరపు లాయర్ తెలిపారు. దీంతో ఆమె ఎప్పుడైనా జైలు నుండి విడుదల కావచ్చునని భావిస్తున్నారు. అనాథాశ్రమం కోసం ఉద్దేశించబడిన నిధులను దుర్వినియోగం చేసిన కేసులో దోషిగా తేలడంతో గత నెల్లో ఆమెకు ఐదేళ్ళ జైలు శిక్ష విధించారు. కాగా రాజకీయ దురుద్దేశంతో తనపై ఈ అభియోగాలు మోపారని ఆమె బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపేవరకు ఢాకాలోని ప్రత్యేక జైల్లో ఆమెను ఒంటరిగా వుంచారు. ఆమె తరపు లాయర్ జైనుల్ అబెదిన్ విలేకర్లతో మాట్లాడుతూ, నాలుగు మాసాల పాటు తాత్కాలిక బెయిల్ ఇచ్చేందుకు కోర్టు అంగీకరించిందని చెప్పారు. గత నెల 8న కోర్టు తీర్పు వెలువడిన వెంటనే బంగ్లాదేశ్ అంతటా ప్రధాన నగరాల్లో హింస తలెత్తింది. బిఎన్‌పి కార్యకర్తలు పోలీసులతో, పాలక పార్టీ కార్యకర్తలతో ఘర్షణ పడ్డారు.



ప్రశంస
అణు నిరాయుధీకరణపై అమెరికాతో చర్చలు జరిపేలా ఉత్తర కొరియాను ఒప్పించడంపై చైనాను ప్రశంసిస్తున్న దక్షిణ కొరియా జాతీయ భద్రతా డైరెక్టర్ చుంగ్ ఇయు యాంగ్

ఉత్తర కొరియాను ఒప్పించడంలో చైనా పాత్రను ప్రశంసించిన దక్షిణ కొరియా

బీజింగ్ : అణు నిరాయుధీకరణపై చర్చలు జరిపేలా ఉత్తర కొరియాపై ఒత్తిడి తెచ్చి ఒప్పించడంలో చైనా పాత్రను దక్షిణ కొరియా జాతీయ భద్రతా డైరెక్టర్ చుంగ్ ఇయు యాంగ్ సోమవారం ప్రశంసించారు. మేలో చర్చలు జరిపేందుకు ట్రంప్, కిమ్‌లు అంగీకరించారని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు వెలువడ్డాయి.

చైనా విదేశాంగ విధాన సలహాదారు యాంగ్ జియిచితో కాసేపు చర్చలు జరిపిన చుంగ్ తదనంతరం అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కూడా భేటీ అయ్యారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, చైనా ప్రభుత్వ క్రియాశీల మద్దతుతోనే ఈ లక్ష్యం సాధించగలిగామని దక్షిణ కొరియా అభిప్రాయపడుతోందని చుంగ్ తెలిపారు. ఈ సమస్యను రాజకీయంగా పరిష్కరించాలని, ఈ దిశలోనే కొనసాగాలని సంబంధిత పక్షాలన్నీ పట్టుబడితే, ముందుకే కొనసాగుతామని, అందులో ఎలాంటి సందేహం లేదని యాంగ్ పేర్కొన్నారు. ఉత్తర కొరియా ఇక భవిష్యత్తులో ఎలాంటి అణు, క్షిపణి పరీక్షలను నిర్వహించబోదని కిమ్ ప్రతిన చేసినట్లు చుంగ్ తెలిపారు. దక్షిణ కొరియా గూఢచర్య సంస్థ చీఫ్ సు హూన్ జపాన్‌లో పర్యటిస్తున్నారు. చర్చల్లో పురోగతి గురించి అక్కడ అధికారులతో ఆయన మాట్లాడనున్నారు.

కెటలన్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి

బార్సిలోనాలో వేలాదిమందితో ప్రదర్శన

బార్సిలోనా : స్పెయిన్‌లోని కెటలోనియా ప్రాంతంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బార్సిలోనాలో వేలాదిమంది ప్రదర్శన నిర్వహించారు. స్వాతంత్ర్య అనుకూల సిటిజన్స్ గ్రూపు ఎఎన్‌సి ఇచ్చిన 'రిపబ్లిక్ నౌ' ప్రదర్శనలో దాదాపు 45వేల మంది పాల్గొన్నారు. ఎఎన్‌సి ఉపాధ్యక్షుడు అగస్తి అల్కోబెరో విలేకర్లతో మాట్లాడుతూ, తమలో దాదాపు 20లక్షలమందికిపైగా ప్రజలు కెటలోనియా వైపుగా వెళ్లాలని భావిస్తున్నారని చెప్పారు. గతేడాది డిసెంబరు 21న జరిగిన కెటలన్ పార్లమెంట్ ఎన్నికల్లో వేర్పాటువాద పార్టీలకు సంపూర్ణ మెజారిటీ లభించింది. కానీ ఇప్పటివరకు కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైంది.

కొలంబియాలో మితవాద పార్టీల వైపే ఓటర్ల మొగ్గు

శాంతి ఒప్పందాన్ని సమర్థించిన వారికి దెబ్బ

బొగొటా : దేశ శాంతి క్రమాన్ని విమర్శిస్తున్న మితవాద పార్టీల వైపే కొలంబియా ఓటర్లు మొగ్గు చూపారు. కొలంబియా కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రధాన వామపక్ష రెబెల్స్, ప్రస్తుత అధ్యక్ష పార్టీ రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో శాంతి ఒప్పందం భవిష్యత్‌పై సందేహాలు తలెత్తుతున్నాయి. దీంతో మేలో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో కూడా భీకరమైన పోరు వుండొచ్చునడానికి ఆదివారం జరిగిన పోలింగ్ సంకేతాలు పంపిస్తోంది. దాదాపు అర్ధ శతాబ్దం నుండి కొనసాగుతున్న ఘర్షణలకు స్వస్తి పలికేందుకు 2016లో కుదిరిన శాంతి ఒప్పందం కింద నిరాయుధీకరణ జరిగినప్పటి నుండి ఫార్క్ రాజకీయంగా పోటీ పడిన మొదటి ఎన్నికలు ఇవే.


రోహింగ్యా గ్రామాల నేలమట్టంపై అమ్నెస్టీ నివేదిక

యాంగాన్ : ఇటీవల రాఖినె రాష్ట్రంలో హింసాకాండ చెలరేగి లక్షలాదిమంది రోహింగ్యాలు పొరుగు దేశాలకు పారిపోయిన నేపథ్యంలో వారు నివసించిన గ్రామాలన్నింటినీ నేలమట్టం చేసిన మయన్మార్ ప్రభుత్వం ఆ స్థానంలో సైనిక నిర్మాణాలను, హెలిపాడ్‌లను, రోడ్లను నిర్మిస్తోందని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. దీంతో రోహింగ్యా శరణార్థులు తిరిగి స్వదేశానికి వచ్చే అవకాశాలపై సందేహాలు నెలకొన్నాయి. దాదాపు ఏడు లక్షల మంది రోహింగ్యా ముస్లింలు బంగ్లాదేశ్‌కు పారిపోయారు. దీంతో అక్కడ జాతి ప్రక్షాళన జరుగుతోందంటూ ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించింది. ఆ వ్యాఖ్యలను మయన్మార్ ప్రభుత్వం తిరస్కరిస్తోంది.

'రాఖినె రాష్ట్రం పునర్నిర్మాణం' పేరుతో అమ్నెస్టీ ఒక నివేదికను వెలువరించింది. ఈ ఏడాది ప్రారంభం నుండి ఆ ప్రాంతంలో సైనిక కట్టడాలు, ఇతర నిర్మాణాలు పెరుగుతున్నాయని, ఇదంతా భూ ఆక్రమణగా పరిశోధకులు పేర్కొంటున్నారు. సోమవారం ఈ నివేదికను విడుదల చేశారు. రోహింగ్యాలు తిరిగి వచ్చి నివసించాల్సిన ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలపై కొత్త సాక్ష్యాధారాలను



పొందుపరిచినట్లు అమ్నెస్టీ క్రైసిస్ రెస్పాన్స్ డైరెక్టర్ తిరానా హసన్ తెలిపారు. గత ఆగస్టులో దాడులు జరిగిన రెండు మాసాలకు ఉపగ్రహ చిత్రాలు తీశారు. తిరిగి మార్చిలో తీసిన చిత్రాల్లో భవనాల నిర్మాణాలు కనిపిస్తున్నాయి. కాన్ క్యా, ఇన్ డిన్ గ్రామాల్లో కూడా ఇటువంటి నిర్మాణాలు కనిపిస్తున్నాయని ఆ నివేదిక పేర్కొంది.



ఆర్థిక మంత్రి టారో అసో
జపాన్ ప్రధాని షింజో అబె

కుంభకోణం పత్రాల నుండి
జపాన్ ప్రధాని ప్రభృతుల పేర్లు తొలగింపు


వెల్లడించిన మీడియా

సాక్ష్యముంటే రాజీనామా చేస్తానన్న అబె

టోక్యో : ఆశ్రిత పెట్టుబడుల కుంభకోణానికి సంబంధించిన పత్రాల నుండి జపాన్ ప్రధాని షింజో అబె, ఆయన భార్య, ఆర్థిక మంత్రి టారో అసో ప్రస్తావనలను తొలగించారని మీడియా వార్తలు తెలిపాయి. ఈ కుంభకోణంతో వీరికి గల సంబంధాలను మాఫీ చేసేందు కు ప్రయత్నాలు జరుగుతున్నా యన్న ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ వార్తలు వెలువడ్డాయి. అబె భార్యకు సంబంధమున్న స్కూలు నిర్వాహకునికి పెద్ద మొత్తంలో రాయితీల పై ప్రభుత్వ భూమిని విక్రయించడంపై సందేహాలు తలెత్తుతున్నాయి. గతేడాది ఈ విషయం బహిర్గ తం కావడంతో అబె పేరు కూడా వార్తల్లోకి వచ్చింది. కాగా తాను కానీ తన భార్య కానీ ఎవరికీ అనుకూలంగా ఏమీ చర్యలు తీసుకోలేదని అబె చెబుతున్నారు. తనకు సంబంధ మున్నట్లు సాక్ష్యాధారాలు చూపిస్తే రాజీ నామా చేస్తానని ప్రకటించారు. అబెకి వ్యతిరేకంగా వార్తలు వస్తున్న నేపథ్యంలో మూడోసారి ఆయన పార్టీ ఎల్‌డిపి నేతగా ఎన్నికయ్యే అవకాశాలు తక్కువేనని భావిస్తున్నారు. సోమవారం ఆర్థిక మంత్రి అసో పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, తన మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు కొందరికి ఈ పత్రాలను మార్చడంలో ప్రమేయముందని చెప్పారు. ఇందుకు తాను విచారిస్తున్నానని, క్షమాపణ కూడా చెబుతున్నానని తెలిపారు. అయితే ప్రతిపక్ష నేత యూకియో ఎడనో మాత్రం ఇందుకు ఒప్పుకో వడం లేదు. ఇందులో సమాధానం తేలాల్సిన ప్రశ్నలు చాలా వున్నాయని అన్నారు. పత్రాలు మార్చా లని ఎవరు ఆదేశించారు, అందుకు కారణం ఏమిటి అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలన్నారు.

విచారణ నుండి తప్పించుకొనేందుకే 'మెరుపు' ఎన్నికలు

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



జెరూసలేం: ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తాను ఎదుర్కొంటున్న అవినీతి ఆరోపణల విచారణల నుండి తప్పించుకునేందుకే 'మెరుపు' ఎన్నికలవైపు అడుగులేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని నెతన్యాహు స్వయంగా దేశంలో కృత్రిమ రాజకీయ సంక్షోభాన్ని సృష్టించి హఠాత్తుగా ఎన్నికల నిర్వహణకు ప్రయత్నిస్తున్నారని ఆయన నేతృత్వంలోని సంకీర్ణ కూటమి భాగస్వాములే విమర్శిస్తున్నారు. సనాతన యూదు యువతకు నిర్బంధ సైనిక శిక్షణ నుండి మినహాయింపునివ్వాలంటూ సంకీర్ణ కూటమి ఛాందసవాద భాగస్వాములు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టటం వివాదానికి దారి తీసింది. మొత్తం 120 మంది సభ్యులున్న పార్లమెంట్‌లో ప్రభుత్వానికి 66 మంది సభ్యుల బలం వుండగా అందులో 12 మంది సంకీర్ణ భాగస్వాముల ప్రతినిధులే. ప్రధాని నెతన్యాహు, ఆయన సన్నిహిత సహచరులు అవినీతి నేరాభియోగాలకు సంబంధించిన నాలుగు కేసుల్లో విచారణను ఎదుర్కొంటున్న సమయంలో ఈ బిల్లుపై వివాదం చెలరేగటం గమనార్హం. ప్రధాని నెతన్యాహూ జూన్‌లో పార్లమెంట్ ఎన్నికలకు ఆదేశించే అవకాశాలున్నాయంటూ ఆదివారం నాడు ఇజ్రాయిలీ మీడియా పేర్కొనడంతో ఆయనపై భాగస్వామ్య పక్షాలతో పాటు ఇతర రాజకీయ పార్టీల నేతలు విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

మరోసారి చిలీ గద్దెపై పినెరా

వల్‌పరైసో (చిలీ): నాలుగేళ్ల విరామం అనంతరం చిలీ మాజీ అధ్యక్షుడు సెబాస్టియన్ పినెరా ఆదివారం నాడు మరోసారి దేశాధ్యక్ష బాధ్యతలను స్వీకరించారు. రాజధాని వల్‌పరైసోలో జరిగిన పార్లమెంట్ భేటీ ఆయన పదవీ విరమణ చేస్తున్న అధ్యక్షురాలు మిచెల్లి బాచ్లెట్ నుండి అధికార బాధ్యతలను స్వీకరించారు. 2006 నుండి వీరిద్దరూ ఒకరి తరువాత ఒకరుగా దేశాధ్యక్షులుగా వ్యవహరిస్తుండటం విశేషం. గత నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో దేశాధ్యక్షుడిగా ఎన్నికయిన పినెరా 2022 వరకూ నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రచురించిన చిలీ అత్యంత సంపన్నుల జాబితాలో పినెరా నాలుగో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. అధికారిక అంచనాల ప్రకారం ఆయన సంపద మొత్తం 280 కోట్ల డాలర్ల మేర వుంటుందని తెలుస్తోంది. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం బాచ్లెట్, ఆమె మంత్రివర్గ సహచరులు పార్లమెంట్ సభ్యుల హర్షధ్వానాల మధ్య అక్కడి నుండి నిష్క్రమించారు. ఈ సందర్భంగా బాచ్లెట్ కానీ, పినెరా కానీ ఎటువంటి ప్రసంగాలూ చేయకపోవటం విశేషం.

మొదటి పేజీ తరువాయి

ప్రజాందోళనపై పైశాచికం

ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు తొలుత ఎల్‌బిజి భవన్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ రెండు గేట్ల వద్ద ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు బలవంతంగా లాగేశారు. పోలీసులకూ, నాయకులకూ మధ్య తీవ్ర పెనుగులాట జరిగింది. సిపిఎం కార్యకర్తలను పోలీసులు పిడిగుద్దులు గుద్దారు. చొక్కా కాలర్ పట్టుకొని ఈడ్చేశారు. మెడతిప్పి మరీ వ్యాన్‌లో కుక్కేశారు. మహిళల చీరలను మహిళా పోలీసులు లాగిపడేశారు. రెండు చేతులు పట్టుకొని రోడ్డుపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యానులో పడేశారు. సిపిఎం జెండాలను తీసుకెళ్లి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పడేశారు. సుమారు 25 నిమిషాలు పాటు ఈ అరెస్టుల పర్వం సాగింది. సిపిఎం తూర్పు జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, ఎస్‌కె మాబు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు సహా 50 మంది నాయకులకు, కార్యకర్తలను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని కొంతమందిని జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, మరికొందరిని సంతనూతలపాడు, ఇంకొందరిని ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. నాన్‌బెయి లబుల్ కేసు నమోదు చేశారు. నాయకులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

బిజెపికి మితపక్షంగానే ఉన్నాం

హయాంలో తన చొరవ వల్లే జాతీయ రహదారుల ప్రాజెక్టు కార్యరూపం దాల్చిందన్నారు. దేశంలో తొలిసారిగా ఆర్థిక సంస్కరణలు చేపట్టింది, టెక్నాలజీని అడాప్ట్ చేసుకుంది కూడా తానేనని, తద్వారా దేశానికి ఆదర్శంగా నిలచానని పేర్కొన్నారు. విద్యుత్ అంశంలో కూడా రాష్ట్రాన్ని ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా నిలిపానన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలతో పాటు పార్లమెంట్ ఇచ్చిన హామీల పై సమీక్ష చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామని, కానీ దాటవేత ధోరణితో కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాల్సిన అవసరముందన్నారు. సెంట్‌మెంట్ కోసం తెలం గాణ రాష్ట్రాన్ని ఇచ్చినపుడు, అదే సెంట్‌మెంట్ ఆంధ్రప్రదేశ్‌కూ వర్తిస్తుందని, కానీ నిధులెందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆపరేషన్ చేసి బిడ్డ (తెలంగాణ)ను రక్షించి, తల్లి (ఆంధ్రప్రదేశ్)ని చంపేశారంటూ నాడు ప్రధాని మోడీ పేర్కొన్నారని చంద్రబాబు గుర్తు చేశారు.

నేపాల్‌లో విమాన ప్రమాదం

పోస్టయ్యాయి. మంటలను అదుపు చేసేందుకు తాము ప్రయత్నిస్తున్నామని, విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి ఇతర సర్వీసులను దారి మళ్లించామని విమానాశ్రయ ప్రతినిధి బీరేంద్ర ప్రసాద్ శ్రేష్ఠ చెప్పారు. విమానాశ్రయం నుండి ప్రయాణీకులను సురక్షితంగా బయటకు తరలించటంపై తాము దృష్టి సారించామన్నారు.

తెలంగాణ సభలో కాంగ్రెస్ రభస

చేసినట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తానని చెప్పారు. మార్షల్స్ తమను అడ్డుకొని తోసివేయడంతో కాళ్లకు గాయాలయ్యాయని చూపించారు. మరోవైపు సరోజినీ కంటి ఆస్పత్రిలో చేరిన మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను పలువురు మంత్రులు పరామర్శించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ వారితో మాట్లాడుతూ గవర్నర్‌తో కలిసి సభ నుంచి బయటకు వస్తున్నప్పుడు కాంగ్రెస్ సభ్యులు ఇయర్‌ఫోన్స్ విసిరారని, అవి కంటి వద్ద బలంగా తగలడంతో గాయమైనట్టు చెప్పారని వారు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా తమ నిరసన తెలిపే హక్కు ఉంటుందని, ఇలాంటి చర్యలు మాత్రం సరికాదని స్వామిగౌడ్ అన్నారు. ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి సహా పలువురు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు స్వామిగౌడ్‌ను పరామర్శించారు. కాగా సభలో కాంగ్రెస్ సభ్యుల వ్యవహారశైలిని అధికార పక్షం తప్పుబట్టింది. సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై క్రమశిక్షణ చర్యల్ని మంగళవారం సభలో ప్రకటించనున్నారు.

మధ్యలోనే వెళ్లిపోయిన జానారెడ్డి

ఓవైపు కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నించడం, మార్షల్స్ అడ్డుగా నిలబడటం వంటి ఘటనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ శాసనసభాపక్షనేత జానారెడ్డి మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. బిజెపి సభ్యులు కూడా గవర్నర్ ప్రసంగం ప్రారంభమైన పది నిముషాలకు సభ నుంచి వెళ్లిపోయారు.

పవన్ ఇంటికి భూమిపూజ

ప్రజాశక్తి – మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నవ్యాంధ్రలో సొంత ఇంటి నిర్మాణానికి గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో సోమవారం శ్రీకారం చుట్టారు. భార్య అన్నా లెజినోవతో కలిసి ఈ స్థలంలో సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉంటే ప్రజలకు దగ్గరగా ఉండటంతోపాటు ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ఉపయోగ పడుతుందన్నారు. తన తండ్రి ఈ ప్రాంతంలోనే పోలీసు ఉద్యోగం నిర్వహించారని, అన్నయ్య పని చేశారని, ఆ క్రమంలో తానూ ఇక్కడ ఇల్లు నిర్మించుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. పార్టీ కార్యక్రమాలన్నీ హైదరాబాద్ నుండి నిర్వహించడం కష్టసాధ్యంగా ఉందని, సాధ్యమైనంత త్వరలో పార్టీ కార్యాలయ నిర్మాణం పూర్తిచేసి ఈ ప్రాంతం నుండే కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. గతానుభవాల దృష్ట్యా ప్రజలకు దగ్గరగా ఉన్నవారినే ఎన్నికల్లో అభ్యర్థులుగా ఎంపిక చేస్తామని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అనుభవజ్ఞులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. పవన్ వెనుక చంద్రబాబు ఉంటున్నారనే ఆరోపణలు సరికాదని, అలాగైతే జగన్ వెనుక మోడీ ఉన్నారా? అని ప్రశ్నించారు. అసమానతలపై ప్రశ్నించడానికే తమ పార్టీ ఏర్పడిందని, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట ఈనెల 14న నిర్వహించే పార్టీ ఆవిర్భావ సభలో తమ రాజకీయ, దిశ, దశను వివరిస్తామని చెప్పారు. అనంతరం సభ నిర్వహణా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

లోపలికి అనుమతించని పోలీసులు

ఇంటి నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా కార్యకర్తలకు, మీడియాకు అనుమతి నిరాకరించారు. బారికేడ్లను అడ్డుపెట్టి రోడ్డుపైనే నిలిపేశారు. దీనిపై ప్రశ్నించిన మీడియా ప్రతినిధులు గుర్తింపు కార్డులు చూపడంతో కొందర్ని లోపలికి అనుమతించారు. ఆవిర్భావ సభా స్థలిని మరోవైపు సోమవారం సాయంత్రం అర్బన్ ఎస్‌పి విజయరావు పరిశీలించారు. వేదిక నిర్మాణం చివరి దశలో ఉండగా లైటింగ్, బారికేడ్లు, విఐపి గ్యాలరీ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మంగళవారం నాటికి పనులు పూర్తి చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

రైల్వే జోన్ ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

ఆదిత్యనాథ్, ఏపి భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్, తెలంగాణ ప్రభుత్వం తరపున తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో విభజన చట్టంలోని షెడ్యూల్ 13లో పేర్కొన్న అంశాలైన ఇరు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలనుకున్న విద్యా సంస్థలు, కేంద్ర సంస్థల ఏర్పాటు, పురోగతిపై చర్చ జరిగింది. షెడ్యూల్ 13లో ఉన్న విద్యా సంస్థలకు సంబంధించి ఐదు అంశాలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన 12 అంశాలు.. మొత్తం 17 అంశాలపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. ఇందులో మౌలిక వసతుల కల్పనలో 8వ అంశంగా ఉన్నటు వంటి రైల్వే జోన్ ప్రస్తావ-నకు వచ్చింది. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ కార్యదర్శి గాబా రైల్వే జోన్ ఇవ్వడం కుదరదని ఏపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌కు స్పష్టం చేసినట్లు సమాచారం. రైల్వేజోన్ సాధ్యాసాధ్యాల నివేదికలు, నిపుణుల కమిటీ నివేదికలు వ్యతిరేకంగా ఉన్నాయని, రైల్వే బోర్డు కూడా వ్యతిరేకంగా ఉందని ఆయన చెప్పారు. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేయాలనుకున్న రైల్వేజోన్ సాధ్యపడదని ఈ సందర్భంగా గాబా చెప్పారు. ఇప్పటి వరకు వచ్చిన అన్ని సర్వేలు, నివేదికలను బట్టి చూస్తే విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ సాధ్యపడకపోవచ్చని చెప్పినట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేసినట్టు సమాచారం. దుగరాజ పట్నం పోర్టు, ఐఐటి, ఐఐఎం నిర్మాణం, విజయవాడలో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయం ఏర్పాటు, తదితర అంశాలపై రెండు గంటల పాటు జరిగిన చర్చలో ఈ అంశంపై ప్రవీణ్ ప్రకాశ్ లేవనెత్తారు. గతంలో రైల్వేజోన్‌కు గ్రీన్ సిగ్నల్ పడినట్టు వచ్చిన సమాచారం నేపథ్యంలో రైల్వేజోన్ ఏర్పాటుకు సంబంధించి తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలని ఆయన అడిగిన ప్రశ్నకు సమాధానంగా జోన్ ఏర్పాటు సాధ్యం కాకపోవచ్చని, నివేదికలు వ్యతిరేకంగా ఉన్నాయని ఆయన చెప్పినట్టు తెలుస్తోంది. పెట్రోలియం కాంప్లెక్స్ ఏర్పాటు నివేదికలను వ్యయ విభాగానికి అందించి నిర్ణయం తీసుకోవాలని పెట్రోలియం శాఖను ఆదేశించారు. దుగరాజపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయం కూడా పోర్టుల విభాగమే చూపాలని కేంద్ర హోంశాఖ సూచించింది. ఐఐటి, ఐఐఎంల నిర్మాణ కార్యకలాపాలు వెంటనే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థల నిర్మాణ వ్యవహారాన్ని ఎన్‌బిసిసికి అప్పగించాలని ఆదేశించింది. గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయాల బిల్లులను ఈ సమావేశాల్లోనే ఆమోదించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించింది. విజయవాడ, గుంటూరులో డ్రైనేజీ పనులకు ఇచ్చిన రూ.1000 కోట్లను రాజధాని నిధులతో కలపవద్దంది. అలాగే రాజధానికి విడుదల చేసిన నిధులు రూ.1500 కోట్లేనని, మరో రూ.వెయ్యి కోట్లు విడుదల చేసే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖను ఆదేశించింది. రూ.1500 కోట్లకే ఏపి ప్రభుత్వం ఖర్చుల వివరాలు అందించిందని హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గాబా తెలిపారు. కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో మరోసారి భేటీ కావాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

13వ షెడ్యూల్‌లోని అంశాలపై చర్చ జరిగింది: ఏపి సిఎస్ దినేష్ కుమార్

సుదీర్ఘ సమావేశ అనంతరం ఏపి సిఎస్ దినేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ 13వ షెడ్యూల్‌లోని సంస్థలపై చర్చలు జరిగాయని పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వ విద్యాలయం, గిరిజన విశ్వవిద్యాలయంలను త్వరగా పూర్తి చేయాలని కోరామని, దీనిపై కేబినెట్ నోట్ కూడా పూర్తయిందని కేంద్ర హోం కార్యదర్శి తెలిపారని చెప్పారు.. తదుపరి సమావేశం హోం మంత్రి స్థాయిలో ఉంటుందని దినేష్ స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించి బయ్యారం స్టీల్ ప్లాంట్, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, హార్టికల్చర్ వర్సిటీ, ట్రైబల్ యూనివర్శిటీ, వెనకబడిన ప్రాంతాల రహదారుల అనుసంధానం అంశాలపై చర్చ జరిగనట్లు తెలంగాణ అధికారులు చెప్పారు. ట్రైబల్ యూనివర్శిటీ కోసం 200 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని వారు గుర్తు చేశారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు వ్యాగన్ పిరియాడిక్ ఫ్యాక్టరీ ఇస్తామని కేంద్రం ప్రతిపాదించిందని తెలంగాణ అధికారులు తెలిపారు.

అసెంబ్లీకి పాకిన మిత్రభేధం

(మొదటి పేజీ తరువాయి)

అవమానిస్తోందని టిడిపి సభ్యులు పదేపదే అనడంతో ఎమ్మెల్సీలు వీర్రాజు, మాధవ్ కూడా ఎదురుదాడికి దిగారు. సవాళ్లు ప్రతిసవాళ్లు విసురు కున్నారు. టిడిపి ఏం చేసిందో త్వరలోనే బయట కొస్తుందని బిజెపి ఎమ్మెల్సీలు హెచ్చరించారు. సభ్యుల మధ్య వాగ్వివాదం జరుగుతున్న సమయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు మండలిలోకి రావడంతో రెండు పక్షాల వాళ్లు చల్లబడ్డారు. అయితే నాలుగేళ్ల కాలంలో టిడిపి 600 హామీలు గుప్పించిందని, అవన్నీ తమ వద్ద ఉన్నాయని బిజెపి శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. తొలిసారి చట్టసభ సాక్షిగా టిడిపి, బిజెపి సభ్యులు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు రోజుల్లో టిడిపి భండారాన్ని మొత్తం బయట పెడతామని బిజెపి సభ్యులు వ్యాఖ్యానించగా, హామీలిచ్చి మోసం చేసిన బిజెపి వ్యవహారాన్ని తామూ బయటపెడతామని టిడిపి సభ్యులు ఎదురుదాడికి దిగారు. తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకున్నా చివరికి తాము మిత్రపక్షమేనంటూ సభ్యులు వ్యాఖ్యానించు కోవడం విశేషం.

లాబీలోనే కూర్చుంటాం : బిజెపి

బిజెపి సభ్యులు కూర్చునేందుకు కనీసం కార్యాలయం కూడా లేదని, ఒక్క కుర్చీపట్టే కార్యాలయాన్ని అదీ టాయిలెట్‌లేనిది ఇచ్చా రని, తమకు సరిపోయే కార్యాలయం కేటాయించక పోతే లాబీలోనే కుర్చీలు వేసి కూర్చుంటామని బిజెపి సభ్యులు విష్ణు కుమార్‌రాజు, మాణిక్యాల రావు, సత్యనారాయణ తెలిపారు. సోమవారం విరామ సమయంలో కార్యాలయంలోకి రాగా అక్కడ రెండు కుర్చీలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా కూర్చునేందుకు సరిపోయే విధంగా లేవు. దీంతో మాణిక్యాలరావు జోక్యం చేసుకుని హాల్లో కుర్చీలు, బల్లలు వేయాలని, అక్కడే కూర్చుంటామని అన్నారు. అదే సమయంలో అటెండరును పిలవగా ఆయన కూడా అక్కడ లేడు. విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ అటెండర్‌ను కూడా కేటాయించలేదని తెలిపారు. దీంతో సభ్యులందరూ తమకు సరైన కార్యాలయం కేటాయించాలని స్పీకర్‌ను కోరగా, బిఏసి హాలును వాడుకోవాలని ఆయన సూచించారు. తమను వేధిం చడంలో భాగంగానే అటెండర్లను, కార్యాలయా లను ఇవ్వడం లేదని బిజెపి సభ్యులు విరుచుకుపడ్డారు.

భాషా పండితులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యతనివ్వాలి : హైకోర్టు

ప్రజాశక్తి – హైదరాబాద్


భాషా పండితుల కోర్సులు చేసే వారికి ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, లేకపోతే అందరూ వత్తి విద్యాకోర్సుల పట్ల మొగ్గు చూపితే భాషా శాస్త్రాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఆంధ్రవిశ్వవిద్యాలయం, వెంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో తెలుగు, ఉర్దూ, అరబిక్, సంస్కృతం ఇతర భాషా శాస్త్రాల అధ్యాపకుల్ని లా, హిందీ బోధనలకు బదిలీ చేయడాన్ని సయ్యద్ రహ్మతుల్లా, ఇతరులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. భాషా శాస్త్రాల్లో విద్యా సంవత్సరాల వారీగా ఎంతమంది చొప్పున విద్యార్థులు చేరారో, మంజూరైన పోస్టుల వివరాలు అందజేయాలని బెంచ్ ఆ రెండు వర్సిటీలను ఆదేశించింది. చదివినది ఒకటి బదిలీ చేసినది మరొక శాఖ వంటి వివరాలు కూడా ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

పదో పిఆర్‌సి బకాయిలను విడుదల చేయాలి

సిఎంకు ఉద్యోగ సంఘాల జెఎసి వినతి

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

పదో పిఆర్‌సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 11వ వేతన కమిటీ నియామకానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులు కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై జెఎసి రాష్ట్ర అధ్యక్షులు పి. అశోక్‌బాబు నేతృత్వంలో ఆ సంఘ నాయకులు సోమవారం సచివాలయంలో సిఎంను కలిశారు. ఈ సందర్భంగా నాలుగో తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎస్ విధానం రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు దృష్టిలో



పెట్టుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని వారు కోరారు. పదో పిఆర్సీ బకాయిలపై ఉన్నతాధికారులతో చర్చించాక వెంటనే విడుదల చేస్తామని జెఎసి నాయకులకు సిఎం హామీ ఇచ్చారు. త్వరలో 11వ వేతన సవరణ కమిటీని నియమించేందుకు సిఎం సూత్రప్రాయంగా అంగీకరించారు. జెఎసి సెక్రటరీ జనరల్ జోసఫ్ సుధీర్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు బాబురెడ్డి, బాబ్జి, ఏపిటిఎఫ్ నాయకులు రఘురామరెడ్డి, ఏపిఎన్జీఓ నాయకులు చంద్రశేఖర రెడ్డి, వీరేంద్రబాబు, ఎ. విద్యాసాగర్ తదితరులు సిఎంను కలిసిన వారిలో ఉన్నారు.

ఉగాది నుంచి...




నాగార్జున

నాగార్జున, నానిలతో రూపొందనున్న మల్టీస్టారర్ ఉగాది నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. వైజయంతి మూవీస్ పతాకంపై టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో తెరకెక్కనుంది. సి.అశ్వనీదత్ నిర్మాత. "మా వైజయంతి బేనర్‌లో మణిశర్మ చేసిన సినిమాలన్నీ మ్యూజికల్‌గా పెద్ద హిట్స్ అయ్యాయి. ఈ సినిమాని కూడా మ్యూజికల్‌గా బిగ్గెస్ట్ హిట్ చెయ్యాలని ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం అమెరికాలో ఈ సినిమాలోని సాంగ్స్‌ని మణిశర్మ కంపోజ్ చేస్తున్నారు. మూడు పాటలకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ అక్కడ జరుగుతున్నాయి. ఈనెల 18 ఉగాది రోజు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నాం. మా బేనర్‌లో ఎన్నో మల్టీస్టారర్స్ చేశాం. అవన్నీ కమర్షియల్‌గా ఘనవిజయాల్ని అందుకున్నాయి. ఈ మల్టీస్టారర్ కూడా బిగ్గెస్ట్ హిట్ అయి మా బేనర్‌కి మరింత మంచి పేరు తెస్తుంది" అని సి.అశ్వనీదత్ అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి, మాటలు : వెంకట్ డి. పట్టి, శ్రీరామ్ ఆర్. ఇరగం.



నాని



మేడమ్ టుస్సాడ్స్‌లో కట్టప్ప విగ్రహం

'బాహుబలి' అంటే ప్రాథమికంగా నాలుగు నాలుగు పాత్రలు గుర్తొస్తాయి. అందులో బాహుబలి, భల్లాలదేవ, శివగామి, కట్టప్ప. అందులోనూ మాహిష్మతి సామ్రాజ్యానికి కట్టుబానిస 'కట్టప్ప' పాత్రలో భలే మెప్పించారు సత్యరాజ్. ఆ పాత్రతో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులకు దగ్గరయ్యారు ఈయన. ఇప్పుడు సత్యరాజ్‌కు అరుదైన గౌరవం లభించింది. గత ఏడాది బాహుబలి పాత్రధారి మైనపు విగ్రహాన్ని లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు కట్టప్ప మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. తమిళ చిత్రసీమ నుంచి ఓ నటుడి విగ్రహం ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం కావడం విశేషం. ఈ విషయాన్ని సత్యరాజ్ కుమారుడు, నటుడు సిబిరాజ్ సామాజిక మాధ్యమం ద్వారా తన అభిమానులతో పంచుకున్నారు.

డాడీకి కొత్తలుక్ చూపించాలని..!

కైరా అద్వానీ, నమ్రతా శిరోద్కర్‌తో కలసి క్యూట్ లుక్‌లో ఉన్న ఈ చిన్నారి ఎవరో గుర్తుపట్టారు కదా? అదేనండీ... మహేశ్ బాబు ముద్దుల తనయ సితార. 'భరత్ అనే నేను' సినిమా సెట్‌లోకి ఆదివారం వచ్చి సందడి చేసింది. డాడీ(మహేశ్ బాబు) సినిమా షూటింగ్‌లకు అప్పుడప్పుడు వస్తున్నా ఈ సారి రాక మాత్రం ప్రత్యేకం. తనకు ఉండే రింగులు జుట్టును మార్చి ఇలా స్ట్రెయిట్ చేయించుకుంది సితార. మరి ఆ లుక్ ఎలా ఉందో? దానిపై డాడీ ఏం అంటారో చూద్దామని, మహేశ్‌కు చూపించడానికి నేరుగా సెట్‌కు వచ్చేసిందట. ఈ విషయం నమ్రత ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. సితారతో దిగిన సెల్ఫీని, కథానాయిక కైరా అద్వానీతో దిగిన ఫొటోలను పోస్టు చేస్తూ 'సితార తన కొత్త హెయిర్ స్టైల్‌ను డాడీకి చూపించాలని బయలుదేరింది. పిల్లల సమయం' అని తెలిపారు. "ఎవరి జుట్టు పొడవుగా ఉంది. 'భరత్ అనే నేను' సెట్‌లో అందమైన కైరా అద్వానీతో అత్యంత పొడువు జుట్టు అవార్డుకు పోటీ జరుగుతోంది. ఇద్దరు అందగత్తెలు" అని నమ్రత రాశారు.



కైరా అద్వానీ, నమ్రతతో మహేష్ బాబు కుమార్తె సితార



ఊళ్లో పెళ్లికి... పాటలు వచ్చాయ్



రాజేంద్ర ప్రసాద్, జెమిని కిరణ్, సాక్షి చౌదరి, ప్రసాద్ తదితరులు

రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో జెబి క్రియేషన్స్ పతాకంపై భాగ్యలక్ష్మి నిర్మించిన సినిమా 'ఊ.పె.కు.హ'. 'ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి' అనేది కాప్షన్. సాక్షి చౌదరి కథానాయిక. 'నిధి' ప్రసాద్ దర్శకుడు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో సోమవారం హైదరాబాద్‌లో విడుదలైంది. బిగ్ సీడీని జెమిని కిరణ్ విడుదల చేశారు. ఆడియో సీడీలను రాజేంద్ర ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నిధి ప్రసాద్ మాట్లాడుతూ 'అనూప్ రూబెన్స్ చిత్రానికి హీరో. చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. తనని నా సినిమాకు సంగీతం చేయమని అడిగే సమయంలో తను చాలా బిజీగా ఉన్నాడు. అయినా కూడా నేను అడిగానని సినిమాకు మ్యూజిక్ అందించారు. పెద్ద మ్యూజిక్ డైరెక్టర్ కదా! ఎక్కడ ఆలస్యం అవుతుందోనని టెన్షన్ పడ్డాను. కానీ ఆయన అనుకున్న సమయం కంటే ముందుగానే ఆడియో కంప్లీట్ చేసిచ్చారు. మా సినిమా కోసం విలువైన సమయాన్ని వెచ్చించారు. అందుకు అనూప్‌కి థాంక్స్. పాటలు ప్రేక్షకులకు నచ్చుతుందని భావిస్తున్నాం. సినిమా బాగా వచ్చింది. తర్వలోనే విడుదల తేదీని ప్రకటిస్తామ'ని అన్నారు.

రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'సాధారణంగా చిన్న సినిమా, పెద్ద సినిమా అని అంటుంటారు. నా సినిమాను చిన్న సినిమా అన్న ప్రతిసారి పెద్ద వసూళ్లను సాధించాయి. నేను రాజ్‌కోటితో కలిసి పనిచేసేటప్పుడు దిలీప్ అనే కీబోర్డ్ ప్లేయర్ ఉండేవాడు. ఆయనే ఇప్పుడు ఎ.ఆర్.రెహమాన్ అయ్యారు. తనతో అప్పట్నుంచి ఉన్న అనుబంధం ఇప్పటికీ కొనసాగుతుంది. అలాగే ఇప్పుడు అనూప్ కూడా తాను కీ బోర్డ్ ప్లేయర్‌నని చెప్పుకోవడం వింటుంటే ఆనందంగా ఉంది. అర్బన్ కామెడీ సినిమా. ఇందులో 80మంది నటీనటులు నటించారు. నిధి ప్రసాద్ చక్కగా సినిమా తీశాడు. నేను త్రివిక్రమ్‌తో 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', మహేశ్‌తో 'శ్రీమంతుడు' సినిమాలు చేశాను. ఆ క్రమంలో నాకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కాలేదో ఇప్పుడు కూడా నిర్మాతల నుండి అలాంటి మంచి సహకారం లభించింది. కంఫర్ట్‌తో చేశాను. భాగ్యలక్ష్మి, విక్రమ్‌లు సినిమాను చక్కగా నిర్మించారు. తప్పకుండా సినిమా పెద్ద హిట్ అవుతుంద'ని అన్నారు.

'చిత్రం' శీను...విలన్



సోలోస్టార్ ఎంటర్ టైన్‌మెంట్స్ పతాకంపై సురేంద్ర కమల్ నిర్మిస్తున్న థ్రిల్లర్ 'విశ్వదాభిరామ'. సురేష్ కాశీ, సురేంద్ర కమల్, అశోక్ చక్రం దర్శక త్రయం. చిత్రం శీను ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో భువన్ తేజ్, అనిల్, ఆనంద్, సహస్ర, రాజారెడ్డి, మానస ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. దర్శకులు మాట్లాడుతూ 'కొండవీటి కోట నేపథ్యంలో జరిగే డెత్ గేమ్ థ్రిల్లర్ ఇది. ఇప్పటివరకూ కామెడీ పాత్రల్లో అలరించిన చిత్రంశీను తొలిసారి విలన్‌గా ఈ చిత్రంలో నటిస్తున్నారు. తెలుగు ప్రేక్షకులకు ఇదొక సరికొత్త థ్రిల్ కలిగిస్తుంది. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామన్నారు. ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు : సురేష్ కాశీ, కెమెరా : అజీమ్, తరుణ్ సోనూ, నిర్మాత : సురేంద్ర కమల్, దర్శకత్వం : సురేష్ కాశీ.

వంకాయల సత్యనారాయణ కన్నుమూత



అనేక చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మెప్పించిన సీనియర్ నటుడు వంకాయల సత్యనారాయణ (78) కన్నుమూశారు. శ్వాస సంబంధిత సమస్యతో కొంత కాలంగా బాధపడుతున్న ఆయన సోమవారం విశాఖపట్నంలో తుదిశ్వాస విడిచారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఆయన మొత్తం 180 చిత్రాల్లో నటించారు. 2016లో కూడా 'కారందోశ' సినిమాలో నటించారు. 80వ దశకం ముందు నుంచి ఆయన నటుడిగా కొనసాగుతున్నారు. 1940, డిసెంబర్ 28వ తేదీన విశాఖపట్నంలో జన్మించారు. నటన మీద ఆసక్తితో సినిమా రంగంలోకి వచ్చి పలు చిత్రాల్లో క్యారెక్టరు ఆర్టిస్టుగా నటించారు. తన కెరీర్‌లో దాదాపు 180 సినిమాలు, పలు టీవీ సీరియల్స్‌లో నటించారు. బికామ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన వంకాయల.. 1960 ఆగస్టులో షూటింగ్ కాంపిటీషన్‌లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. చదువు, ఆటల్లో ప్రతిభ కారణంగా హిందుస్థాన్ షిప్‌యార్డులో మంచి ఉద్యోగం వచ్చినా, నటనపై ఉన్న ఇష్టంతో సినిమా రంగంవైపు అడుగులేశారు. 'నీడ లేని ఆడది' సినిమాతో అరంగేట్రం చేసిన సత్యనారాయణ 'సీతామాలక్ష్మి', 'సూత్రధారులు', 'అత్తవారిల్లు', 'శ్రీనివాస కల్యాణం', 'ఊరికిచ్చిన మాట', 'కుక్కకాటుకు చెప్పుదెబ్బ', 'శుభలేఖ', 'శృతిలయలు', 'విజేత' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో ఈయన సహాయ నటుడి పాత్రలో మెప్పించారు. 'వంకాయల జ్యూయలర్స్' పేరుతో వైజాగ్‌లో ఆయన ఓ నగల షాపును కూడా నడుపుతున్నారు.

'సంత' పాటల చిత్రీకరణ



సూర్య భరత్ చంద్ర, శ్రావ్య రావు

సూర్య భరత్ చంద్ర, శ్రావ్యా రావు జంటగా నటిస్తున్న సినిమా 'సంత'. మట్టి మనుషుల ప్రేమకథ అనేది ట్యాగ్ లైన్. శ్రీ సుబ్రమణ్య పిక్చర్స్ పతాకంపై శ్రీ జై వర్దన్ బోయెనేపల్లి నిర్మిస్తున్నారు. నెల్లుట్ల ప్రవీణ్ చందర్ దర్శకుడు. ఓ సంత నేపథ్యంలో ప్రేమకథగా తెరకెక్కుతోంది. ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుగుతోంది. దర్శకుడు ప్రవీణ్ చందర్ మాట్లాడుతూ 'సంత తొలి షెడ్యూల్ పూర్తయింది. ఈ నెల 14 నుంచి మిగిలిన టాకీ పార్ట్, పాటలు చిత్రీకరిస్తాం. హైదరాబాద్, వరంగల్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది. కిన్నెర, మధుమణి, జబర్దస్త్ ఫణి, ప్రసన్న, ఆర్.ఎస్.నందా, దుర్గేష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు : ఎస్.కె.అనీఫ్, డా.పసునూరి రవీందర్, ఫైట్స్ : రవి పాటలు : గోరెటీ వెంకన్న, కాసర్ల శ్యామ్, మౌనశ్రీ మల్లిక్, మాట్లా తిరుపతి.

మహేశ్ ఫ్యాన్స్ కొడతారు

- అనిల్ సుంకర

'మహేష్‌బాబు '1' సినిమా ఒక్కటే విడుదలై ఉంటే మంచి విజయాన్ని చవిచూసేదని, పోటీ చిత్రాలు రావడంతో అనుకున్నంత ఫలితాన్ని పొందలేకపోయాయమని నిర్మాత అనిల్ సుంకర అన్నారు. ఇకపై మహేష్‌తో చిత్రం చేస్తే తప్పకుండా విజయవంతమైన చిత్రాన్నే తీస్తాననీ, లేదంటే అభిమానులు కొడతారని చెప్పారు. ఆయన తాజాగా నిర్మించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. ఈ చిత్రం ఈనెల 16న విడుదలకానుంది. ఈ చిత్రం విశేషాలను సోమవారం ఆయన తెలిపారు.



- కన్నడలో 'కిర్రిక్ పార్టీ' సినిమా చూశాక.. తప్పకుండా రీమేక్ చేయాలనుకున్నాం. అయితే రైట్స్ బాగానే పలికాయి. చివరికి ధైర్యం చేసి అనుకున్నంత పెట్టి రైట్స్‌ను తీసుకున్నాం. తెలుగులో కిరాక్ పార్టీగా పెట్టాం. కిరాక్ అంటే.. జోష్.. అని అర్థం వస్తుంది. ఈ చిత్రం చూశాక ప్రతి విద్యార్థి అంత జోష్‌తో ఉంటాడని నమ్మకంగా చెప్పగలను.
- 'శివ' సినిమా షేడ్స్ ఉంటాయి ఎప్పటికైనా 'శివ' లాంటి సినిమా చేయాలనేది లైఫ్ టైమ్ ఆంబిషన్. ఈ సినిమాలో కూడా చాలా చోట్ల 'శివ' షేడ్స్ ఉంటాయి. స్టూడెంట్ పాలిటిక్స్, యాక్షన్ సీక్వెన్సెస్‌కి చాలా కనెక్ట్ అయ్యాను. 'కిర్రాక్ పార్టీ' రాజు సుందరం డైరెక్షన్‌లో తెరకెక్కాల్సింది. కానీ ఆయన బైలింగ్వల్ చేద్దామన్నాడు. బైలింగ్వల్ అనగానే అంతలా ఫోకస్ చేయలేమోననిపించి వద్దనుకున్నాను. అప్పటికే శరణ్, ఈ సినిమా ప్రాజెక్ట్‌కి పని చేస్తున్నాడు. అంతలో చందూ మొండేటి, సుధీర్ వర్మలిద్దరూ శరణ్‌నే డైరెక్టర్‌గా రికమెండ్ చేశారు. నేను ప్రీ ప్రొడక్షన్ ప్రాసెస్‌లోనే ఎక్కువగా ఇన్వాల్వ్ అవుతాను. ముఖ్యంగా డైలాగ్స్ విషయంలో...ఒక్కోసారి ఒక సీన్‌లో డైలాగ్స్‌కి, నెక్స్ట్ సీన్‌లో డైలాగ్స్‌కి అసలు పొంతన లేకుండా పోతుంటుంది. అలాంటి తప్పులు దొర్లితే చాలా చిరాగ్గా ఉంటుంది. అలాంటప్పుడు చూసుకుంటాను తప్ప సినిమా సెట్స్ పైకి వచ్చాక ఏ మాత్రం ఇన్వాల్వ్ కాను.
- నా సినిమా ఫ్లాపయితే వెంటనే యు.ఎస్. వెళ్ళిపోతాను. సినిమా రిజల్ట్ ఒక రోజు ముందు తెలిసినా, రిలీజ్ తరవాత తెలిసినా కనీసం ప్రెస్‌మీట్‌కి కూడా రాను. నేను ఫెయిల్యూర్‌ని ఫేస్ చేయలేను. అసలు నేను దర్శకుడ్ని అవ్వాలని ఈ రంగంలోకి వచ్చాను. అనుకోకుండా నిర్మాతగా మారాను. 'రాజుగాడు' రిలీజ్ డేట్ సంక్రాంతికి అనుకున్నాం. కానీ అప్పటినుంచి ఏవో సినిమాలు అడ్డంకిగా వచ్చేశాయి. అందుకే ప్రశాంతంగా ఉన్నప్పుడే విడుదల చేయాలని అనుకున్నాం. ఈనెల 18న టీజర్ రిలీజ్ చేస్తున్నాం.
- 'కిరాక్ పార్టీ' లాస్ట్ 25 నిమిషాల్లో ఉండే ఎమోషనల్ సీన్స్ సినిమా మొత్తానికి హైలెట్‌గా నిలుస్తాయి. సినిమా చూస్తున్న ప్రతి ఒక్కరి కళ్ళల్లో నీళ్ళు రావడం ఖాయం. దాంతో పాటు ఇంటర్వెల్ బ్యాంగ్‌కి కూడా ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారు. సినిమాలో ఉండే ప్రతి సీన్‌కి ఒక స్పెషాలిటీ ఉంటుంది.

'అనువంశికత' ప్రభావం ఎంత?



సంతోష్ రాజ్, నేహాదేశ్ పాండే

సంతోష్ రాజ్, నేహాదేశ్ పాండే జంటగా కౌండిన్య మూవీస్ పతాకంపై రమేష్ ముక్కెర దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'అనువంశికత'. తాళ్లపెల్లి దామోదర్ గౌడ్ నిర్మాత. 'జెనిటిక్ లవ్ స్టోరీ' అనేది ఉపశీర్షిక. అశ్విత, క్రాంతి కుమార్ సమర్పకులు. సీనియర్ నటుడు సుమన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా ఆడియో ఆదివారం సాయంత్రం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఆవిష్కరించారు. సుమన్ మాట్లాడుతూ 'రక్త సంబంధీకులను పెళ్లి చేసుకుంటే వచ్చే పరిణామాలు ఎలా ఉంటాయి అనే పాయింట్‌ను ఆధారంగా చేసుకుని దర్శకుడు చక్కగా సినిమా చేశాడు. మంచి సందేశాత్మక చిత్రమిది. పాటల్లో కూడా మంచి సందేశం ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తుంది. కొన్ని సన్నివేశాలు సరిగ్గా రాలేదని మళ్లీ రీ షూట్ కూడా చేశారు. అంటే దర్శక, నిర్మాతలకు సినిమా పట్ల ఎంత ఫ్యాషన్ ఉందో అర్ధమవుతోంది. సినిమా బాగా వచ్చింది. పెద్ద విజయం సాధిస్తుంద'ని అన్నారు.

చిత్ర దర్శకుడు రమేష్ ముక్కెర మాట్లాడుతూ '45 డిగ్రీల వేడిని సైతం లెక్క చేయకుండా నటీనటులు, సాంకేతిక నిపుణులు మంచి సహకారం అందించారు. చక్కటి సందేశం ఇందులో వుందని అన్నారు. హీరో సంతోష్ రాజ్, హీరోయిన్ నేహాదేశ్ పాండే మాట్లాడుతూ, చిత్రం విజయం కావాల'ని ఆకాంక్షించారు.

నవ్వుల 'మిఠాయి'



కమల్ కామరాజు, ప్రియదర్శి

కమల్ కమరాజు, రవివర్మ, రాహుల్ రామకృష్ణ,. ప్రియదర్శి, శ్వేతా వర్మ, భూషణ్ కల్యాణ్, అజయ్ ఘోష్ తదితరులు ప్రధాన తారాగణంగా నటిస్తోన్న డార్క్ కామెడీ (శృంగార హాస్యభరిత) చిత్రం 'మిఠాయి'. రెడ్ యాంట్స్ పతాకంపై ప్రశాంత్ కుమార్ దర్శక నిర్మాణంలో సినిమా రూపొందుతోంది. ప్రత్యేకంగా వికారాబాద్‌లో వేసిన సెట్‌లో ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయ్యింది. అలాగే ఈ సినిమాతో పరిచయం కానున్న అర్ష పోస్టర్‌ను ఈ సందర్భంగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ 'వికారాబాద్‌లో వేసిన స్పెషల్ సెట్‌లో లిబరేషన్ సాంగ్‌ను చిత్రీకరించాం. దీంతో ఫస్ట్ షెడ్యూల్ పూర్తయ్యింది. ఈ నెల 17న సినిమా రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది. 'పెళ్ళిచూపులు' సినిమాకు సంగీతం అందించిన వివేక్ సాగర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం విశేషం. శృంగార హాస్యభరిత జోనర్‌లో విభిన్నమైన క్యారెక్టర్స్ నడుమ సాగే సినిమా ఇది. ఈ చిత్రానికి కెమెరా : రవి వర్మన్. ఎన్ , ఎడిటింగ్ : గ్యారీ.

'డ్రీమ్ బాయ్' షూటింగ్ ప్రారంభం



రాజేష్ కనపర్తి దర్శకత్వంలో, రేణుక నరేంద్ర నిర్మాతగా మాస్టర్ ఎన్ టి రామ్ చరణ్ సమర్పణలో సెవన్ వండర్స్ ఎంటర్టైన్మెంట్స్ బేనర్‌పై తెరకెక్కనున్న చిత్రం 'డ్రీమ్ బాయ్'. తేజ, హరిణి రెడ్డి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ కొట్టగా, మరో నిర్మాత ఏం వి రావు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో ధనరాజ్, రాకేష్, సుఖేష్ రెడ్డి, లడ్డు, ఆర్ట్ డైరెక్టర్ వెంకట్ సన్నిధి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ కనపర్తి మాట్లాడుతూ 'ఇదొక థ్రిల్లింగ్ ఎంటర్టైనర్. ప్రేమతో నిండిన క్యూట్ స్టోరీ ఇది. కొత్త, పాత నటీనటులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నాం. ఆద్యంతం కామెడీతో ఈ చిత్రం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందన్న నమ్మకముంద'ని అన్నారు. చిత్ర నిర్మాత రేణుక నరేంద్ర మాట్లాడుతూ 'కథ ఎంతో నచ్చింది. ఈ రోజు నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ జరుపనున్నాం' అని తెలిపారు.

డా॥ స్పెషలిస్ట్







పసి హృదయం పదిలమే!

ఆడుతూ పాడుతూ స్కూలుకు వెళ్లే పదకొండేళ్ల నిత్య ఆరోజు జ్వరంతో వెళ్లలేకపోయింది. పదిరోజులు గడుస్తున్నా జ్వరం తగ్గలేదు. అమ్మానాన్న నిత్యని హాస్పిటల్‌కి తీసుకెళ్లి డాక్టర్‌కు చూపించారు. జ్వరమైతే తగ్గిందిగానీ, అలసట, ఆయాసం, నీరసం ఆమెను చుట్టుముట్టాయి. సరిగా నడవలేనంత బలహీనంగా మారింది. వాంతులు మొదలయ్యాయి. తిండి తినలేకపోతోంది. నిత్యని మొదట చూపించిన డాక్టర్ దగ్గరకు తీసుకెళ్తే కార్డియాలజిస్ట్‌ని కలవండని చెప్పారు. ఆయన దగ్గరకు వెళ్తే పరీక్షలు చేసి, నిత్య గుండె పనితీరు ఫెయిలయిందని నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులకు దిక్కుతోచలేదు. రెండునెలల పాటు చికిత్స చేయించినా సమస్య పరిష్కారం కాలేదు. అప్పటికే ఎకో పరీక్షలో ఆమె గుండె కేవలం పదిశాతం మాత్రమే పనిచేస్తోందని తేలింది. ఇంతలో బ్రెయిన్ డెత్ అయిన పన్నెండేళ్ల బాలిక గుండె దొరికింది. దానిని అమర్చి.. నిత్యని కాపాడారు డాక్టర్లు. వైరల్ ఇన్ఫెక్షన్‌తో వచ్చిన జ్వరమే నిత్య గుండె విఫలం కావడానికి కారణమైంది. పుట్టుకతో లోపాలవల్లా చిన్నారుల్లో గుండె సమస్యలు ఏర్పడతాయి. పిల్లలకు వచ్చే గుండె సమస్యలు, వాటి నిర్ధారణ, చికిత్సల విశేషాలు ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్' లో


గుండెజబ్బులు పెద్దవారికి మాత్రమే వస్తాయని ఇప్పటికీ చాలా మందిలో అపోహ ఉంది. కానీ చిన్నపిల్లల్లోనూ గుండె సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. అప్పుడే పుట్టిన శిశువు మొదలుకుని, ఐదేళ్ల వయసులోనూ పిల్లలకు గుండెసమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. ఈ దేశంలో ప్రతి వెయ్యిమంది శిశువులకు ఎనిమిది మంది గుండెజబ్బులతో బాధపడుతున్నవారే.

కొందరు పిల్లల్లో గర్భంలో ఉన్నప్పుడే గుండెలో నిర్మాణాత్మక లోపాలు ఏర్పడతాయి. ఉదాహరణకు హైపోప్లాస్టిక్ లెఫ్ట్ హార్ట్ సిండ్రోమ్. ఎడమ కర్ణిక, జఠరిక, మహాధమని (అయోర్టా)ను కలిపి లెఫ్ట్ హార్ట్ అంటారు. ఈ సమస్య ఉన్నప్పుడు ఎడమ జఠరిక చిన్నగా అవుతుంది. అయోర్టా సన్నబడుతుంది. సాధారణంగా అయోర్టా 4–5 మి.మీ. మందం ఉండాలి. కానీ ఈ సమస్య వల్ల 1–2 మి.మీ. మాత్రమే ఉంటుంది. తద్వార గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గుతుంది. ఫలితంగా శరీర భాగాలకు రక్తం తగినంత అందదు. ఇది నెమ్మదిగా కార్డియోమయోపతికి దారితీస్తుంది. కొందరిలో పుట్టుకతోనే కార్డియోమయోపతిక్ గుండె ఉండవచ్చు.

కారణాలు

చిన్నారులలో గుండె సమస్యలకు రకరకాల కారణాలున్నాయి.

- వంశపారంపర్యంగా కొన్నిరకాల గుండె వ్యాధులు పిల్లలకు సంక్రమిస్తున్నాయి.
- తల్లి కడుపులో పిండదశలో ఉన్నప్పుడు వేరే కారణాలతో ఫిట్స్, బిపి, షుగర్, థైరాయిడ్ వంటివాటికి మందులు వాడడం వల్ల వస్తున్నాయి.
- గర్భిణీకి మద్యపానం, పొగతాగే అలవాట్లుంటే పుట్టిన శిశువుకు గుండె సంబంధ సమస్యలు కలుగుతున్నాయి.
- గర్భిణీకి బిపి, షుగర్, ఫిట్స్, ఎపిలెప్సీ వంటి వ్యాధులు ఉన్నప్పటికీ అవి నియంత్రణలో లేకపోవడం వల్ల శిశువు గుండె బలహీనమైపోతుంది.
- గర్భం ధరించిన తొలి మూడునెలల్లో రేడియేషన్, ఆల్ట్రావైలెట్ కిరణాలు సోకినా ప్రతికూల ప్రభావం పడుతుంది. అది గుండె ఎదుగుదల, పనితీరుని దెబ్బతీస్తుంది.
- లోపభూయిష్టమైన జన్యువులు వంశపారంపర్యంగా బదిలీ కావడం వల్ల గుండె నిర్మాణంలో లోపాలు ఏర్పడతాయి.
- జన్యువుల్లో మార్పుల వల్ల ఏర్పడే సిండ్రోమ్స్. టర్నర్స్, క్లిన్‌ఫెల్టర్, డౌన్స్ సిండ్రోమ్ లాంటివి ఈ కోవలోకే వస్తాయి. ఈ వ్యాధులున్న వాళ్లలో గుండె నిర్మాణంలో లోపాలుంటాయి.
- తల్లిదండ్రుల వయసు. 35 ఏళ్లకు పైబడితే గుండెలోపాలున్న పిల్లలు పుట్టే అవకాశం ఎక్కువగా ఉంటాయి
- ప్రెగ్నెన్సీలో రుబెల్లా ఇన్‌ఫెక్షన్‌వల్ల కాంజెనిటల్ రుబెల్లా సిండ్రోమ్ ఉండే గుండె సమస్యలున్న శిశువులు పుడతారు.
- తల్లిలో ఫోలిక్ ఆమ్లం లోపించడంవల్ల కూడా గుండె సమస్యలతో శిశువు జన్మించే అవకాశముంది.



లక్షణాలు

శిశువులలో ఎక్కువగా పాలు తాగే విధానంలో ఇబ్బందులు పడతారు. పాలు తాగేటప్పుడు ఆయాసం, విడిచి విడిచి త్రాగడం వంటి సమస్యలు, శరీరం నల్లగా లేదా నీలం రంగులో మారడం, వయస్సుకి తగిన విధంగా బరువు లేకపోవడం కనిపిస్తుంది. చిన్న పిల్లల్లో పరుగెత్తినప్పుడు, పడుకున్నప్పుడు ఆయాసం, ప్రతిసారి దగ్గు, ఇన్ఫెక్షన్ రావడం వంటి లక్షణాలు చిన్నారులలో గుండె జబ్బులు ఉన్నప్పుడు కనిపిస్తాయి.

రకాలు

చిన్నారుల్లోని గుండె వ్యాధులను రెండు రకాలుగా వర్గీకరించొచ్చు అవి– పుట్టుకతో వచ్చే గుండెజబ్బు (కాంజెంటియల్ హార్ట్ డిసీజెస్), సంక్రమించిన గుండె వ్యాధులు (రుమాటిక్ హార్ట్ డిసీజెస్)

పుట్టుకతో వచ్చే గుండెజబ్బు

దేశంలోని ఒక శాతం మంది పిల్లలు పుట్టుకతోనే గుండె లోపాలతో ఉంటున్నారు. వీరిని వైద్య పరిభాషలో 'బ్లూ బేబీస్'గా సూచిస్తారు. ఒకప్పుడు దీనికి ఎలాంటి నివారణా చికిత్స లేదు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా వైద్య విజ్ఞాన పరిశోధనల్లో భాగంగా ఇలాంటి శిశువులకు శస్త్ర చికిత్సలు జరిపి, మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

ఈ వ్యాధి శిశువు గుండె, నాళాల నిర్మాణంలోని లోపాల వల్ల కలుగుతుంది. ఈ రకం గుండె వ్యాధులను లక్షణాలతో గుర్తించలేరు. అలాంటి సమయంలో డాక్టర్ మాత్రమే దీనిని నిర్ధారిస్తారు. అయితే తల్లిదండ్రులు తమ శిశువులో ...పాలు తాగడంలో ఇబ్బంది, మితిమీరిన చెమట పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడం, పెదవులు, కాళ్లు చేతుల వేళ్లు నీలం రంగులోకి మారడం. ఎదుగుదల సరిగా లేకపోవడం.. తరచూ ఛాతీ భాగాలలో ఇన్ఫెక్షన్లు రావడం వంటి లక్షణాలను గమనిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించాలి.

సంక్రమించిన గుండె వ్యాధులు (రుమాటిక్ హార్ట్ డిసీజెస్)

రుమాటిక్ గుండెవ్యాధులు పాఠశాలకు వెళ్లే పిల్లలలో సర్వసాధారణం. స్ట్రెప్టోకాకస్ అనే బాక్టీరియా వల్ల స్ట్రెప్ గొంతు ఇన్ఫెక్షన్ ద్వారా ఇవి విస్తరిస్తాయి. స్ట్రెప్టోకోకై బ్యాక్టీరియా గుండె కండరాలను పోలినటువంటి ఒక జన్యుపరమైన ఆకృతితో ఉంటుంది. దీంతో శరీర రక్షణవ్యవస్థ బ్యాక్టీరియాకు, గుండె కండరాలకు మధ్య తేడాలను గుర్తించలేదు. ఒకదానికి బదులుగా మరోదానిపై దాడులు చేస్తుంది. ఇది ముఖ్యంగా గుండె కవాటాలు, గుండె కండరాలను లక్ష్యంగా దాడిచేస్తుంది. దీనివల్ల గుండె పనితీరు దెబ్బతింటుంది.

రుమాటిక్ జ్వరం విలక్షణ స్థాయిలో మొదలవుతుంది. దీనిద్వారా గుండె వ్యాధులు తీవ్రమౌతాయి. ఐదేళ్ల వయసు నుంచి 18 సంవత్సరాల వరకూ దీనివల్ల గుండెజబ్బుల బారిన పడినవారున్నారు.

పూర్తిగా ఆరోగ్యంగా ఉన్న పిల్లలపై ఈ వ్యాధి ప్రభావాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. రుమాటిక్ గుండె వ్యాధి యొక్క సాధారణ లక్షణాలు కీళ్ల మంటలతో వాపు, సున్నితత్వం, కీళ్ళ చుట్టూ ఎర్రబారటం, చిన్న, కఠినమైన కణితులు, చర్మం కింద గుండ్రటి గడ్డలు ఏర్పడటం, పిల్లల న్యూరో మస్కులర్ కదలికల్లో మార్పులు, శరీరంపై దద్దుర్లు, జ్వరం, అసాధారణ బరువు క్షీణత, ఆయాసం, తరచుగా కడుపులో నొప్పి ఉంటాయి. అయితే ఇవి వైరల్ జ్వరంతో కూడా ఏర్పడొచ్చు. అందువల్ల అది సాధారణ గొంతు ఇన్ఫెక్షనో లేదా రుమాటిక్ గుండెవ్యాధో తెలుసుకోవడానికి డాక్టర్‌ని సంప్రదించాలి. ఈ వ్యాధిబారిన పడిన పిల్లలకు కవాటాన్ని మార్చే అవసరం ఏర్పడవచ్చు. దీనిని సరైన సమయంలో చికిత్స చేయకపోతే కూడా ప్రాణాంతకంగా మారవచ్చు.

నిర్ధారణ

చిన్నారులలో గుండె సమస్యలు నిర్ధారించడానికి ముఖ్యంగా ఇసిజి, ఎక్స్‌రే, ఎకో కార్డియోగ్రామ్ పరీక్షలు నిర్వహించాలి. వీటి ద్వారా తొంభై శాతం వ్యాధి నిర్ధారణ అవుతుంది. కొన్ని అసాధారణ పరిస్థితులలో వ్యాధి నిర్ధారణ కాకపోతే సిటి స్కాన్, ఎంఆర్‌ఐ, ఏంజియోగ్రామ్ పరీక్షలు చేస్తారు.

తల్లి కడుపులో ఉన్నప్పుడే గుండె పరీక్ష

నేటి ఆధునిక సాంకేతిక విధానంలో ఫీటల్ ఎకో కార్డియోగ్రామ్ ద్వారా తల్లి గర్భంలో పిండం ఐదు నెలల వయస్సు ఉన్నప్పుడే గుండె సంబంధిత సమస్యలను గుర్తించవచ్చు. దీని వలన సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవచ్చు. కుటుంబంలో రిస్కు ఉంటే తప్పనిసరిగా ఫీటల్ ఎకోకార్డియోగ్రామ్‌తో పరీక్షను పీడియాట్రిక్ కార్డియాలజిస్టు మాత్రమే చేయించాలి.



ముందుగానే లోపాలను తెలుసుకోవడం ద్వారా పుట్టిన వెంటనే అవసరమైన చికిత్స అందించడమో.. లేక గర్భస్రావం చేయించుకోవడమో చేయవచ్చు. చాలావరకూ పుట్టుకతో వచ్చే గుండెజబ్బులను నయం చేయవచ్చు. కొన్ని సందర్భాల్లో మాత్రమే గుండె మార్పిడి అవసరం అవుతుంది.

చికిత్స

చిన్నారుల గుండె సమస్యల్లో నూటికి 70 శాతం గుండెలో రంధ్రాలు, కొన్నిరకాల రిథమ్ సమస్యలు మందులతో నివారించవచ్చు. శిశువు సరైన బరువు లేని సమయంలో కొంతకాలం మెడికల్ థెరపీ ద్వారా వైద్యం చేసి, తగిన బరువు పెరిగిన తర్వాత అవసరమైన వైద్యం చేయించాలి.

ఏంజియోగ్రామ్ విధానంలో గుండె సంబంధిత సమస్యలు ఎఎస్‌డి, విఎస్‌డి, పిడిఎ వంటి రంధ్రాలను డివైస్ (బటన్) పద్ధతిలో శాశ్వతంగా నయం చేయొచ్చు. వాల్స్‌కు ఆటంకంగా ఉన్న (పల్మనరీ వాల్వ్ అటమ్స్, అయోటిక్ వాల్వ్ అటమ్స్) అడ్డుగోడలను తొలగిస్తారు. పుపుస, బృహత్ ధమనులలో ఉన్న అడ్డంకులను స్టంట్ పద్ధతి ద్వారా తొలగించొచ్చు. గుండె కొట్టుకునే వేగం తక్కువగా ఉన్న సమయంలో ఫేస్ మేకర్ పద్ధతి ద్వారా చికిత్స చేస్తారు. కొన్నిరకాల గుండె సమస్యలకు బైపాస్ సర్జరీ చేయాల్సి ఉంటుంది.

మార్పిడి.. పనితీరు

చిన్నారులకు గుండె మార్పిడి చాలా అప్రమత్తంగా చేయాలి. గుండె మార్పిడికి వయసు, గుండె పరిమాణం, శరీర బరువు అనేవి చాలా ముఖ్యం. బరువులో 10 –15 శాతం తేడా ఉన్నా, సైజులో 10 శాతం తేడా ఉన్నా గుండెమార్పిడికి గుండెను స్వీకరించవచ్చు. చిన్న పిల్లలకు పెద్దవాళ్ల గుండె పెట్టరాదు. ఎందుకంటే గుండె ఉంచాల్సిన కుహరం పిల్లల్లో చిన్నదిగా ఉంటుంది.

గుండెలో పైన రెండు కర్ణికలు, కింద రెండు జఠరికలు ఉంటాయి. కుడి వైపు ఉండే కర్ణిక జఠరిక లోకి తెరుచుకుంటుంది. కుడి జఠరిక నుంచి పల్మనరీ ఆర్టరీ ఊపిరితిత్తులకు వెళ్తుంది. శరీర భాగాలన్నింటి నుంచి రక్తం కుడి కర్ణికలోకి, దాన్నుంచి కుడి జఠరికలోకి చేరుతుంది. కుడి జఠరిక ఈ డీక్సిజినేటెడ్ రక్తాన్ని పల్మనరీ ఆర్టరీలోకి పంపు చేస్తుంది. ఊపిరితిత్తుల్లో ఈ రక్తం శుద్ధి అయి ఆక్సీజినేటెడ్ రక్తంగా మారుతుంది. రెండు ఊపిరితిత్తుల నుంచి రెండు పల్మనరీ సిరలు మంచి రక్తాన్ని ఎడమ కర్ణిక లోకి తెస్తాయి. అక్కడి నుంచి అది ఎడమ జఠరికలోకి చేరుతుంది. ఎడమ జఠరిక అయోర్టా (మహాధమని)లోకి రక్తాన్ని పంపు చేస్తుంది. ఇది చిన్న చిన్న రక్తనాళాలుగా విడిపోయి శరీరానికి రక్తాన్ని సరఫరా చేస్తుంది. వీటిలో ఎక్కడైనా అడ్డంకు ఏర్పడితే రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడి, ఎక్కువ పీడనంతో గుండె రక్తాన్ని పంపు చేయాల్సి వస్తుంది. దాంతో క్రమంగా కండరం బలహీనమౌతుంది. ఇలాంటి పరిస్థితుల్లో క్రమంగా దాని పంపింగ్ సామర్థ్యం తగ్గిపోతుంది. ఇది పది శాతానికి పడిపోతే గుండె మార్పిడి తప్పనిసరి అవుతుంది. చిన్నారుల గుండె మార్పిడిలో ఈ పనితీరుని క్షుణ్ణంగా పరిశీలించాలి.





డాక్టర్ పి రమేష్‌బాబు
ఎం.డి.డి.ఎమ్ (కార్డియాలజీ),
డాక్టర్ రమేష్ హాస్పిటల్స్,
రింగ్‌రోడ్,
విజయవాడ.



చిన్నారి

జోక్:

రవి : మా టీచర్‌కి దైవభక్తి చాలా ఎక్కువ నాన్నా..

తండ్రి : నీకెలా తెలుసు?

రవి : నేను చెప్పే ఏ సమాధానానికైనా 'ఓ మై గాడ్' అంటుంది నాన్నా!

పొడుపు కథ

చుట్టూ సముద్రం ఉండి..
మధ్యలో భూభాగముండి..
ఉదాహరణకు శ్రీలంకండి..
ఇలాంటి వాటిని ఏమంటారండీ?

జవాబు : ద్వీపం

చుక్కలు కలపండి!



పిల్లలూ..! పక్కనున్న బొమ్మలోని చుక్కలను కలిపి రంగులు వేయండి!

రాత్రిపూట పూసే మొక్కలు



కొన్ని జంతువులు, కీటకాలు, ఇతర ప్రాణులు పగటిపూట విశ్రాంతి తీసుకొని, రాత్రిపూట సంచరిస్తుంటాయి. అలాగే కొన్ని మొక్కలు రాత్రివేళ మాత్రమే పూలు వికసిస్తాయి. ఇటువంటి మొక్కలను 'రాత్రుల్లో వికసించే మొక్కలు' అంటారు. రేరాణి పువ్వులు కూడా ఈ తరగతికి చెందినవే. రాత్రి పూలు పూసే మొక్కలు హానీసకల్ నైట్‌షేడ్ కుటుంబానికి చెందినవి. రేరాణి పువ్వులు రాత్రిపూటే ఎందుకు వికసిస్తాయో మీకు తెలుసా? రాత్రివేళ పూసే పూలు మధురమైన వాసన కలిగి ఉంటాయి. ఈ సువాసనకు తుమ్మెదలు చెట్టు దగ్గరకు చేరతాయి. ఈ కీటకాలు పువ్వు మీద వాలినప్పుడు వాటి కాళ్ళకు, రెక్కలకు పుప్పొడి అంటుకుంటుంది. ఇవి ఎగిరి.. ఇదే జాతికి చెందిన మరో పువ్వు మీద వాలినపుడు పుప్పొడి వాటిమీద రాలుతుంది. దీనిని పరాగసంపర్కం అంటారు. దీనివలన పువ్వు విత్తనంగా మారుతుంది. రేరాణి పూలు పరాగసంపర్కం కోసం కీటకాలను ఆకర్షించటానికే రాత్రివేళ వికసిస్తాయి.



పువ్వుల నుంచి పళ్ళు, పళ్ళ నుంచి విత్తనాలు తయారవుతాయి. మళ్ళీ ఈ విత్తనాల నుంచే కొత్త మొక్కలు పుడతాయి. పగటివేళ ఉండే ఎక్కువ ఉష్ణోగ్రతను, కాంతిని భరించలేని మొక్కలు రాత్రులలో పువ్వులను పూస్తాయి. రేరాణి మొక్క కూడా పగటి ఉష్ణోగ్రతను తప్పించుకోవటానికే రాత్రివేళ పూలు పూస్తుంది. వీటి గురించి గమనించే మరో ముఖ్య విషయం ఉంది. ఈ మొక్కల పూలకు ఆకర్షణీయమైన రంగులుండవు. రాత్రి చీకటిలో రంగులు కనపడవు కాబట్టి.. వీటికి రంగులుండవు. రేరాణి పువ్వులు తెల్లగానే ఉంటాయి. అయితే ఇవి వాసనతోనే కీటకాలను ఆకర్షించగలవు.



★

నేను గీసిన బొమ్మ





పి. శ్రీలాస్య
8వ తరగతి, ఎట్కిన్‌సన్ హైస్కూల్,
విజయవాడ.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

రాణించిన శార్దూల్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఠాకూర్ 4/27

టీమిండియాకు మరో విజయం
లంకతో ముక్కోణపు టీ20

కొలంబో: నిదహాస్ ముక్కోణపు టీ20 సిరీస్‌లో భారతజట్టు సోమవారం మరో విజయాన్ని నమోదు చేసుకుంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 19 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని టీమిండియా 17.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి సాధించింది. భారతజట్టు ఓపెనర్లు రోహిత్ శర్మ (11), శిఖర్ ధావన్ (8) నిరాశపరిచినా... సురేష్ రైనా (27), కెఎల్ రాహుల్ (18)లు జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. అనంతరం ఐదో వికెట్‌కు మనీష్ పాండే (42), దినేష్ కార్తీక్ (39)ల జోడీ 68 పరుగులు సాధించి టీమిండియాకు విజయాన్నందించారు. తొలుత భారతజట్టు బౌలర్ శార్దూల్ ఠాకూర్ 27 పరుగులకు 4 వికెట్లు, వాషింగ్టన్ సుందర్ 21 పరుగులకు 2 వికెట్లు పడగొట్టి లంక జట్టు భారీ స్కోర్ చేయకుండా నిరోధించారు. శ్రీలంక జట్టులో అత్యధికంగా కుశాల్ పెరీరా 55 (3 ఫోర్లు, 3 సిక్సర్లు), ఉపుల్ తరంగ 22 పరుగులు మాత్రమే చేశారు.

ఇప్పటికే మూడు జట్లు ఒక్కో మ్యాచ్‌లో ఒక్కో విజయం సాధించడంతో ఈ మ్యాచ్ భారత్-శ్రీలంక జట్లకు కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు ఫైనల్ బెర్త్ దాదాపు ఖరారైనట్లే. అయితే వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమవ్వడంతో ఆటను 19 ఓవర్లకు కుదించారు. శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా శ్రీలంక సారథి దినేష్ చండీమాల్‌పై ఐసీసీ రెండు మ్యాచ్‌ల నిషేధం పడింది. దీంతో సారథ్య బాధ్యతలను తిషారా పెరీరాకు లంక బోర్డు అప్పగించింది. చండీమాల్ స్థానంలో సురంగా లక్మల్‌ను తుది జట్టులోకి తీసుకోగా... భారత్ జట్టులో రిషబ్ పంత్ స్థానంలోకి కేఎల్ రాహుల్ వచ్చి చేరాడు. ఈ టోర్నీలో ఇప్పటి వరకైతే భారత్ బ్యాటింగ్ ఫర్వాలేదనిపించినా... రోహిత్ శర్మ ఫామ్ కలవరపరుస్తోంది.

పెరీరాకు సారథ్య బాధ్యతలు

శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్‌రేట్ కారణంగా రిఫరీ లంక జట్టు సారథి దినేశ్ చండీమాల్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం.. ఆటగాళ్లందరి మ్యాచ్ ఫీజులో 60 శాతం కోత విధించిన సంగతి తెలిసిందే. దీంతో లంక సారథ్య బాధ్యతలను సహచర ఆటగాడు థిసారా పెరీరాకు శ్రీలంక బోర్డు అప్పగించింది.

వర్షం అంతరాయం

తొలుత టాస్ వేసే సమయానికి వర్షం పడటంతో మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో నిర్ణీత సమయానికి తెలికపాటి జల్లులు పడడంతో పిచ్‌ను కవర్లతో కప్పి ఉంచారు. పలుమార్లు పడ్డ చిరుజల్లులు కారణంగా అవుట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది.

బాంబ్రీ సంచలనం



ఇండియన్ వేల్స్‌లో 12వ సీడ్‌పై గెలుపుతో మూడో రౌండ్‌లోకి...

ఇండియన్ వేల్స్ : భారత్‌కు చెందిన టెన్నిస్ యువ సంచలనం, డేవిస్‌కప్ స్టార్ ఆటగాడు యుకి బాంబ్రీ(25) ఇండియన్ వేల్స్‌లో సంచలన విజయం నమోదు చేశాడు. సోమవారం టోర్నీలో భాగంగా రెండోరౌండ్‌లో 12వ సీడ్ లూకాస్(ఫ్రాన్స్)తో తలపడి 6-4, 6-4 సెట్ల తేడాతో ఘన విజయం సాధించాడు. ఈ విజయంతో బాంబ్రీ కెరీర్‌లో మరో సంచలన విజయం వచ్చి చేరినట్లయ్యింది. అనంతరం బాంబ్రీ మూడో రౌండ్‌లో అమెరికా పొడగరి అయిన 21వ సీడ్ శామ్ క్వేరీతో ముఖాముఖి తలపడనున్నాడు. లూకాస్‌తో తలపడిన బాంబ్రీ గంట 19 నిమిషాల పోరాటంలో ఈ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. బాంబ్రీ 2014 చెన్నై ఓపెన్‌లో సైతం 16వ సీడ్ ఫోబియో ఫోగ్నిని సైతం ఓడించిన సంగతి తెలిసిందే. ఇండియన్‌వేల్స్ రెండో రౌండ్‌లో విజయం సాధించాడో బాంబ్రీకి 45 ర్యాంకింగ్స్ మ్యాచ్ పాయింట్లతో పాటు... 47,170 డాలర్ల ప్రైజ్‌మనీ లభించనుంది. ఈ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బొప్పన్న జోడీ తొలిరౌండ్‌లో ఓడిన విషయం తెలిసిందే.

ప్రపంచకప్ అర్హత టోర్నీ

- జింబాబ్వే-స్కాట్లాండ్ మ్యాచ్ టై

బులవయో (జింబాబ్వే) : ప్రపంచకప్ అర్హత టోర్నీలో భాగంగా సోమవారం జింబాబ్వే-స్కాట్లాండ్‌ల మధ్య జరిగిన చివరి మ్యాచ్ టైగా ముగిసింది. జింబాబ్వే 46.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌట్ కాగా... అనంతరం బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 49.1 ఓవర్లలో 210 పరుగులే చేసింది. స్కాట్లాండ్ 8 వికెట్ల నష్టానికి 207 పరుగులతో పటిష్టంగా ఉన్న దశలో 3 పరుగుల వ్యత్యాసంలో రెండు వికెట్లను చేజార్చుకొని మ్యాచ్‌ను డ్రాగా ముగించాల్సి వచ్చింది. గ్రూప్-ఎ నుండి ఇరుజట్లకు 7 పాయింట్లు ఉన్నా జింబాబ్వేకు అగ్రస్థానం... స్కాట్లాండ్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, హాంకాంగ్ జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గ్రూప్-బిలో అగ్రస్థానంలో విండీస్, తర్వాతి స్థానాల్లో ఐర్లాండ్, యుఎఇ, నెదర్లాండ్, పప్పున్యూగేనియాలు ఉన్నాయి. మార్చి 15 నుండి నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి.

అగ్రస్థానంలో భారత్

- ముగిసిన ప్రపంచకప్ షూటింగ్ పోటీలు

న్యూఢిల్లీ : మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ సీనియర్ షూటింగ్ ప్రపంచకప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు భారత్ మూడు విభాగాల్లో పాల్గొన్నప్పటికీ ఒక పతకం కూడా సాధించలేకపోయింది. మొత్తంమీద భారతబృందం నాలుగు బంగారు, ఒక రజిత, నాలుగు కాంస్య పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. మెక్సికో బృందం ఒక్క పతకం కూడా సాధించకపోవడం గమనార్హం.

తొలి వన్డేలో మహిళాజట్టు పరాజయం

వడోదరా : తొలి వన్డేలో ఆస్ట్రేలియా మహిళలతో తలపడిన భారత మహిళాజట్టు ఓటమి చవిచూసింది. సోమవారం ఆసీస్‌తో తలపడిన భారత మహిళలు 8 వికెట్ల తేడాతో పరాజయం చెందారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా మహిళా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం ఆస్ట్రేలియా జట్టు సమష్టిగా రాణించి తొలి వన్డేలో శుభారంభం చేసింది. భారత్ నిర్దేశించిన 201 పరుగుల విజయ లక్ష్యాన్ని 32.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆసీస్ ఓపెనర్ నికోల్ బాల్టన్(100 నాటౌట్ (101 బంతుల్లో 12 ఫోర్లు) అజేయ శతకంతో రాణించి జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించింది. ఆమెకు జతగా అలీస్సా హేలీ(38), మెగ్ లాన్నింగ్(33), ఎల్సీ పెర్రీ(25 నాటౌట్)లు సమయోచితంగా బ్యాటింగ్ చేయడంతో ప్రత్యర్థి జట్టు ఘన విజయం సాధించింది. ముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత మహిళా జట్టు 50 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. పూనమ్ రౌత్(37), సుష్మా వర్మ(41), పూజా వస్త్రాకర్(51)లు మాత్రమే ఆకట్టుకోవడంతో భారత జట్టు స్వల్ప స్కోరుకే పరిమితమైంది. ఆసీస్ బౌలర్లలో జోనాసన్ నాలుగు వికెట్లు, వెల్లింగ్టన్ మూడు వికెట్లు సాధించారు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్‌లో పర్యటించిన ఆసీస్ మహిళాజట్టు తొలి విజయం సాధించి 1-0 ఆధిక్యత సంపాదించింది.

రఫ్ఫాడించిన రబాడ

రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా విజయం



రబాడ 6 వికెట్లు

పోర్ట్‌ఎలిజబెత్: దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సోమవారం ఆసీస్ నిర్దేశించిన 101 పరుగుల లక్ష్యాన్ని సఫారీలు 4 వికెట్లు మాత్రమే కోల్పోయి సాధించారు. ఓవర్‌నైట్ స్కోర్ 5 వికెట్ల నష్టానికి 180 పరుగులతో నాల్గోరోజు ఆటను ప్రారంభించిన కంగారులజట్టు మరో 59 పరుగులు మాత్రమే జతచేసి మిగిలిన ఐదు వికెట్లు కోల్పోయింది. దీంతో సఫారీలకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతపోను 101 పరుగుల స్వల్ప లక్ష్యం మాత్రమే మిగిలింది. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టిన సఫారీ బౌలర్ రబాడ... రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లను సాధించాడు. దీంతో ఆసీస్‌పై ఆ జట్టు తరపున ఒక టెస్టు మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టిన మూడో బౌలర్‌గా ఘనత సాధించాడు. ఇప్పటికే స్టెయిన్(5), ఎన్తినీ(4)లు ఆసీస్‌పై ఈ ఫీట్ సాధించి ఉన్నారు. ఈ విజయంతో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచారు. మూడో టెస్ట్ కేప్‌టౌన్‌లో మార్చి 22నుండి ప్రారంభం కానుంది.

దుబాయిలో షమీ?

విచారణ ముమ్మరం చేసిన కోల్‌కతా పోలీసులు



కోల్‌కతా : టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమీ దుబాయ్‌లో ఉన్నట్లు తెలిసింది. సోమవారం కలకత్తా పోలీసులు షమీ దుబాయ్‌కు ఎందుకు వెళ్లాడనే విషయమై బీసీసీఐ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. భార్య హసిన్ జహాన్ సంచలన ఆరోపణల నేపథ్యంలో కోల్‌కతా పోలీసులు షమీ దుబాయ్ ఎందుకు వెళ్లాడనే విషయమై ఆరా తీయడంతో పాటు... మ్యాచ్ ఫిక్సింగ్‌కు ఏమైనా సహకరించాడా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఈ వివాదాల కారణంగా షమీ ఇప్పటికే బీసీసీఐ ఇచ్చే వార్షిక వేతనాల కాంట్రాక్ట్... ఐపీఎల్‌లోనూ ఆడటం అనుమానంగా మారింది.

ఐపిఎల్ అంపైర్ పార్టనర్‌గా పేటీఎం



న్యూఢిల్లీ : టీమిండియా టైటిల్ స్పాన్సర్ డిజిటల్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్ (పేటీఎం) మరో గోల్డెన్ ఛాన్స్ కొట్టేసింది. రానున్న ఐదేళ్లపాటు ఐపీఎల్ అంపైర్ పార్ట్‌నర్‌గా వ్యవహరించే అవకాశం ఆ సంస్థకు దక్కింది. ఈ విషయాన్ని పేటీఎం సీఈఓ విజయ్ శేఖర్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎల్‌లో భాగస్వాములవ్వడం ఆనందంగా ఉందని, రానున్నకాలంలో బీసీసీఐతో పాటు ఐపిఎల్‌లో కూడా తమకు అవకాశం దక్కడం అదష్టంగా భావిస్తున్నామంటూ హర్షం వ్యక్తం చేశారు. దీనిద్వారా బీసీసీఐతోపాటు పేటీఎంకూడా లాభపడుతుందని ఆ ప్రకటనలో తెలియజేశారు. ఇదే విషయాన్ని ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా సైతం అధికారికంగా ధృవీకరించారు. ఐపీఎల్-2018 సీజన్ ఏప్రిల్ 7న నుండి ప్రారంభం కానున్న విజయం తెలిసిందే.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రజక వృత్తిదారుల సమస్యల్ని పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు కోరారు. సోమవారం శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. చైర్మన్ ఎన్ఎండి ఫరూక్‌కు ప్రత్యేక ప్రస్తావనను అందజేశారు. రాష్ట్రంలో రజక వృత్తిదారులు సామాజిక దాడులకు, గ్రామ బహిష్కరణలకు గురవుతున్నారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం విజయవాడలోని ధర్నా చౌక్‌లో మూడు రోజుల పాటు నిరాహార దీక్షలు చేపట్టిందని వివరించారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించి, 90శాతం సబ్సిడీతో రుణాలివ్వాలని కోరారు. 50ఏళ్లు నిండిన వారికి పెన్షన్ సదుపాయాన్ని వర్తింపచేయాలని, ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టుల్ని శాశ్వత ప్రాతిపదికపై భర్తీ చేయాలని కోరారు. రజకుల వృత్తి చెరువులపై వారికి పూర్తి హక్కుల్ని కల్పించాలని, వృత్తిదారులందరికీ ప్రత్యేక బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు.

నీటి ప్రాజెక్టులకు బడ్జెట్ రివైజ్ చేయాలి: పిడిఎఫ్ ఎమ్మెల్సీ శ్రీనివాసులు రెడ్డి

హంద్రీనీవా, గాలేరు -నగరి, వెలుగొండ ప్రాజెక్టులకు బడ్జెట్ రివైజ్ చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ వై శ్రీనివాసులు రెడ్డి కోరారు. సోమవారం శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. చైర్మన్ ఎన్ఎండి ఫరూక్‌కు ప్రత్యేక ప్రస్తావనను అందజేశారు. హంద్రీనీవా పూర్తి చేయడానికి రూ.2,300కోట్లు అవసరం కాగా రూ.524కోట్లు, గాలేరు నగరికి రూ.845.15 కోట్లు అవసరం కాగా రూ.432కోట్లు, ప్రకాశం జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టుకు రూ.1,500కోట్లు ఇవ్వాల్సి ఉండగా రూ.334కోట్లు కేటాయించారని వివరించారు.

అవసరం మేరకు పోలవరానికి నిధులు

కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నాబార్డు కింద దీర్ఘకాల నీటిపారుదల నిధి(ఎల్‌టిఐఎఫ్) ద్వారా నిధులిస్తున్నామని కేంద్ర జలవనరుల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పేర్కొన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపి కెవిపి రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి మేఘ్వాల్ రాతపూర్వక సమాధానమిచ్చారు. పోలవరం నిర్మాణానికి 2010-11 ధరల సూచీ ప్రకారం రూ.16,010.45 కోట్లు అంచనా వేశామని, అందులో నీటి పారుదల భాగం రూ.12,294.40 కోట్లు అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.2014 మార్చి 31 వరకు రూ5,135.37 కోట్లు వ్యయం చేసిందని, అందులో వేగవంతమైన నీటిపారుదల ప్రయోజనాల కార్యక్రమం(ఎఐబిపి) కింద కేంద్ర సహాయం(సిఎ) రూ.562.47 కోట్లు విడుదల చేశామని తెలిపారు. పైన పేర్కొన్న అంచనా వ్యయం ప్రకారం 01.04.2014 నాటికి రూ.7,158.53 కోట్లు నీటిపారుదల విభాగంలో ఇవ్వాల్సిందని ఉందని తెలిపారు. ప్రాజెక్టు అవసరాల ప్రకారం నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నామని వివరించారు. కేంద్ర సహాయం కింద 2014 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు రూ.5,364.16 కోట్లు విడుదల చేశామని, అందులో భాగంగానే ఎల్‌టిఐఎఫ్ ద్వారా 2016-17లో రూ.2414.16 కోట్లు, 2017-18లో రూ.2000 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.5,8319.06కోటు (2013-14 ధరల సూచీ) సవరించిన అంచనా వ్యయాన్ని కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి)కి సమర్పించిందని, ఈ అంచనా వ్యయాలను కేంద్ర జల సంఘం పరిశీలించిన తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలియజేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల సమాచారం ప్రకారం పోలవరం ప్రాజెక్టు పునరావసం, పరిహారం(ఆర్ అండ్ ఆర్)లో పురోగతి సాధించామని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పేర్కొన్నారు. తూర్పు గోదావరిలో మొత్తం 234, పశ్చిమ గోదావరిలో 137 నివాసాలు ముంపుకు గురవుతున్నాయని, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలు తూర్పులో 70,929, పశ్చిమలో 27,887 ఉన్నాయని తెలిపారు.

పార్లమెంట్‌లో ఏపి ఎంపిల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌లో ఏపి ఎంపిల చేస్తున్న ఆందోళన సోమవారం కూడా కొనసాగింది. తొలుత పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టిడిపి ఎంపిలు తమ ఆందోళనను కొనసాగించగా, వైసిపి ఎంపిలు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద (గేట్ నెంబర్ 1) ఆందోళన చేశారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. చిత్తూరు ఎంపి శివ ప్రసాద్ సన్నాయి ఊదుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం పార్లమెంట్ ఉభయ సభల్లోనూ హోదా, విభజన హామీల అమలును పట్టుబడుతూ ఏపి ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లారు. మరోవైపు కాంగ్రెస్, టిఎంసి, సిపిఎం, అన్నాడిఎంకె, టిఆర్ఎస్ ఎంపిలు తమ తమ డిమాండ్లతో వెల్‌లోకి దూసుకెళ్లి పెద్ద ఎత్తున నినాదాలివ్వడంతో సభలో గందరగోళం నెలకొంది. రాజ్యసభలో ప్రత్యేక హోదాపై స్పందించాలని వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి సావదాన తీర్మాన (కాలింగ్ అటెన్షన్) నోటీసు ఇచ్చారు. ఏపి సభ్యుల ఆందోళనతో పార్లమెంటు ఉభయ సభల వాయిదాల పర్వం కొనసాగింది. ఉదయం 11 ఉభయ సభలు ప్రారంభం కాగానే ఏపి ఎంపిలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను 12 గంటల వరకు వాయిదా వేశారు.

చంద్రబాబు వల్లే ప్రత్యేక హోదాకు విఘాతం

గుంటూరు జిల్లాలోకి జగన్ పాదయాత్ర

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోవడానికి సిఎం చంద్రబాబే ప్రధాన కారకుడని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ తెలిపారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా నుంచి పాదయాత్రగా గుంటూరు జిల్లాలోకి సోమవారం ఉదయం ప్రవేశించిన జగన్‌కు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. స్టూవర్టుపురం, బేతపూడి, వెదుళ్లపల్లి, వడ్డెరపాలెం, కుక్కలవారిపాలెం, మహాత్మాజీపురం, కొత్తపాలెం మీదుగా సోమవారం సాయంత్రం బాపట్లకు చేరుకున్నారు. ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. అనంతరం బాపట్లలో జమ్ములపాలెంపై ఓవర్ కూడలి వద్ద నిర్వహించిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, 2014 మార్చి 2న అప్పటి కేంద్ర క్యాబినేట్ ప్రణాళిక సంఘానికి సిఫార్సు చేసిందని, 2014 జూన్‌లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 7 నెలలపాటు ఈ అంశాన్ని పట్టించుకోలేదని చెప్పారు. ప్రతిపక్షాల ఆందోళన తర్వాత 2016 సెప్టెంబరు 8న హోదాకు బదులు ప్యాకేజి ఇస్తామని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటనను చంద్రబాబు బేషరతుగా అంగీకరించారని చెప్పారు. దేశం మొత్తం వృద్ధి రేటు 7 నుంచి 8 శాతం, ఇతర దేశాల్లో 2 నుంచి 3 శాతం ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 12 శాతం ఉన్నట్లు చూపడంతో



తన సమస్యను జగన్‌కు చెబుతున్న మహిళ

రాష్ట్రానికి హోదా రాలేదని మండిపడ్డారు.

కేంద్ర, రాష్ట్ర మంత్రుల రాజీనామా సందర్భంగా బిజెపి, టిడిపి నాయకులు ఒకరినొకరు పొగుడుకోవడం వారి కపట నాటకానికి నిదర్శనమన్నారు. కేంద్రంపై అవిశ్వాసం పెట్టడానికి చంద్రబాబు ముందుకు రావడంలేదని, కనీసం 25 మంది ఎంపీలతో రాజీనామా చేద్దామన్నా అంగీకరించడం లేదని, హోదా సాధనపై ఆయనకు చిత్తశుద్ధి లేదని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా పరిశీలకులు బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు కోన రఘుపతి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ముస్తాఫా పాల్గొన్నారు.

చెరువులో పడి ముగ్గురు మృతి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురంలోని కట్టకిందపల్లి గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు నీటమునిగి ముగ్గురు మృతిచెందారు. రూరల్ సిఐ ఎంహెచ్.క్రిష్ణమోహన్ వివరాల ప్రకారం.. కట్టకిందపల్లి గ్రామానికి చెందిన నారాయణ భార్య లక్ష్మినారాయణమ్మ (42) బట్టలు ఉతకటానికి ఆలుమూరు చెరువు వద్దకు వెళ్లింది. ఆమెతోపాటు కుమారుడు అఖిల్ (12), స్నేహితుడు నందకిషోర్(12) చెరువు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో అఖిల్, నందకిషోర్‌లు ఈత కొట్టడానికి చెరువులోకి దిగారు. చెరువులో నీరు లోతుగా ఉండటంతో వీరిద్దరూ నీటిలో మునిగిపోతూ కేకలు వేశారు. ఇది గమనించిన లక్ష్మినారాయణమ్మ వారిని రక్షించటానికి చెరువులోకి దూకింది. నందకిషోర్, అఖిల్‌కు ఈత రాకపోవటంతో నారాయణమ్మను గట్టిగా పట్టుకున్నారు. దీంతో ఊపిరాడక నారాయణమ్మ కూడా నీటిలో నుంచి బయటకు రాలేక పోయింది. దీంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. అటుగా వెళ్తున్న వారు గమనించి ముగ్గురినీ బయటకు తీశారు. అయితే అప్పటికే వారు మృతి చెందారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రవాణా శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఆర్టీసి నూతనంగా ప్రవేశపెట్టిన తొమ్మిది అమరావతి బస్సు సర్వీసులను సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఒక్కో బస్సును రూ.1.25 కోట్లకు కొనుగోలు చేశామన్నారు. ఏడు బస్సుల్ని కృష్ణా రీజియన్‌కు, మరో రెండు బస్సుల్ని విశాఖ రీజియన్‌కు కేటాయించామన్నారు. ఈ ఏడాది ఆర్టీసి నష్టాల్ని రూ.350 కోట్లు తగ్గించగలిగామని, వచ్చే ఏడాది నాటికి నష్టాలు లేకుండా ఉండేందుకు కృషి చేస్తామన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68